
మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



సేఫ్‌జోన్‌పై ఇజ్రాయెల్ దాడి
71 మంది మృతి

ఎట్టకేలకు ఇమ్రాన్‌ఖాన్ దంపతులు విడుదల

లోపలి పేజీల్లో..



సంపుటి 27, సంచిక: 30 | ఆదివారం | 14-07-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00





ఈ విద్యా సంవత్సరం నుంచే

# ఫీ రీయింబర్స్‌మెంట్

విద్యార్థులకు ఎలాంటి అనుమానాలు వద్దు

పాత బకాయిల అంశాన్ని పరిష్కరించే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబుకు అప్పగిస్తున్నాం

ఇంజినీరింగ్ కాలేజీలు నిరుద్యోగుల ఉత్పత్తి కర్మాగారాలు కాకూడదు

జెఎన్‌టియులో 'క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్'పై ఇంటరాక్షన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

రకరకాల పరిస్థితులలో ప్రాధాన్యతలు మారిపోయి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, ప్రస్తుత 2024–25 విద్యా సంవత్సరం నుంచి నిర్ణీత సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఎలాంటి అనుమానం అక్కర్లేదని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలపై ఎలా ముందుకెళ్లాలనే అంశాన్ని పరిష్కరించే బాధ్యత రాష్ట్ర మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబుకు అప్పగిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై త్రిముఖ వ్యూహంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని సిఎం వెల్లడించారు. ప్రతీ పేదవాడి బిడ్డ గొప్పగా చదవాలని అప్పటి సిఎం వైఎస్‌ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిర్ణయం తీసుకున్నారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. జెఎన్‌టియులో శనివారం జరిగిన 'క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్'పై

తరువాయి 2లో

## కేరళ తరహా 'మోరల్ పోలీసింగ్'

డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థులు సహకరించాలి

అన్ని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో కేరళ తరహా 'మోరల్ పోలీసింగ్ సిస్టం'ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మోరల్ పోలీసింగ్ విధానంతో అన్ని రకాల సమస్యలనూ పరిష్కరించవచ్చన్నారు. సమస్యలకు భయపడి పారిపోవద్దని,నిలబడి సమస్యలపై పోరాడాలని, జీవితంలో ఫోకస్‌గా

తరువాయి 2లో

అసెంబ్లీ ఉప ఎన్నికల్లో

# 'ఇండియా కూటమి' జయకేతనం



13లో పది స్థానాల్లో విజయదుందుభి

రెండు చోట్ల బిజెపి, మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపు





**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల తరువాత తొలిసారి జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 'ఇండియా కూటమి' విజయ కేతనం ఎగురవేసింది. ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇటీవల ఉప ఎన్నికలు జరగగా, శనివారం ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఉప ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో 'ఇండియా కూటమి' పార్టీల అభ్యర్థులు, రెండింటా బిజెపి, ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. గత ఎన్నికల్లో ఎన్‌డిఎ – 3 (బిజెపి–2, జెడియు – 1), ఇండియా కూటమి – 6 (కాంగ్రెస్ – 2, టిఎంసి – 2, డిఎంకె – 1, ఆప్ – 1) స్వతంత్రులు – 3 స్థానాల్లో గెలుపొందారు. వివిధ కారణాలతో ఈనెల 10వ తేదీన పశ్చిమబెంగాల్‌లోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో, హిమాచల్‌లో మూడు, ఉత్తరాఖండ్‌లో రెండు, పంజాబ్, మధ్యప్రదేశ్, బీహార్, తమిళనాడులో ఒకటి చొప్పున స్థానాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, టిఎంసి, ఆప్, డిఎంకె సహా ఇండియా కూటమిలోని పలు పార్టీలు తమ అభ్యర్థులను పోటీలో నిలిపాయి.

**పంజాబ్‌లో ఆప్, తమిళనాడులో డిఎంకె ఘన విజయం**

పంజాబ్‌లో అధికార పార్టీ ఆప్‌కు చెందిన మహిందర్ భగత్ జలంధర్ పశ్చిమ నియోజకవర్గంలో విజయం సాధించారు. తన సమీప బిజెపి అభ్యర్థి సీతల్‌పై 37,325 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల కమిషన్ పేరొంది. ఆప్ శాసనసభ్యుడిగా సీతల్ తన పదవికి రాజీనామా చేశారు. మార్చిలో ఆయన బిజెపిలో చేరారు. దీంతో ఈ స్థానంలో ఖాళీ ఏర్పడింది. కాగా, ఉప ఎన్నికల్లో ఆప్ విజయం సాధించడంపై సిఎం భగవంత్ మాన్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ పనులు చూసి ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. తమిళనాడులో అధికార డిఎంకె అభ్యర్థి అన్నియూర్ శివ విక్రవండి నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తన సమీప ఎన్‌డిఎ అభ్యర్థి పట్టాలి మక్కల్ కచ్చికి చెందిన అంబుమణి సిపై 67,757 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

**బెంగాల్‌లో టిఎంసి హవా**

ఇక పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది జోరు మీద ఉన్న తృణమూల్ కాంగ్రెస్ ఈ ఉప ఎన్నికల్లో కూడా తన హవా కొనసాగించింది. రాష్ట్రంలో నాలుగు స్థానాల్లో ఉప ఎన్నికలు జరగగా, రాయ్‌గంజ్ అసెంబ్లీ స్థానంలో కృష్ణ కల్యాణి గెలుపొందారు. తన సమీప బిజెపి అభ్యర్థి మనస్ కుమార్ ఘోష్‌పై 50,077 ఓట్ల మెజారిటీతో గెలిచారు. రాణాఘట్ దక్షిణలో బిజెపి అభ్యర్థి మనోజ్‌కుమార్ బిస్వాస్‌ను 74,485 ఓట్ల మెజారిటీతో ముకుత్ నామి అధికారి ఓడించారు. బగ్దా నియోజకవర్గంలో టిఎంసి అభ్యర్థి మధుపర్ణ ఠాకూర్ బిజెపి అభ్యర్థి బినయ్ కుమార్ బిస్వాస్‌పై 74,251 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మాణిక్ తలా నియోజకవర్గంలో సుప్తి పాండే తన సమీప బిజెపి అభ్యర్థి కల్యాణ్ చౌబేపై 62,312 ఓట్ల మెజారిటీ సాధించారు.

**హిమాచల్‌లో సిఎం సతీమణి విజయం**

హిమాచల్ ప్రదేశ్‌లో దేహ్రా నియోజకవర్గంలో ముఖ్యమంత్రి

తరువాయి 2లో



## కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

బిఆర్‌ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎంఎల్‌ఎ అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో శనివారం అరికెపూడి గాంధీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంఎల్ఎతో పాటు నియోజకవర్గంలోని పలువురు కార్పొరేటర్లు, అనుచరులు సిఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ లో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ మీడియాతో మాట్లాడుతూ తన నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్‌లో పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుబులు పుట్టిస్తున్న 'చాందిపుర'

భయపెడుతున్న మరో ప్రాణాంతక వైరస్

గుజరాత్‌లో నలుగురు చిన్నారులు మృతి



**గాంధీనగర్ :** కరోనా వైరస్ ప్రభావం ఇంకా పూర్తిగా తగ్గలేదు. రకరకాల వేరియెంట్‌లతో తన పంజా విసురుతూనే ఉంది. ఇలాంటి తరుణంలో మరిన్ని ప్రాణాంతక వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. ప్రజల జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తూ.. అల్లకల్లోల వాతావరణం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు తాజాగా చాందిపుర అనే వైరస్ గుబులు పుట్టిస్తోంది. ఇప్పటికే దీని బారిన పడి నలుగురు పిల్లలు మృతి చెందారు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. దీంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటీవల గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలో నలుగురు పిల్లలు జ్వరం, ఫ్లూ వంటి లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. అయితే.. కొన్ని రోజుల్లోనే వాళ్లు చనిపోయారు. ఈనెల 10వ తేదీన వారు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో.. వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. చాందిపుర వైరస్ వల్లే వీళ్లు

తరువాయి 2లో

## ఆర్టీసీ బలోపేతానికి చర్యలు

దసరా లోపు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 30 డీలక్స్, 30 ఎక్స్‌ప్రెస్ బస్సులు

నార్కెట్‌పల్లి డిపోకు పునర్ వైభవం

మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వెల్లడి

ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి




నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పా టైన తర్వాత నష్టాలలో నడు స్తున్న ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు అన్ని రకాల పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వెల్లడించారు. శనివారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని బస్సు డిపోలో నల్లగొండ హైదరా బాద్ కు ఒక ఏసీ బస్సు, 4 డీలక్స్ బస్సులను, అలాగే పల్లె వెలుగు బస్సును రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ను, కార్మికులను సంరక్షించేందుకు నూతన ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకున్నద న్నారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటై న 48 గం టల లోపే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, నూతనంగా 1000 బస్సులను కొనుగోలు చేశామని, మరో 1500 బస్సులను కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాకు వచ్చే దసరా నాటికి 30 డీలక్స్ బస్సు లు ,మరో 30 ఎక్స్ ప్రెస్ బస్సులను మంజూరు చేస్తామని, అలాగే హైదరాబాద్, తిరుపతిలకు ఏసి బస్సులను నడపనున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 7 బస్సు డిపోలు ఉన్నాయని, 645 బస్సులు రెండు లక్షల 55000 కిలోమీటర్ల ప్రయాణించి, 3 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తు న్నట్లు మంత్రి

తరువాయి 2లో



## ట్రిపుల్ ఆర్ సర్వే అడ్డగింత

పాత అలైన్మెంట్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని రెడ్డిపల్లి గ్రామస్తుల ధర్నా

ప్రజాపక్షం/నర్సాపూర్

కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల పేరిట గ్రామాల్లోని భూములు కోల్పోతున్న రైతుల ఆవేదన ప్రభుత్వ అధికారులకు పట్టదా అంటూ శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి చౌరస్తా, హైదరాబాద్ మెదక్ ప్రధాన రోడ్డులో రైతులు ధర్నా నిర్వహించారు. ట్రిపుల్ ఆర్ సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. గ్రామస్తులు సర్వే నిర్వహించరాదని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, పాత సర్వే ప్రకారమే ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని, పాత చార్వేను వదిలిపెట్టి కొత్తగా రైతుల భూముల నుంచి చెరువుకుంటల మధ్యలో నుంచి చేపడుతున్న ట్రిపుల్ ఆర్ సర్వేను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ, రైతులు రోడ్డుపై బైఠాయించారు. ఇప్పటికే రెడ్డిపల్లి గ్రామ శివారులో గల వ్యవసాయ భూములలో నుండి కాళేశ్వరం చత్తీస్‌ఘడ్ విద్యుత్ స్తంభాలు కొండపోచమ్మ కాల్వతో

తరువాయి 2లో

## విద్యా రంగంలో దెబ్బతిన్న సమతుల్యం

డాక్టర్, ఇంజినీరింగ్ వైపు పరుగులు

వెలవెలబోతున్న డిగ్రీ కళాశాలలు

ఇతర విద్యా కోర్సులకు ఆదరణ కరువు

ప్రజాపక్షం/ ఖమ్మం



ప్రకృతి సమతుల్యత మాదిరే విద్యా రంగంలోను సమతుల్యత అవసరం. కాని విద్యార్థుల కంటే విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచనలో వచ్చిన మార్పు విద్యారంగ సమతుల్యతను దెబ్బతీస్తుంది. చదువంటే కేవలం సాంకేతిక విద్యను అభ్యసించడమేనన్న ఒక భావన తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుపోయింది. గత పదేళ్ల నుంచి తమ కొడుకు ఇంజనీర్ కావాలి లేదంటే డాక్టర్ కావాలి అనే ఆలోచన తప్ప మరోవిధంగా ఆలోచించడం లేదు. బాల్యపు గుర్తులు పోక ముందే వివిధ పేర్లతో వెలిసిన విద్యాలయాల్లో పెట్టి ఐఐటి, నీట్, ఇలా రకరకాల కోర్సులతో వాళ్ల మెదళ్లను తొలిచేస్తున్నారు. గతంలో ఆరు సబ్జెక్టులను ప్రాథమిక విద్యతో ప్రారంభమై బోధన సాగేది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే వారు. పది తర్వాత విద్యార్థి ఎంచుకునే గ్రూపులను బట్టి విద్యా బోధన ఉండేది. ఇంగ్లీష్‌ను తప్పనిసరి చేస్తూ రెండవ భాషగా తెలుగు లేదా హిందీని ఎంచుకునే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు కార్పొరేట్ మొదలు చాలా పాఠశాలల్లో అన్ని

తరువాయి 2లో




రియల్ ఎస్టేట్ వెంచర్లకూ...

## కోట్లకుపైనే

రాళ్ల రప్పలకు కూడా 'రైతుబంధు'

ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి

అన్నదాతలను అప్పుల బాద నుండి ఆదుకునేందుకు గత ప్రభుత్వం పంట సాగుకు సహాయం అందించేందుకు సదుద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన రైతుబంధు పథకం పక్కదారి పడుతుంది. రాళ్లు, రప్పలకే కాదు రియల్ ఎస్టేట్ వెంచర్లకు కూడా రైతుబంధు సొమ్ము అందుతుంది. ధరణి పోర్టల్‌లో పొందుపరచిన భూ సర్వే నెంబర్లు, రైతుల వివరాలను చూస్తే విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఏడాదికి సుమారు కోటి రూపాయలకుపైగానే పంట సాగు రైతుబంధు డబ్బులు పక్కదారి పడుతున్నట్లు స్పష్టం అవుతుంది. ఇదంతా సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలిసినా వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

రైతుకు పట్టెదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రైతుబంధును వర్తింప చేస్తుంది. రైతులు హక్కు ఉన్న వ్యవసాయ భూములు పంట సాగు చేస్తున్నారా... లేదా అనేది ఎవ్వరు

తరువాయి 8లో

## సంపద పన్నుపై మోదీ వైఖరేమిటి?

కాంగ్రెస్ సూటిప్రశ్న



**న్యూఢిల్లీ :** బ్రెజిల్ దేశం రియోడిజెనిరిలో నెలాఖరులో జరగబోయే జి–20 ఆర్థిక మంత్రుల సమావేశానికి ముందే శతకోటీశ్వరులపై 2 శాతం సంపద పన్ను విధింపు గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సంపద పన్ను ప్రతిపాదనపై బ్రెజిల్ సమావేశంలో చర్చించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా శతకోటీశ్వరుల(బిలియనీర్ల)పై సముచిత వాటా పన్నుగా విధించాలనే డిమాండ్‌పై ఏకాభిప్రాయం పెరుగుతోందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ మేరకు బ్రెజిల్ చేసిన ప్రతిపాదనను ఫ్రాన్స్, స్పెయిన్, దక్షిణ ఆఫ్రికా, జర్మనీ దేశాలు సమ్మతి తెలియజేశాయని, ప్రపంచమంతా శతకోటీశ్వరులపై 2 శాతం పన్ను విధించే దిశగా అడుగులు వేస్తున్నాయని

తరువాయి 8లో

# సేఫ్‌జోన్‌పై ఇజ్రాయెల్ దాడి : 71 మంది మృతి

## హమాస్ అగ్రనేత డైఫ్ మరణం?





**గాజా :** హమాస్ ఉగ్రవాదులే లక్ష్యంగా ఇజ్రాయెల్ శనివారంనాడు సేఫ్ జోన్‌పై తాజా దాడులకు తెగబడటంతో 71 మంది మరణించారు. ఐతే హమాస్ అగ్రశ్రేణి నాయకుడు డైఫ్ ఈ దాడుల్లో మరణించాడా? లేదా? అని ఇజ్రాయిల్ సైనికులు అన్వేషిస్తున్నారేతప్ప 71 మంది సామాన్య ప్రజలు ఈ దాడుల్లో మరణించిన విషయాన్ని ఏ కోశానా పట్టించుకోవడంలేదు. పశ్చిమ ఖాన్‌యూనిస్‌లోని అల్‌మవసీ శరణార్థుల శిబిరంపై జరిపిన గగనతలదాడుల్లో 71 మంది మరణించగా మరో 289 మంది గాయపడ్డారు. శిథిలాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ ప్రభుత్వమే తొలుత ఈ ప్రాంతాన్ని 'సేఫ్‌జోన్'గా ప్రకటించింది. దీంతో సామాన్య ప్రజలు ఇక్కడ తలదాచుకున్నారు. ఖాన్‌యూనిస్‌రఫా మధ్య 12 కి.మీ విస్తీర్ణంలో ఉన్న అల్‌మవసీ ప్రాంతం అత్యంత సుందరమైన ప్రకృతి దృశ్యాలకు నిలయంగా ఉంటుంది. కానీ ఈనాడు అది శవాలదిబ్బగా మారింది. ఇజ్రాయిల్ సైన్యం ఉద్దేశపూర్వకంగానే సురక్షిత ప్రాంతంపై దాడులకు తెగబడి ప్రజల ప్రాణాలు బలితీసుకుందని పలు దేశాలు విమర్శించాయి. ఐతే తాము అగ్రశ్రేణి హమాస్ ఉగ్రవాద నాయకుడు డైఫ్ కోసమే ఈ దాడులు చేశామని నేతన్యాహూ ప్రకటించారు. అతడు ఈ దాడుల్లో మరణించాడో? తప్పించుకున్నాడో? తమ సైన్యం పరిశీలిస్తోందని అన్నారు. కాగా గత ఏడాది అక్టోబరు ఏడో తేదీ నుండి ఇప్పటివరకూ ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో మరణించిన పాలస్తినా ప్రజలసంఖ్య 1,80,000 దాటి ఉంటుందనీ, దాడుల్లో గాయపడినవారి సంఖ్య 88,298కు చేరి ఉంటుందనీ లాన్సెట్ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఇప్పటివరకూ ముగ్గురు మహిళా జర్నలిస్టులతోసహా 51 మంది పాలస్తినా జర్నలిస్టులను గాజా వెస్ట్‌బ్యాంక్‌ల నుండి ఇజ్రాయిల్ సైన్యం అరెస్టు చేసింది.



రష్యా–ఉక్రేన్ మధ్య డ్రోన్ దాడులు తీవ్రరూపం దాల్చాయి. సరిహద్దున ఉన్న కీవ్ నుంచి ప్రయోగించిన డ్రోన్ దాడిలో మంటలకు ఆహుతవుతున్న రష్యా ఆయిల్ డిపో. రొస్తోవ్‌లోని ఈ ఆయిల్ డిపో 200 చదరపు మీటర్లు (2,100 చదరపు అడుగులు) విస్తీర్ణంలో ఉంది. డిపో భారీగా ధ్వంసమైందని, మంటలు పెద్దఎత్తున ఎగసిపడ్డాయని, అగ్నిమాపక సిబ్బంది సుమారు ఐదు గంటలు ప్రయత్నించి మంటలు ఆర్పారని రొస్తోవ్ రీజనల్ గవర్నర్ వాసిలీ గొలుబెవ్ ప్రకటించారు. ఈ దాడిలో ఎవరూ గాయపడినట్టు సమాచారం అందలేదన్నారు.

ప్రపంచం

## పోటీలోనే ఉన్నా : మనం గెలుస్తున్నాం

### డెట్రాయిట్ ర్యాలీలో బైడెన్ ప్రకటన



**డెట్రాయిట్ :** నేను పోటీలోనే ఉన్నాననీ, మనం గెలుస్తున్నామనీ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. డెట్రాయిట్‌లో శనివారం జరిగిన పార్టీ ర్యాలీలో ఆయన కేరింతల మధ్య ప్రసంగించారు. డోనాల్డ్ ట్రంప్ పై విమర్శలు కురిపించారు. ''నేను ఎక్కడికీ పోవడంలేదు, నేను అధ్యక్షపదవికి పోటీలోనే ఉన్నాను, ఇంతకుముందు మనం గెలిచాం, ఈసారి కూడా మనం గెలుస్తున్నాం'' అని బైడెన్ అభిమానుల కేరింతల మధ్య ఉల్లాసంగా ప్రకటించారు. మతిమరుపు దేశాధ్యక్షుడుగా పేరుపొందిన బైడెన్ ప్రజలదృష్టిని ఆ సమస్య నుండి మళ్ళించేందుకు డెట్రాయిట్ ర్యాలీలో విశ్వప్రయత్నం చేశారు. మతిమరుపు కారణంగా సంభాషణల్లో, ఉచ్చారణలో అనేక వరుస తప్పులు చేస్తున్నప్పటికీ ఈ దశలో అభ్యర్థిని మార్చడంవల్ల పార్టీకి తీవ్రనష్టం జరుగుతుందని డెమోక్రటిక్‌పార్టీ నిర్ణయించుకోవడంతో బైడెన్ ప్రజలదృష్టి మళ్ళించేందుకు డెట్రాయిట్ ర్యాలీని బ్రహ్మాండంగా ఏర్పాటు చేశారు. ''నేను ఎక్కడికీ పోవడంలేదు, నేనే డెమోక్రటిక్‌పార్టీ అధ్యక్ష అభ్యర్థిని, గతంలో గెలిచాం, ఇప్పుడు కూడా గెలుస్తున్నాం, ఐతే మనం చేయాల్సిందల్లా ఒక్కటే, ఇప్పుడు రాజకీయాలను ఒక ఎంటర్‌టైన్‌మెంట్‌గానో, ఒక టీవీ రియాల్టీ షో లాగానో మార్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు జరగకుండా అడ్డుకోవాలి'' అని బైడెన్ అన్నారు. డోనాల్డ్ ట్రంప్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ట్రంప్ గనుక అధికారంలోకి వస్తే 2025 ఛాందసవాదుల విధానాల అమలుకు కేంద్రబిందువుగా మారుతుందని, ఆయన గెలుపు దేశానికి చచ్చేంత ప్రమాదకరమని హెచ్చరిక చేశారు. ట్రంప్ గెలుపువల్ల దేశ ఫెడరల్ గవర్నమెంట్‌కు పెద్ద ముప్పు వాటిల్లుతుందని ఆయన హెచ్చరించారు.

## నైజీరియాలో కుప్పకూలిన స్కూల్ బిల్డింగ్

### 22 మంది మృతి



**అబూజా :** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో కాలం చెల్లిన స్కూలుబిల్డింగ్ కుప్పకూలిపోయింది. దీంతో కనీసం 22 మంది విద్యార్థులు మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. శిథిలాలలో మొదట 154 మంది విద్యార్థులు చిక్కుకున్నా రు. వీరిలో 132 మందిని కాపాడి వివిధ ఆసుపత్రులకు తరలించారు. వారికి చికిత్సలు చేస్తున్నారు.ప్లాట్యూ రాష్ట్రం బుసా బుజీ కమ్యూనిటీకి చెందిన సెయింట్ అకాడమీ స్కూలు బిల్డింగ్‌లో పరీక్షలుజరుగుతున్న సమయంలో ఈదుర్ఘటన జరిగింది. విద్యార్థులందరూ 15లేదా అంతకంటే తక్కువ వయసు ఉన్న వారే. పెద్దసంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆ ప్రాంతానికి చేరుకుని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ బిడ్డల ను రక్షించుకునేందుకు వారు కూడా సహాయ కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం తరగతులకు హాజరైన వెంటనే ఈ ఘటన జ రిగిందని అధికారులు శనివారం ఒక ప్రకటన చేశారు. సహాయ కార్యక్రమాలు ముగిశాయని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి దేశంలో ఇంకా ఈ విధంగా కాలం చెల్లిన స్కూలు లేదా ఇతర ప్రభుత్వ భవంతులు ఉంటే వెంటనే గుర్తించి వాటిని ఖాళీ చేయాలని ఆదేశించింది.





కాలిఫోర్నియా (అమెరికా) నుంచి ప్రయోగించిన స్పేస్‌ఎక్స్ రాకెట్ ప్రయోగం విఫలమైంది. ప్రైవేటు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపే ఈ కంపెనీ గత పదేళ్లుగా రాకెట్లను పంపుతుండగా, తొలిసారి ప్రమాదం చోటు చేసుకుంది. 20 స్టార్‌లింక్ ఉపగ్రహాలను మోసుకెళ్లిన ఫాల్కాన్ 9 అనే వ్యోమనౌక నింగిలోకి దూసుకెళ్లిన తర్వాత, అందులో ఆక్సీజన్ లీకేజీని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనితో వ్యోమనౌకను భూమికి కేవలం 84 మైళ్లు (135 కిలోమీటర్లు) ఎత్తులోని కక్షలోకి పంపే ప్రయత్నం చేయగా, వాతావరణ ప్రభావంతో అది పేలిపోయింది.

## ఎట్టకేలకు ఇమ్రాన్‌ఖాన్ దంపతులు విడుదల



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు ఇద్దాత్ కేసు నుండి విముక్తి కలిగింది. వివిధ కేసుల్లో ఏడాదిపాటు జైలులో ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌కు ఉన్న చిట్టచివరి ఆటంకం కూడా తొలగిపోవడంతో చట్టబద్ధంగా ఇప్పుడు స్వేచ్ఛాజీవిగా మారారు. అనేకసార్లు ఇమ్రాన్‌ఖాన్, ఆయన భార్య ఇద్దాత్ కేసులో చేసిన విజ్ఞప్తులను ఆలకించిన ఇస్లామాబాద్ సెషన్స్, జిల్లాకోర్టు వారి గోడు ఆలకించి జైలు నుండి విముక్తి చేసింది. ''ఇతర అనేక కేసులలో నిందితులుగా ఉన్న ఈ దంపతుల అవసరం ఇతర కేసుల విచారణకు అవసరం లేదనుకుంటే వారికి వెంటనే తాత్కాలికంగా విడుదల చేస్తున్నాం'' అని న్యాయమూర్తి అఫ్జల్ మజోకా శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఒక ప్రకటన చేశారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో దాడులు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన కేసులో మొదటిసారి 2023 మే 9న ఇమ్రాన్‌ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆయనపై సుమారు 200 కేసులు నమోదయ్యాయి. ఒక్కొక్క కేసులో కోర్టులు క్రమంగా తీర్పులు ఇస్తూ వచ్చిన తర్వాత ఈ తాజా కేసులో ఉన్న ఆటంకం కూడా చిట్టచివరిగా తొలగిపోయింది. తదుపరి వివరాల కోసం ఆయన కార్యకర్తలంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఇమ్రాన్‌ఖాన్ భార్య బుష్రా బీబీ మొదటి భర్త ఖావర్ ఫరీద్ మనేకా చేసిన ఫిర్యాదు మేరకు పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికలకు ముందుగా ఇమ్రాన్ దంపతులకు ఇస్లామాబాద్ కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 3న ఏడేళ్ళు జైలుశిక్ష విధించింది. దీంతోపాలు వారికి ఐదు లక్షలరూపాయలు జరిమానా కూడా విధించారు. ఆయనపై ఉన్న తోషాఖానా కేసును రద్దు చేయగా, సిఫార్ కేసు నుండి ఆయన విముక్తుడయ్యారు.

## త్రిపుల్ ఆర్ సర్వే అడ్డగింత

(మొదటి పేజీ తరువాయి)

పాటు రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాలు జరుగుతుంది. గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయం చేసుకునే భూములను కోల్పోతున్నామని మాకు వ్యవసాయం చేసుకోవడానికి గుంట భూమి కూడా మిగలకుండా ప్రాజెక్టులకే పరిమితమైతున్న రెడ్డిపల్లి భూములు వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి ఎస్సై పుష్పరాజ్‌లు చేస్తున్న రైతుల వద్దకు చేరుకొని వారికి నచ్చజెప్పి చూసిన రైతులు వినకపోవడంతో సర్వేకొచ్చిన అధికారులు వెను దిరిగరు. మహేష్‌గౌడ్, రవి గౌడ్, నాగేష్, భూమా గౌడ్ తదితర రైతులు పాల్గొన్నారు.

## గుబులు పుట్టిస్తున్న 'చాందిపుర'

(మొదటి పేజీ తరువాయి)

మృతి చెంది ఉంటారని హిమ్మత్‌నగర్ ఆసుపత్రి పీడియాట్రిక్ వైద్యులు భావిస్తున్నారు. మరో ఇద్దరు చిన్నారుల్లోనూ అవే లక్షణాలు కనిపించడంతో.. వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మొత్తం ఆరుగురు పిల్లల రక్త నమూనాలను సేకరించి..పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్‌ఐవి)కి పంపారు. వాటి ఫలితాల కోసం వేచి చూస్తున్నామని సబర్‌కాంత జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రాజ్ సుతారియా వెల్లడించారు. ఈ చాందిపుర వైరస్ మెదడువాపుకు కారణమవుతుంది. ఇది సోకిన కొన్ని రోజుల్లోనే రోగి మరణిస్తాడు.ఇది దోమలు, పురుగుల ద్వారా వ్యాపిస్తుంది. ఈ వైరస్ సోకిన వారిలోజ్వరం, ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ వైరస్ కారణంగా నలుగురు పిల్లలు రోజుల వ్యవధిలోనే మృతి చెందడంలో.. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు..ప్రభావిత ప్రాంతాల్లో పురుగులను చంపేస్తున్నారు. ప్రజలు సైతం అలర్ట్‌గా ఉండాలని,అసురక్షిత ప్రాంతాల్లో ఎక్కువగా సంచరించొద్దని హెచ్చరికలు జారీ చేశారు.ఎవరిలోనైనా జ్వరం,ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తే.. వెంటనే దగ్గరలోని ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ఫీ రీయింబర్స్‌మెంట్

(మొదటి పేజీ తరువాయి)

ఇంటరాక్షన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మారకూడదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్తును నిర్మించేలా ఉండాలని,అందుకు కావాల్సిన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాకుండా దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ సంస్థలు ఉండాలన్నారు. ఇంజనీరింగ్‌లో కేవలం కంప్యూటర్ సైన్స్ పైనే కాదు సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలని సిఎం సూచించారు. దేశంలో, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలన్నీ ఇంజనీర్లు సృష్టించినవేనని, మానవ నిర్మిత అద్భుతాలన్నీ ఇంజనీర్లు ఆవిష్కరించినవేనన్నారు. ఫార్మా, ఐటి తరువాత ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతోందని, యువత కోసం త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి భేషజాలు లేవని, నిరుద్యోగులకు మేలు జరిగేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయన్నారు. నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళుతోందని సిఎం స్పష్టం చేశారు. పదేళ్ల ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కొట్లాడిందని, కానీ ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేస్తున్నారన్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను తీసుకురానున్నామని, యుపిఎస్‌సి తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని సిఎం చెప్పారు. విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదనేదే తమ ప్రభుత్వ విధానమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసామని, ఆర్థిక భారం, ఇతర సమస్యలు ఉన్నప్పటికీ ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు.

## ఉక్కుపరిశ్రమను ఎందుకు ఏర్పాటు చేయడం లేదు

### మాజీ ఎంపి వినోద్ కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్: విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో పొందపర్చిన పెట్రో, కెమికల్, ఆయిల్ రిఫైనరీ హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కాజీపేట రైల్వే కోచ్,బయ్యారం ఉక్కు పరిశ్రమను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని బిఆర్‌ఎస్ మాజీఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ నిలదీశారు. ఎపి సిఎం చంద్ర బాబుపైన కేంద్రం ఆధారపడినందుకే ఎపికి పెట్రో, కెమికల్ హబ్ ఇస్తున్నారని,తెలంగాణపై ఆధారపడలేదని, అందుకే ఏమీ ఇవ్వడం లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 30 ఏళ్లుగా పోరాటం జరుగుతున్నప్పటికీ కేంద్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఎపిలో ప్రాంతీయ పార్టీ గెలిచినందుకే చంద్రబాబు అడిగినవన్నీ ఇస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో 8 మంది ఎంపిలను గెలిపించినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు మొండి చేయి చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఐటిఐఆర్ ఇవ్వలేదని, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని,కొన్నిసార్లు కొన్ని కారణాలతో ఓడిపోతుండవచ్చన్నారు. వచ్చే ఐదేళ్ల తర్వాత బిఆర్‌ఎస్ బ్రహ్మాండమైన మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్న వారు అభివృద్ధి కోసమే పోతున్నాని చెబుతున్నారని, బిఆర్‌ఎస్ హయాంలో కూడా ఇలాగే అభివృద్ధి కోసం చేరుతున్నట్టు చెప్పిన విషయాన్ని వినోద్ కుమార్ గుర్తు చేశారు. పార్టీలు మారే ఎంఎల్‌ఎల పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు.

## దెబ్బతిన్న సమతుల్యత

(మొదటి పేజీ తరువాయి)

సబ్జెక్టులను బోధించడం లేదు. ఒకట్రెండు నెలల్లో సబ్జెక్టులను బోధించి వదిలేసి గణితం, సామాన్యశాస్త్రం పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. దీని వల్ల విద్యార్థి లో సమతుల్యత దెబ్బతింటుంది. అన్నింటికి మించి నిరంతరం తరగతి గదుల్లో ఉండడం ద్వారా సమాజం పట్ల అవగాహన సన్నగిల్లుతుంది. డిగ్రీ పొందిన విద్యార్థి కూడా ఇప్పుడు సమాజంలో ఏమి జరుగుతుంది, సమాజం పట్ల కనీస అవగాహన లేని పరిస్థితి. గణితం, సైన్స్ తప్ప మరె రంగం గురించి వీరికి పరిచయం ఉండడం లేదు. ఇక ఇంటర్ లోను ఇదే పరిస్థితి. మొదటి రెండు నెలల్లో ఇతర అంశాలను పూర్తి చేసి ఇక ఇంజనీర్, డాక్టర్ అంటూ రుద్దడం మొదలు పెడుతున్నారు. చదువంటే ఇంజనీర్ కావడం, డాక్టర్ కావడమేనన్న భావన చాలా మందిలో బలపడింది. ఈ భావన ఎప్పుడైతే బలపడిందో అప్పుడే డిగ్రీ కళాశాలలు వెలవెలబోతున్నాయి. డిగ్రీ చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. డిగ్రీ చదవకపోవడం వల్ల ఇంజనీర్, డాక్టర్ మినహా మిగిలిన ఉద్యోగాలకు అభ్యర్థులు కరువయ్యే పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యతో పాటు ఇతర విద్యా సంస్థలనుకూడా ప్రోత్సహించాల్సి ఉంది. అందరు ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ రంగం పై దృష్టి సారిస్తే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిణామాలు రేపు మరింత నష్టాన్ని చేకూర్చే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్ రంగంలోఉద్యోగాల కోత ఇప్పుడు యావత్ ప్రపంచాన్ని భయపెడుతుంది. ఇన్ని సంవత్సరాలు చదివి ఉద్యోగాలు చేసిన తర్వాత అవకాశం లేదు పొమ్మంటే ఏమి చేయాలో పాలుపోక చాలామంది మానసిక ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పుడు వస్తున్న తరం కూడా ఇంజనీరింగ్ పై దృష్టి సారిస్తే ఇబ్బందులు ఎదుర్కొనక తప్పని పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆలోచనలను ఎప్పటికప్పుడు ప్రోత్సహించాల్సి ఉంటుంది. పాలకులకు ముందు చూపు అవసరం. ఒక పదేళ్ల తర్వాత పరిస్థితి ఏమిటన్నది అంచనా వేయగలగాలి. పాలకులకు ముందు చూపు లేకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న రీతిగా వ్యవహరిస్తే దాని ప్రభావం మొత్తం యువతరం పై పడుతుంది. దీంతో ఆర్థిక మాంద్యం ఏర్పడడంతో పాటు నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగి దేశ భవిష్యత్తు అంధకారం అవుతుంది. ప్రభుత్వ విద్యపై పాలకులకు అంతగా పట్టింపు లేదు. మోడల్ స్కూల్స్, గురుకులాలు అంటూ పరుగులు పెడుతున్నారే తప్ప ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ విద్య గాడి తప్పిందన్న వాస్తవాన్ని గుర్తెరగడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు గణనీయంగా పడిపోతుందన్న దానిపై ప్రభుత్వానికి సరైన ఆలోచన లేదు. ఇదే సమయంలో రకరకాల పేర్లతో పాఠశాలలు ఏర్పాటు చేసి లక్షల రూపాయలను ఫీజుల దోపిడీ చేస్తున్న ఈ పాలకులకు పట్టడం లేదు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాలను గుప్పెట్లో పెట్టుకుని విద్యా వ్యవస్థను శాసిస్తున్నాయన్న ఆరోపణలు వినవస్తున్న నేపథ్యంలో పాలక వర్గంలో ఉన్న వారు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంత సేపటికి ఎటువంటి ఉచితాలు ప్రకటించాలి,వాటిని నెరవేర్చడానికి వేటిని విక్రయించాలి, ఆదాయ మార్గాలు ఏమిటన్న దానిపై ఆలోచన తప్ప భవిష్యత్ సమాజ నిర్మాణమేమిటన్న దానిపై పాలకులు దృష్టి సారించడం లేదు. ఇదే రీతి కొనసాగితే భవిష్యత్ సమాజ పరిణామాలకు ప్రస్తుత పాలకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రైవేటుఫీజుల నియంత్రణ, ప్రభుత్వ విద్యకు ప్రోత్సాహం, విద్యారంగసమతుల్యతనుకాపాడడం పాలకులు తమ బాధ్యతగా గుర్తెరిగితే మంచిది.

## 'మోరల్ పోలీసింగ్ '

(మొదటి పేజీ తరువాయి)



పనిచేయాలని, అప్పుడే లక్ష్యాలను సాధిస్తారని విద్యార్థులకు సూచించారు. జెఎన్‌టియులోని శనివారం జరిగిన 'స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను మనమే గుర్తించి,వాటిని పరిష్కరించుకుంటే దుష్ఫలితాలను నివారించుకోవచ్చన్నారు. సమాజంలో పెడధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణంగా మారిందని,పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలను నివారించవచ్చని సూచించారు. చిన్నారుల మానసిక బలహీనతలను కుటుంబ వ్యవస్థ విచ్చిన్నం కూడా ఒక కారణమని, చిన్నారుల మానసిక దృఢత్వానికి ఉమ్మడి కుటుంబం ఎంతో తోడ్పడుతుందని చెప్పారు. పిల్లలను మానసికంగా సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు పిల్లలకు సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై సీరియస్ గా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని, స్కూల్స్,కాలేజీలలో సబ్జెక్ట్ నేర్పించడమే కాదని, మోరల్ పోలీసింగ్ విధానాన్ని కూడా నేర్పించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించే వ్యవస్థ ఉండాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు అవసరం ఎంతో ఉన్నదని, పోలీసులకు సమాచారం చేరవేసేలా వ్యవస్థను తయారు చేసుకుంటే, రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చవచ్చని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసిందని, డ్రగ్స్‌పై ప్రభుత్వమే యుద్ధంప్రకటించిందని అన్నారు. ''మీ అన్నగా పిలుపునిస్తున్నా... డ్రగ్స్ నిర్మూలన''కు సహకరించాలని కో రారు. ఉద్యమాల గడ్డ తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించినట్టు సిఎం తెలిపారు. ప్రతీ శాసనసభ నియోజకవర్గంలో ఒక స్టేడియంను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వివరించారు. భవిష్యత్ లో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ప్రజాప్రతినిధి అనేది అత్యంత పవిత్రమైన బాధ్యత అని, ప్రజా సమస్యలపై ఫోకస్‌గా పని చేయడం వల్లనే తాను ఈ స్థాయికి చేరానని వివరించారు. నరేంద్రమోదీ,బిల్ గేట్స్,తనకు (రేవంత్ రెడ్డి) ఎవరికైనా రోజుకు 24 గంటలేనని, రోజుకు 16 గంటలు 'మీరు ఎంత ఫోకస్ గా పని చేస్తారో... అది మీ లక్ష్యాన్ని 'అంతే చేరువ చేస్తుందని సిఎం సూచించారు. మన జీవితం మన చేతుల్లోనే ఉన్నదని, మన జీవితాన్ని ఎలా డిజైన్ చేసుకోవాలో కూడా మన చేతుల్లోనే ఉంటుందన్నారు. గొప్ప వ్యక్తులు ఎవ్వరూ గొప్ప కుటుంబాల నుంచి రాలేదని, ఎవరూ ఎవరి కంటే తక్కువేమీ కాదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## జయకేతనం

(మొదటి పేజీ తరువాయి)

సుఖ్వీందర్‌సింగ్ సుక్కు సతీమణి, కాంగ్రెస్ అభ్యర్థి కమలేష్ ఠాకూర్ విజయం సాధించారు. తన సమీప అభ్యర్థి హోషియర్ సింగ్‌పై 9,399 ఓట్ల మెజారిటీతో గెలిచారు. నాలాగఢ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి హర్దీప్ సింగ్ బావా తన సమీప బిజెపి అభ్యర్థి కెఎల్ ఠాకూర్‌పై 25,618 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే హమీర్‌పూర్ స్థానంలో మాత్రం బిజెపి అభ్యర్థి ఆశిష్ శర్మ తన సమీప కాంగ్రెస అభ్యర్థి పుష్పిందర్ వర్మపై 25,470 ఓట్ల మెజారిటీ సాధించారు. ఉత్తరాఖండ్‌లో బద్రినాథ్, మంగలౌర్ స్థానాల్లో ఉప ఎన్నికలు జరగగా, రెండింటిలోనూ కాంగ్రెస్ అభ్యర్థిలు గెలిచారు. బద్రినాథ్‌లో లఖపట్ సింగ్ బటోలా మాజీమంత్రి, బిజెపి ఎంఎల్‌ఎ రాజేంద్రసింగ్ భండారిపై 5,224 ఓట్ల మెజారిటీ సాధించగా, మంగలౌర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఖ్వాజి మహమ్మద్ నిజాముద్దిన్ తన సమీప బిజెపి అభ్యర్థి కర్తార్ సింగ్ భదానపై 422 ఓట్లతో గెలిచారు. మధ్యప్రశ్‌లో బిజెపి అభ్యర్థి కమలేష్ ప్రతాప్ షా అమర్వారా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి ధీరన్ షా ఇన్వాతిపై 3,027 ఓట్ల మెజారిటీతో గెలిచారు. బీహార్‌లో రూపౌలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంకర్ సింగ్ విజయం కేతనం ఎగురవేశారు. తన సమీప జెడియు అభ్యర్థి కలంధర్ ప్రసాద్ మండల్‌పై 8,246 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

## ఆర్టీసీ బలోపేతానికి చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. జిల్లా పరిధిలోకి వచ్చే నార్కెట్ పల్లి బస్సుడిపోకు పునర్ వైభవాన్ని తీసుకువచ్చి అక్కడి నుండి అన్ని ప్రాంతాలకు బస్సులను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంలో భాగం గా 21శాతం డిఏని ఇచ్చామని, 280 కోట్ల బకాయిలలో 80 కోట్లు ఇది వరకే ఇవ్వడం జరిగిందని, 200 కోట్ల రూపాయలను ఈ నెలాఖరునాటికి వారి వారి ఖాతాలలో జమ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ బలోపేతంలో భాగం గా నూతనంగా 3035 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు మంత్రి పేర్కొ న్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన రెండవ రోజే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యా న్ని కల్పించిందని, 60 నుండి 70 కోట్ల మంది మహి ళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. టీజీ ఆర్టీసీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న కృషిని ఆయన అభినందిం చారు. అప్పుల్లో ఉన్న ఆర్టీసీని పైకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభు త్వం అన్ని రకాల చర్య లు తీసుకుంటున్నదని అన్నారు. హైదరాబాద్ తర్వాత ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, 35 లక్షల జనా భాను కలిగి అతి పెద్ద జిల్లా గా నల్లగొండ ఉందని, అందువల్ల జిల్లాకు ప్రత్యేకంగా 25 బస్సులతో పాటు, నార్కెట్ పల్లి ఆర్టీసీ డిపోకి పునర్ వైభవం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, ఆర్‌టిసి ఆర్‌ఎం రాజశేఖర్, డిప్యూటీ ఆర్‌ఎం శివ శంకర్, ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నకిలీ కరెన్సీపై ఆర్‌బిఐ ఫిర్యాదు

ప్రజాపక్షం/హైదరాబాద్: రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.90,650 విలువగల నకిలీ నోట్లు వచ్చాయని ఆర్‌బిఐ అసిస్టెంట మేనేజర్ సాగర్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు ఐదు నెలల వ్యవధిలో తమకు 221 నోట్లు నకిలీవి వచ్చాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో రూ.50 నోట్లు ఒకటి, రూ.100 నోట్లు 55, రూ.200 నోట్లు 83, రూ.500 నోట్లు 65, రూ.2000 నోట్లు 18 వరకు నకిలీవి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ నోట్లు ఫెరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి విచారణ చేస్తే ఈ నోట్లు ఎక్కడ, ఎలా ముద్రించారనే విషయం బహిర్గతమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## విద్యతోనే స్వేచ్ఛ, సమానత్వం సాధ్యం: జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యతోనే స్వేచ్ఛ, సమానత్వం సాధ్యమవుతుందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతీలో శ్రీ నారాయణ గురు ధర్మ ప్రచారణ సభ ఆధ్వర్యలో నిర్వహించిన సెంటినరీ వేడుకలు సర్వమత సమ్మేళనం కార్యక్రమానికి మంత్రి జూపల్లి ముఖ్యతిథిగా హాజరయ్యారు. కేరళకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త శ్రీ నారాయణ గురు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. సమాజంలోని మూఢ విశ్వాసలను, కుల తత్వాన్ని నిరసించి, కులం కారణంగా కొన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని, వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ , సామాజిక స్వాతంత్రం ఉండాలని భావించిన గొప్ప వ్యక్తి నారాయణ గురు అన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానోదయం, సామాజిక మానవత్వాన్ని ప్రోత్సహించేందుకు ప్రయత్నం చేశాడని, కాలానికి అనుగుణంగా మతాన్ని నారాయణ గురు సంస్కరించారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. దశాబ్దాలు, శతాబ్దాలు గడిచినా సమాజంలో ఇంకా అంతరాలు తొలగిపోలేదని.. దీనికి మనషుల ఆలోచన ధోరణి, ప్రభుత్వాలే ప్రధాన కారణమని... వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపారు. మనిషి తనను తాను సంస్కరించుకుని సమాజాన్ని సంస్కరించడమే చదువు యొక్క అర్థం.. పరమార్థం అని, నేటి విద్య వ్యవస్థలో ఇది లోపించిందని, చదవేస్తే ఉన్న మతి పోయినట్లు తయారైందని అన్నారు. నేటి సమాజంలో నేరాలు, ఘోరాలు పెరిగిపోతున్నాయని, యువత ఆలోచన ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, వారిని సన్మార్గంలో నడపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, డా.జయప్రకాష్ నారాయణ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శ్రీ నారాయణ గురు ధర్మ ప్రచారణ సభ ప్రెసిడెంట్ సాయిబాబా గౌడ్, జనరల్ సెక్రటరీ ఉపేందర్, వైస్ ప్రెసిడెంట్లు మురళీ మనోహర్, చెన్నయ్య, కోశాధికారి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టం లేకుంటే ఎంఎల్‌ఎలు బిఆర్‌ఎస్ నుంచి వెళ్లిపోవచ్చు

### మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాపక్షం / హైదరాబాద్: "అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎంఎల్‌ఎలంతా తొందరపడుతున్నారు. ఇష్టం లేకుంటే ఎంఎల్‌ఎలు వెళ్లిపోవచ్చు. కానీ తల్లి లాంటి పార్టీని విమర్శించవద్దు. లోక్ సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీకే కాకుండా ఇంకా 14 పార్టీలకు సీట్లు రాలేదు" అని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నాయకులు వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకసారి ఓడిపోగానే పార్టీల పని అయిపోతుందా? అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్‌ను ఉద్యమంలో కూడా చంపాలని చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారన్నారు. ఇప్పుడు కూడా బిఆర్‌ఎస్‌ను లేకుండా చేయాలనే కుట్రలు సఫలం కావన్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ చేశారు. ఆ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ సత్తా చూపిస్తామన్నారు. స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని, ఆ ఫలితాలు పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లా ఉండబోవని ఆయన పేర్కొన్నారు.

## బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు...

### బిజెఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను బెదిరించి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారని బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఎప్పుడైనా ఏమైనా జరగవచ్చునని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి అవినీతి పాలనపై బిజెపి పోరాటం చేస్తుందన్నారు. ప్రజాక్షేత్రంలో వారి అవినీతిని ఎండగడతామన్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు చాలామంది బిజెపితో టచ్‌లో ఉన్నారని, కానీ రాజీనామా చేసి రావాలని షరతు విధిస్తుండటంతో వెనకడుగు వేస్తున్నట్లుగా ఉందని అన్నారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో శనివారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన 419 హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన అమృత్ పథకం నిధుల టెండర్లలో జరిగిన అవినీతిని నిరూపించేందుకు తాము సిద్ధమన్నారు. గ్లోబల్ టెండర్లలో 40 శాతం లెస్‌కు పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే తాను ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు ప్రభుత్వానికి పట్టడంలేదని, పరిపాలనలో జవాబుదారీతనం, పారదర్శకత లేవన్నారు. ప్రజాదర్బార్ కనిపించకుండా పోయిందని ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ బాబా.. దజను దొంగలుగా పాలన తెలంగాణలో నడుస్తోందని విమర్శించారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన వేతనాలు రావడం లేదు: హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన వేతనాలు రావడం లేదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నమనే మాటలు కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమని ఆరోపించారు. మోడల్ స్కూల్ టీచర్స్‌కు గత ఏడు నెలల నుండి ఏ నెలలో కూడా 1 వ తేదీన వేతనాలు చెల్లించకపోవడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13 రోజులు గడిచినప్పటికీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్లకు ఇప్పటికీ జీతాలు అందక అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 8న సగంమంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించారని, రంగారెడ్డి, నిజామాబాద్, వనపర్తి, సూర్యపేట,సంగారెడ్డి, సిద్దిపేట,సిరిసిల్ల,పెద్దపల్లి మొత్తం 8 జిల్లాలో పని చేస్తున్న వెయ్యి మందికిపైగా రెగ్యులర్ టీచర్లకు ఇంకా వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. మోడల్ స్కూల్స్ లో పని చేసే ఔట్ సోర్సింగ్, హవర్లీ బేస్డ్ టీచర్స్ (హెచ్‌బిటి) దాదాపు రెండు వేల మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పూలే ఆశయాలు, ఆదర్శాలకు అనుగుణంగా పాలన అందిస్తాం

### వృత్తులకు ఆర్థిక పరిపుష్టిని కల్పించేందుకు ప్రభుత్వం కృషి

### మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి




ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :మహాత్మ జ్యోతి బా పూలే, సావిత్రిబా పూలే ఆశయాలు , ఆదర్శాల కనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ, ట్రాన్స్పోర్ట్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసి భవన్ ,ఐటి టవర్ వద్ద ఏర్పాటుచేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలేల విగ్రహాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మహిళలకు చదువు ఉండకూడదనే మూఢ నమ్మకాలు ఉన్న సమయంలోనే సావిత్రి బాయి పూలే మహిళా చదువు కోసం ఎంతో కృషి చేశారని, పాఠశాలలను స్థాపించారని అన్నారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బీసీ కార్పొరేషన్లకు నిదులు మంజూరు చేశామని తెలిపారు .రాబోయే కాలంలో బలహీనవర్గాలకు మంచి జరగాలన్న ఆలోచనతో కుల గణను చేపట్టేందుకు నిర్ణయించామని, అలాగే 150 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కుల వృత్తులను ప్రోత్సహించడమే కాకుండా, వృత్తులకు ఆర్థి పరిపుష్టిని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు.రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ బిసిలు,అణగారిన వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 80 కోట్ల రూపాయలతో 25 ఎకరాల స్థలం లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లను నిర్మించ నుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో మొదటిసారిగా నల్లగొండ జిల్లా కేంద్రంలోనే మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని,మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబా పూలే ఆశయాలు,ఆదర్శాల కనుగుణంగా అందరు పనిచేయాలని, లింగ బేధం లేకుం డా అందరూ చదువుకోవాలని కోరారు.జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షు చక్రధర్ రామరాజు తదితరులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలోస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ.పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,వైస్ చైర్మన్ అబ్బాగోని రమేష్ గౌడ్ ,వివిధ కుల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావ్యతిరేక చట్టాలపై ప్రజలను చైతన్యపరచాలి

### ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్) జాతీయ కార్యవర్గం





న్యూఢిల్లీ : భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, సమానత్వం పరిరక్షణలో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర వహించాలని ప్రజా వ్యతిరేకమైన చట్టాలను పాలకులు తీసుకు వచ్చినప్పుడు జాగురకతతో చైతన్యపరచడం, కోర్టులను ఆశ్రయించడం ద్వారా న్యాయాన్ని కాపాడాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ కార్యవర్గం పిలుపునిచ్చింది. విస్తృత చర్చ లేకుండా ఆమోదించి అమలులోకి తీసుకువచ్చిన మూడు నూతన క్రిమినల్ చట్టాలను, లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేసింది.

న్యూఢిల్లీలోని జవహర్ భవన్‌లో శనివారం నాడు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది, ఐఎఎస్ అధ్యక్షులు ఆర్.ఎస్.చీమా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్వేషం, మత వైషమ్యాలను రెచ్చగొట్టటం ద్వారా లబ్ధి పొందాలనే శక్తులను ప్రజలు అడ్డు కట్ట వేయటం హర్షనీయమని అన్నారు. భారత దేశంలోని న్యాయవాదులను సమీకృతం చేయటంలో భారత రాజ్యాంగ లక్ష్యాలను విస్తృతం న్యాయవాదులు, ప్రజలలోకి తీసుకెళ్ళడంలో సుమారు దశాబ్దకాలంగా ఐఎఎల్ పెద్ద ఎత్తున సభలు, సదస్సులు పెట్టి జాగృతం చేసిన ఘనతను సాధించిందని, దీనిని మరింత విస్తృతపరచాలని ఆయన కోరారు. సమావేశంలో ఐఎఎల్ ప్రధాన కార్యదర్శి మురళీధర కార్యకలాపాలపై సమీక్ష పెట్టగా, ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం చట్టాన్ని తీసుకురావటం వారి సంక్షేమం కోసం తగిన నిధులు కేటాయించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకునేందుకు న్యాయవాదులు సమీకృతం కావాలని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శులు జయచంద్రన్ (కేరళ), చలసాని అజయ్‌కుమార్(ఆంధ్రప్రదేశ్), లోహిత్ (ఉత్తర్‌ప్రదేశ్) మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో కోర్టు ఫీజులు విచ్చలవిడిగా పెంచటం , న్యాయవాదుల ఎన్‌రోల్‌మెంట్ రుసుమును పెంచటం, మరోవైపు న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవటం పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఐఎఎల్ కార్యదర్శి అశ్విని బక్ష్(చండీగఢ్), కె.సురేశ్ (ఆంధ్రప్రదేశ్), కె.రామ్మూర్తి (తెలంగాణ), రషీద్(జార్ఖండ్), సుబ్రమణ్యం (తమిళనాడు), ప్రశాంత్ మిశ్రా (ఒడిషా), నరేంద్ర భల్లా (హర్యానా) , జస్పాల్ సింగ్ (పంజాబ్), కునాలన్ (రాజస్థాన్), నట్వర్ సింగ్ (గుజరాత్), అన్సారీ (కేరళ), పర్‌నాథ్ సింగ్ (యుపి), హజార్ సింగ్, రీతూపురి, తరన్నమ్‌లతోపాటు 23 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 10ఏళ్లలో 10ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బిజెపిది కాదా?

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి భువనగిరి ఎంపి కిరణ్ కుమార్‌రెడ్డి సూటి ప్రశ్న




ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్రంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఈ 10 ఏళ్ల కాలంలో ప్రజాస్వామ్యయుతంగా ఏర్పాటైన 10 ప్రభుత్వాలను కూల్చిన హీనమైన చరిత్ర బిజెపిదని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దానిని గుర్తుంచుకుని మాట్లాడితే బాగుటుందన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో నడిరోడ్డు పైన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అవహేళన చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం తీవ్రంగా ఖండించారు. ఈ దేశంలో రాజ్యాంగాన్ని అవహేళన చేసింది, చేస్తోంది ఎవరో అందరికి తెలుసన్నారు. తమ మాట వినలేదని, పార్టీలను ముక్కలు చేయడం, ఈడీ, సీబీఐ, ఇన్ కం ట్యాక్స్ వంటి సంస్థలతో బెదిరించి ఎమ్మెల్యే లను చేర్చుకుని ప్రభుత్వాలను కూల్చేవారు సైతం రాజ్యాంగం గురించి మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు.. ఈ 10ఏళ్ల కాలంలో బిజెపి నాయకులు తమ అధికారిన్ని అడ్డంపెట్టుకుని ఉత్తరాఖండ్ (2016), మణిపూర్ (2017), గోవా (2017), మేఘాలయ (2018), జమ్మూ & కాశ్మీర్ (2018), అరుణాచల్ ప్రదేశ్ (2019), కర్ణాటక (2019), మధ్యప్రదేశ్ (2020), పుదుచ్చేరి (2021), మహారాష్ట్ర (2022)లో ప్రభుత్వాలకు ప్రభుత్వాలనే మార్చేసి సుప్రీంకోర్టుతో చీవాట్లు తిన్న చరిత్ర ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మరిచిపోయినట్లు ఉన్నారన్నారు. రాహుల్ గాంధీకి దమ్ముంటే ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని బండి సంజయ్ అంటున్నారని,ఆయనకు దమ్ముంది కాబట్టే ఈ దేశంలో ఎక్కడ ఏం జరిగి నా ధైర్యంగా వెళ్తున్నారని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాగా రాహుల్ సెక్యూరిటీ వెనకా ల దాక్కోలేదన్నారు. కేంద్రమంత్రి బండి సంజ య్ ఇప్పుడు బడాయికబుర్లు చెబుతున్నారని, ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో నువ్వు చేసిన వసూళ్లు అందరికీ తెలుసాని, పాదయాత్ర పేరుతో పైసల యాత్ర చేసి పదవి పోగొట్టుకున్న ఆయన కూడా సిఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కలలు కంటున్నారని, ఎదోగాలిలో నాలుగు సీట్లు ఎక్కువగా గెలిచినంత మాత్రాన అధికారంలోకి వస్తుందనుకోవడం భ్రమేనని కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

## పాఠశాలల్లో డ్రగ్స్ కట్టడికి "ప్రహరీ క్లబ్"

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్: డ్రగ్స్, చెడు అలవాట్లను అరికట్టేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో "ప్రహరీ క్లబ్"ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలో డ్రగ్స్, చెడు అలవాట్లను దరి చేరనివ్వకుండా కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలకు పూనుకున్నది. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులతో కలిసి "ప్రహరీ క్లబ్" కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రహరీ క్లబ్ కు సంబంధించి ప్రత్యేకంగా మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.ప్రహరి క్లబ్ పాఠశాల, పాఠశాల పరిసరాల్లో డ్రగ్స్ విక్రయాలు, వాడకంపై నిరంతరం నిఘా పెట్టాల్సి ఉంటుంది. కాలపరిమితితో కూడిన కార్యాచరణతో ప్రభుత్వం డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకుంటుంది.

కమిటీ : అధ్యక్షునిగా పాఠశాల హెడ్‌మాస్టర్ /ప్రిన్సిపల్, ఉపాధ్యక్షునిగా విద్యార్థులతో స్నేహంగా ఉండే టీచర్ లేదా సీనియర్ టీచర్, సభ్యులుగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలో క్రియశీలకంగా ఉండే ఇద్దరు విద్యార్థులు, పేరంట్స్ టీచర్ అసోసియేషన్/తల్లిదండ్రుల నుంచి ఒక్కరు, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీసు కమిటీలో సభ్యునిగా ఉంటారు.

## ఘనంగా ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ వార్షిక ఇన్వెస్టిచర్ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ వార్షిక ఇన్వెస్టిచర్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మల్టీజోన్ II, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, వి.సత్యనారాయణ గౌరవ అతిథి, అక్షయ విద్యా వ్యవస్థాపక ధర్మకర్త ఎస్. జనార్ధన్ విచ్చేశారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు సత్యనారాయణమాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పాఠశాల స్థాయిలోనే కాకుండా ప్రభుత్వంలో కూడా మంత్రివర్గంలో సభ్యులుగా ఉండేలా కృషి చేయాలని కోరారు. నాయకత్వ లక్షణాలు, స్వీయక్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యత వివరించిన ఆయన పరిమిత స్థాయిలో సరదాగా గడపాలని, ధూమపానం, మాదకద్రవ్య వ్యసనానికి దూరంగా ఉండాలని హెచ్చరించాడు. తల్లిదండ్రులను ప్రేమిస్తూ, పెద్దలను గౌరవించాలని ఉద్బోదించారు. విజయానికి షార్ట్ కట్లు ఉండవని,ఏకాగ్రత, కృషితోనే అవి సాధ్యమవుతాయన్నారు.జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు కృషి , పట్టుదలతో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని,అదేవిధంగా ఎల్లకాలంసామాజానికి తోడ్పాటును అందించాలని సూచించారు. డిన్ రామాంజుల ఘన స్వాగతంతో ప్రారంభమైన ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ ప్రార్థన మణికొండ, కరస్పాండెంట్ కె. ప్రభాకర్, ఎస్.ఎస్.సి ప్రిన్సిపాల్ ఫహ్మిదా, సి.బి.ఎస్.ఇ ప్రిన్సిపల్ రేఖా రావు, ప్రీప్రైమరీ ప్రిన్సిపాల్ ఫాతిమా కాజిమ్ పాల్గొన్నారు.



## రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నూతన చైర్మన్‌గా శివసేనారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నూతనచైర్మన్ గా శివసేనారెడ్డి బాధ్యతలను స్వీకరించారు. శనివారం గచ్చిబౌలిలోని సాట్స్ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమానికి మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ , మాజీ ఎంపీ మధు యాష్కిగౌడ్‌హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు శివసేనా రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గతంలోనే క్రీడాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో రూ .2 కోట్ల చొప్పున పలు జిల్లాలలో క్రీడా స్టేడియాలు నిర్మించిగ్రామీణ యువతను క్రీడల వైపు మళ్లించేందుకు కృషి చేసిందని, దీనిని కొనసాగించాలని సూచించారు.



మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందన్నారు. పార్టీకి కష్టపడి పనిచేసిన నాయకులకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశాలు రాలేదని, అలాంటి వారందరినీ గుర్తుంచుకొని నామినేటెడ్ పోస్టులలో ప్రభుత్వం తగిన అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు.

గత బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో స్టేడియాలన్నీ రాజకీయ, ప్రైవేట్ ఈవెంట్స్ కార్యక్రమాలకే పరిమితమయ్యాయని, క్రీడాకారులను ప్రోత్సహించలేదని విమర్శించారు. కానీ శివసేనారెడ్డి గారు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా క్రీడా కేంద్రాలన్నీటిని సద్వినియోగం చేసుకుంటూ యువతను మెరుగైన క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అదేవిధంగాఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు శివసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలుపడంతోపాటు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆయనతో కలిసి మొక్కను నాటారు.

# ఇసుక టెండర్లలో వందల మంది పోటీ

- ✻ ఇసుక లోడింగ్‌కు రూ.97కు పిలిచిన టిజి ఎండిసి
- ✻ టన్ను ఇసుకకు రూ.72 చాలు అంటున్న కాంట్రాక్టర్లు
- ✻ టెండర్లు ఇచ్చి ఇసుక లోడింగ్‌పై అధికారుల నిఘా



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు సమకూర్చడంలో భాగంగా అధికారులు చేస్తున్న శ్రమ ఫలిస్తోంది. కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పడం ద్వారా నిధులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. మేడిగడ్డ బ్యారేజీ మునక ప్రాంతంలో 92.77 లక్షల టన్నుల ఇసుక పూడికను తీయనున్నారు. దీనికోసం తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టిజిఎండిసి ) 14 బ్లాకులను గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ఇసుకను తవ్వి తీసి విక్రయించనుంది. ముంపు ప్రాంతంలోని ఇసుకను తీసి స్టాక్ యార్డుల వరకు తరలించడం, ఆ తర్వాత లారీల్లో లోడింగ్ చేసేందుకు కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం రోజున టెండర్లను ఆహ్వానించింది. ఇసుక పూడిక తీయడం ద్వారా బ్యారేజీలో నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందని టిజి ఎండిసి పేర్కొంది. బిడ్ల దాఖలుకు వారం రోజుల గడువు ఇచ్చింది. 14 బ్లాక్‌లలో 92,77, 343 టన్నుల ఇసుక ఉన్నట్లు టిజి ఎండిసి గుర్తించింది. భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బ్యారేజీ కుడి వైపు మహదేవపూర్ మండలం సూరారం, కుంట్లం గ్రామాల పరిధిలో ఉన్న ముంపు ప్రాంతాల నుంచి ఇసుక తీయాలని నిర్ణయించి ఆయా బ్లాక్‌లకు విడివిడిగా టెండర్లు ఆహ్వానించారు.

**ఇసుక టెండర్లకు వందల మంది పోటీ**

మేడిగడ్డ ఇసుక టెండర్లలో పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇసుక లోడింగ్ టెండర్లు దక్కించుకునేందుకు వందల మంది కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. అర్హత పొందిన వారంతా, తెలంగాణ ప్రభుత్వ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ( టిజి ఎండిసి ) నిర్దేశించిన అంచనా వ్యయం కంటే 25 శాతం తక్కువకే ఆర్థిక బిడ్లను దాఖలు చేశారు. తద్వారా ఒక్కో టన్ను ఇసుక లోడింగ్‌కు రూ.97 ఖర్చవుతుందని టిజి ఎండిసి అంచనా వేసింది. అందుకు కోసం టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు మాత్రం మాకు అంత వద్దు, కేవలం రూ.72.76 కే పనిచేసి పెడతామంటూ క్యూ కట్టారు. వాస్తవ ఖర్చు కంటే తక్కువకే ఇసుకను తవ్వి తీసి, లారీల్లో నింపేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. దీంతో బిల్లులో పేర్కొన్న పరిమాణం మేరకే లారీల్లో ఇసుక నింపడానికి పరిమితం అవుతారా? లేక ఏదైనా అక్రమాలకు తెరలేస్తుందా? అన్నది చర్చనీయాంశంగా మారే అవకాశం కనిపిస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ ఎగువ ప్రాంతంలో 92 లక్షల 27 వేల 343 టన్నుల ఇసుకను విక్రయించేందుకు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ మేరకు మహదేవపూర్, బ్రాహ్మణపల్లి, ఎల్కేశ్వరం, బొమ్మాపూర్, బెగులూర్ ప్రాంతంలో 14 రీచ్ (బ్లాక్)లను గుర్తించింది. అందుకోసం టెండర్లనూ పిలిచింది. నిజానికి గోదావరిలో ఇసుకను తవ్వి సమీపంలో స్టాక్‌యార్డుకు తరలించాల్సి ఉంది. అక్కడికి వచ్చే లారీల్లో ఇసుకను నింపడం కాంట్రాక్టర్ల పనిగా మారింది. ఇసుక రవాణా కోసం సరిపడా యంత్రాలు, కూలీలు, స్టాక్‌యార్డుకు అవసరమైన భూమి, లారీలకు పార్కింగ్, డ్రైవర్లకు కనీస సదుపాయాలు, వీటన్నింటినీ కల్పించే బాధ్యత కాంట్రాక్టర్లకే ఉంటుంది. ఈ క్రమంలోనే మేడిగడ్డ ఇసుక లోడింగ్ టెండర్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అయితే ఇసుక లోడింగ్‌కు రూ.97కు టిజి ఎండిసి టెండర్ పిలవగా, కాంట్రాక్టర్లు మాత్రం కేవలం రూ.72.76కే పనులు చేయడానికి ముందుకు రావడం గమనార్హం. మరో విశేషం ఏంటంటే.. అన్ని రీచ్‌లకు కలిపి తుది పరిశీలనలో 173 మంది ఉండగా, వారంతా ఒకే రకంగా రూ.72.76 కోట్ చేయడం విశేషం .

**ఏ ప్రాంతంలో ఎంతెంత...**

మహదేవపూర్‌లో మొదటి 3 రీచ్‌లకు 14 మంది చొప్పున తుది పోటీలో ఉండగా, వారంతా 25 శాతం తక్కువకే కోట్ చేశారు. ఎల్1గా నిలిచారు. ఎల్కేశ్వరం 2లో 13 మందికి అందరూ ఎల్1గా ఉన్నారు. మిగతా రీచ్‌ల్లోనూ ఇదే స్థితి. దీంతో అందరి సమక్షంలో వీడియో తీస్తూ డ్రా పద్ధతిలో ఒక్కో రీచ్‌కి ఒక్కో కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసినట్లు టిజి ఎండిసి అధికారి ఒకరు తెలిపారు. కాంట్రాక్టర్‌లకు గత శుక్రవారం నాడే ఎల్ఓఐ (లెటర్ ఆఫ్ ఇండెంట్) ఇచ్చారు. స్టాక్‌యార్డుకు అవసరమైన భూమిని గుర్తించి, కాంట్రాక్టరు, పట్టాదారు, టిజి ఎండిసి అధికారి ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఇక ఇసుక తవ్వకాలు మొదలవడమే తరువాయిగా మారనుంది.

**ఇసుక లోడింగ్‌పై అధికారుల నిఘా :**

ఇసుక రీచ్‌ల్లో బిల్లు మేరకు కాకుండా కాంట్రాక్టర్లు ఒక్కో లారీలో ఏడెనిమిది టన్నుల ఇసుకను అక్రమంగా నింపుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. అదే జరిగితే కాంట్రాక్టర్లకు తద్వారా భారీగా జేబులు నింపేసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల కాంట్రాక్టర్లకు, లారీ యజమానులకు లబ్ధి చేకూరుతుంది. అలా జరిగితే టన్నుకు రూ.410 చొప్పున ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోయే అవకాశం ఉంటుంది. తాజా టెండర్లలో అంచనా ఖర్చు కంటే 25 శాతం తక్కువకే ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు బిల్లులో ఉన్నంత పరిమాణానికే ఇసుక నింపుతారా? ఇసుక లోడింగ్ ఖర్చులో నష్టాన్ని పూడ్చుకోవడం ద్వారా భారీగా లబ్ధి పొందేందుకు అక్రమంగా ఇసుక నింపుతారా? అనేదానిపైనా అధికారులు నిఘా ఉంచుతున్నారు.




## జేమ్స్ వెబ్‌కు చిక్కిన క్వాసార్ 'ఐన్‌స్టీన్ రింగ్'



అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ప్రయోగించిన అత్యంత శక్తివంతమైన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ విశ్వ రహస్యాలను అన్వేషించడంలో శాస్త్రవేత్తలకు తోడ్పడుతున్నది. కొన్ని మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న గెలాక్సీల చిత్రాలను సైతం ఈ టెలిస్కోప్ పంపిస్తున్నది. తాజాగా ఈ టెలిస్కోప్‌కు చిక్కిన క్వాసార్ చుట్టూ ఉన్న బెజ్వెల్డ్ మేఘం మనోహర చిత్రాన్ని నాసా విడుదల చేసింది. క్వాసార్ ఆర్‌ఎక్స్ జె11311231ను అర్థం చేసుకోవడానికి ఈ చిత్రాలు ఉపకరిస్తాయి. జేమ్స్ వెబ్ పంపిన చిత్రాల్లో క్వాసార్ శూన్య ప్రాంతంలోని నాలుగు ప్రకాశంతమైన మచ్చలు కనిపిస్తున్నాయి. వీటినే 'ఐన్‌స్టీన్ రింగ్స్'గా పేర్కొంటారు. క్వాసార్ మనకు సుమారు 6 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. 'ఐన్‌స్టీన్ రింగ్'పై వారికి అవగాహన ఉన్నప్పటికీ, లోతైన అధ్యయనం చేసేందుకు అవసరమైన సమాచారం లేకపోయింది. ఇప్పుడు జేమ్స్ వెబ్‌కు చిక్కిన ఈ రింగ్స్ తగిన వివరాలను అందిస్తాయని అంటున్నారు. క్వాసార్ అనేది ప్రాథమికంగా యువ గెలాక్సీ మధ్యలో ఉన్న ఒక సూపర్ మాసివ్ బ్లాక్ హోల్. ఇది భారీ మొత్తంలో పదార్థాన్ని (మాస్) వినియోగించుకుంటుంది. అదే సమయంలో బలమైన శక్తి తరంగాలను అంతరిక్షంలోకి విడుదల చేసింది. ఖగోళ శాస్త్రవేత్తలు ఇప్పటికే ఈ రకమైన క్వాసార్‌ను కనుగొన్నారు. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఇప్పుడు చాలా స్పష్టమైన చిత్రాన్ని అందించింది. గురుత్వాకర్షణ లెన్సింగ్ అని పిలిచే అంతరిక్షంలో సంభవించిన ఒక మార్పు వల్ల ఈ క్వాసార్ చాలా భిన్నంగా కనిపిస్తున్నది. గెలాక్సీ లేదా క్వాసార్ వంటి సుదూర ఖగోళ వస్తువుల నుంచి కాంతి ఒక భారీ వస్తువుకు దగ్గరగా వెళుతున్నప్పుడు వంపుకు గురవుతుంది. దీనినే గ్రావిటేషనల్ లెన్సింగ్ అంటారు. ఈ వక్రత కారణంగా భారీ వస్తువు చుట్టూ కాంతి చుట్టుముట్టినట్టు కనిపిస్తుంది. ఆర్‌ఎక్స్ జె11311231 విషయంలో లెన్సింగ్ అనేది క్వాసార్‌కు, భూమికి మధ్య ఉన్న గెలాక్సీ. క్వాసార్‌పై విస్తృత పరిశోధనలు జరుగుతున్నా యి. విశ్వసృష్టికి మూలాలు వెతికేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. వారికి జేమ్స్ వెబ్ టెలిస్కోప్ పంపిన 'ఐన్‌స్టీన్ రింగ్' చిత్రాలు కొత్త సమాచారాన్ని అందిస్తున్నాయి. వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

## నాసా సరికొత్త ప్రయోగం



అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా సరికొత్త ప్రయోగాన్ని మొదలు పెట్టింది. దీనిని క్యూబ్‌శాట్ (CubeSat) రేడియో ఇంటర్ఫెరోమెట్రీ ప్రయోగం (CURIE/క్యూరీ)గా పేర్కొంటున్నారు. సూర్యుడి నుంచి వెలువడే సౌర రేడియో తరంగాల రహస్యాలను ఛేదించడానికి నాసా ప్రారంభించిన సంచలనాత్మక ప్రాజెక్టుగా దీనిని పేర్కోవాలి. సౌర రేడియో తరంగాల సమస్యాత్మక మూలాలను పరిశోధించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. కొన్ని దశాబ్దాల క్రితమే సౌర రేడియో తరంగాలను గుర్తించినప్పటికీ, వాటిపై లోతైన పరిశోధన జరగలేదు. ఫలితంగా వాటి మూలాలపై స్పష్టత లేకుండా పోయింది. తక్కువ ఫ్రీక్వెన్సీ రేడియో ఇంటర్ఫెరోమెట్రీ అని పిలువబడే ఒక వినూత్న సాంకేతికను నాసా ఉపయోగిస్తుంది. క్యూరీ రెండు సూక్ష్మ అంతరిక్ష నౌకలను కలిగి ఉంటుంది. రెండు కలిపినా, సుమారుగా ఒక షూ బాక్స్ కంటే ఎక్కువగా ఏమీ ఉండదు. వ్యోమనౌకలు భూమికి సుమారు రెండు మైళ్ల ఎత్తులోని కక్ష్యలో, భూమి చుట్టూ భ్రమిస్తూ ఉంటాయి.

ఈ విభజన రేడియో తరంగాల రాక సమయాల్లో, నిమిషాల వ్యత్యాసాలను ఈ సాధనాలు గుర్తిస్తాయి. ఫలితంగా సౌర మూలాల ఖచ్చితత్వాన్ని కనుగొనడానికి మార్గం ఏర్పడుతుంది. వ్యోమ నౌకలు రేడియో తరంగాలను 0.1 నుండి 19 మెగాహెర్ట్జ్ పరిధిలో కొలుస్తుంది, భూమి ఎగువ వాతావరణం కారణంగా నిరోధానికి గురైన ఫ్రీక్వెన్సీలు, అంతరిక్ష ఆధారిత పరిశీలనలకు రేడియో తరంగాలు ఉపయోగపడతాయి. సూర్యుని రేడియో ఉద్గారాల యొక్క అవరోధం లేని వీక్షణను పొందడానికి భూమి ఉపరితలం నుండి 360 మైళ్ల దూరంలో క్యూరీ తన కక్ష్యలో తిరుగుతుంది. కక్ష్యలోకి ప్రవేశించిన తర్వాత, రెండు క్యూరీ అంతరిక్ష నౌకలు విడిపోయి, వాటి ఎనిమిది అడుగుల యాంటెన్నాలను అమర్చి, డేటాను సేకరించడం ప్రారంభిస్తాయి. ఈ మిషన్ సౌర రేడియో తరంగాలపై మన అవగాహనను మెరుగుపరుస్తుంది. అంతేగాక, భవిష్యత్తులో అంతరిక్ష ఆధారిత రేడియో ఖగోళ శాస్త్ర ప్రయోగాలకు మార్గం సుగమం చేస్తుంది. విద్యుత్ అయస్కాంత వర్ణపటంలో అతి పొడవైన తరంగ దైర్ఘ్యాలను ఈ రేడియో తరంగాలు కలిగి ఉంటాయి. దాదాపు ఒక మిల్లీమీటర్ నుంచి 100 కిలోమీటర్ల వరకూ ఇవి వ్యాపిస్తాయి. విద్యుదయస్కాంత తరంగాలలో వాటి పౌనఃపున్యాలు అత్యలంగా ఉంటాయి. దాదాపు 3 కిలోహెర్ట్జ్ నుంచి 300 గిగాహెర్ట్జ్ వరకూ విస్తరించి ఉండే ఈ సౌర రేడియో తరంగాల మూలాలను కనుగొనే క్యూరీ ప్రయోగం విజయవంతమైతే, సరికొత్త అధ్యయనానికి పునాది పడుతుంది.

## హంతకుడికి 226 సంవత్సరాల జైలు శిక్ష



ఇద్దరు మహిళలను అత్యంత కిరాతకంగా హతమార్చిన వ్యక్తికి కోర్టు ఏకంగా 226 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. కేసు వివరాల్లోకి వెళితే, అమెరికాలోని అలాస్కా ప్రాంతంలో ఇద్దరు మహిళలను బ్రియాన్ స్టీవెన్ స్మిత్ అనే వ్యక్తి 2019లో ఇద్దరు మహిళలను హత్య చేశాడు. వారిలో ఒక మహిళను చిత్రహింసలకు గురి చేస్తూ, చంపిన వైనాన్ని చిత్రీకరించి పైశాచిక ఆనందాన్ని పొందాడు. అతని చేతిలో కాథ్లిన్ హెన్రీ, వెరోనికా అబౌచుక్ దారుణ హింసకు గురయ్యారు. అనంతరం ఇద్దరూ ప్రాణాలు కోల్పోయా రు. ఈ కేసును విచారించిన కోర్టు, స్మిత్ దుర్మార్గ చర్యల పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇంతటి భయానకమైన హత్యలు చేసిన స్మిత్ శిక్షార్హుడని పేర్కొన్న న్యాయమూర్తి కెవిన్ సాక్స్‌బీ, ఒక్కో హత్య కు 99 సంవత్సరాలు చొప్పున జైలు శిక్ష విధించారు. లైంగిక వేధింపులు, సాక్షాలను తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడినందుకు అదనంగా 28 సంవత్సరాల కారాగార శిక్షను ఖరారు చేశారు. మృతుల వివరాలు గోప్యంగా ఉంచాలన్న ఉద్దేశంతో, పోలీసులు వారి అసలు పేర్లను వెల్లడించకుండా, మారుపేర్లతో కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసుపై కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో స్మిత్‌లో పశ్చాత్తాపం అనేదే కనిపించలేదు. చివరికి శిక్షను విధించినప్పుడు కూడా అతను ఎలాంటి భావోద్వేగాన్ని ప్రదర్శించకుండా, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాడు. ఆ ఇద్దరినీ తాను చంపినట్టు అంతకు ముందే స్మిత్ అంగీకరించాడు. ఎందుకు హత్య చేశాడనే విషయాన్ని అతను వెల్లడించలేదు.

## అసోంలో దర్శనమిచ్చిన సలాజర్ పిట్ వైపర్



'హ్యారీ పాటర్' చిత్రంలో 'సలాజర్ స్లిథరిన్' అనే పేరుతో కనిపించిన సలాజర్ పిట్ వైపర్ పాము ఇటీవల అసోంలోని కజిరంగా నేషనల్ పార్క్‌లో దర్శనమిచ్చింది. 'వైపర్' లేదా విషపూరితమైన పాముల జాతికి చెందిన ఈ సలాజర్ పిట్ వైపర్‌కు రెండు కోరలతోపాటు, కళ్లు, నాసికా రంధ్రాల మధ్య పిట్ ఆర్గాన్ లేదా పిట్ అవయవం కూడా ఉంటుంది. ఈ పాములు చీకటిలో తమ ఆహారాన్ని గుర్తించడానికి ఇన్ఫ్రారెడ్ థర్మల్ రేడియేషన్‌ను పిట్ విడుదల చేస్తుంది. ఈ రకానికి చెందిన పాములు ఎక్కువగా ఎడారులు, అడవులు, గడ్డిభూములు, చిత్తడి నేలలుసహా వివిధ రకాల ఆవాసాలలో కనిపిస్తాయి. ఇవి భూమిపైన, వృక్షాలపైనా జీవిస్తాయి. ఉష్ణ మండల ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. కొన్ని రకాల సలాజర్ వైపర్లు సమశీతోష్ణ మండలాల్లోనూ కనిపిస్తాయి. అంటార్కిటికా మినహా దాదాపు ప్రతి ఖండంలోనూ ఈ జాతి పాముల ఉనికిని కనుగొన్నారు. మన దేశంలో ఈ జాతి పాములను 2019లో మొదటిసారి అరుణాచల్‌ప్రదేశ్‌లో గుర్తించారు. రాత్రిపూట ఎక్కువగా సంచరించే ఈ పాములు అత్యంత విషపూరితమైనవి. ఆయా ప్రాంతాలు, అక్కడి పర్యావరణ పరిస్థితులను బట్టి అమెరికా, ఆసియా వంటి ఖండాల్లో విభిన్న రీతుల్లో ఉంటాయి. కనీసం 48 రకాల సలాజర్ పిట్ వైపర్లు ఉంటాయని అంచనా. వీటిలో సుమారు 15 రకాలు మాత్రమే మన దేశంలో కనిపిస్తాయి. అత్యధిక శాతం జాతులు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. కానీ, కొన్ని పసుపు, నలుపు, నారింజ, ఎరుపు, బంగారు రంగులు లేదా గుర్తులను కలిగి ఉంటాయి.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# మోదీకి మరో హెచ్చరిక

ప్రజాపక్షం
14-07-2024, ఆదివారం

కొద్ది మాసాల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో అజేయమనుకున్న బిజెపికి ముచ్చెమటలు పోయించి మూడుచెరువుల నీరు తాగించిన 'ఇండి' అలయెన్స్, 7 రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ సీట్లకు బుధవారం జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను చిత్తుగా ఓడించారు. అలయెన్స్ పార్టీలు 10 స్థానాలు గెలుచుకోగా, బిజెపికి 2 మాత్రమే దక్కాయి. బిహార్‌లో జెడియు అభ్యర్థిపై ఇండిపెండెంట్ గెలవటం విశేషం. లోక్‌సభ ఎన్నికల నాటి ట్రెండ్ మారకపోగా ఎన్‌డిఎపట్ల వ్యతిరేకత మరికొంత పెరిగిందని ఈ ఫలితాలు రుజువుచేశాయి. త్వరలో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి 10 సీట్లనుండి జరిగే ఉప ఎన్నికలు 2007లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సూచిక కానున్నాయి. ఈ 10లో 9సీట్లు ఎమ్మెల్యేలు ఎంపిలుగా గెలవ టం వల్ల ఖాళీ అయినాయి. పశ్చిమ బెంగాల్‌లో కూడా మరో రౌండ్ అసెంబ్లీ ఉపఎన్నికలు రానున్నాయి.

ప్రస్తుత ఉప ఎన్నికలను పరిశీలించినట్లయితే 'ఇండి' కూటమి అభ్యర్థులు అత్యధిక సీట్లలో భారీ మెజారిటీలతో గెలిచారు. పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన ఆప్‌కు ఆశించిన ఫలితాలు లభించలేదు. 13లో కేవలం మూడే దక్కాయి. కాంగ్రెస్ 7 గెలుచుకుంది. ఈ నేపథ్యంలో జలంధర్ పశ్చిమం అసెంబ్లీ సీటును ఆప్ అభ్యర్థి బిజెపిపై 37,325 ఓట్లతో గెలుపొందటం ఆ పార్టీకి చెప్పుకోదగ్గ ఉపశమనం. ఆప్ సభ్యుడు మార్చి నెలలో బిజెపిలో చేరటం వల్ల ఈ సీటు ఖాళీ అయింది. తమిళనాడులో విక్రవండి సీటును డిఎంకెఅభ్యర్థి 67,757 ఓట్ల మెజారిటీతో గెలిచి లోక్‌సభ ఎన్నికల్లో అన్ని సీట్లను కూటమి గెలిచిన ఊపును కొనసాగించారు.

పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల ఫలితాలు ఎన్నదగినవి. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని 18 నుండి 12 స్థానాలకు కుదించిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికలు జరిగిన నాలుగు స్థానాలు భారీ మెజారిటీతో గెలుచుకుంది. రాయ్‌గంజ్ సీటులో 50,077ఓట్లు, రాణాఘాట్ సీటును 74,485 ఓట్లు, బాగ్దా సీటును 74,251 ఓట్లు, మణిక్‌తాల సీటును 62,312 ఓట్ల మెజారిటీతో ఆ పార్టీ గెలుచుకుని తనకు తిరుగులేదని చెప్పింది.

కాంగ్రెస్ పార్టీ పాలనలోని హిమాచల్ ప్రదేశ్‌లో ఆ ప్రభుత్వాన్ని కూల్చటానికి బిజెపి విఫలయత్నం చేయటం తెలిసిందే. అరడజనుమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బుట్టలో వేసుకుంది. స్పీకర్ వారికి అనర్హత ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలతోపాటు మూడు అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు జరగ్గా మరో మూడు సీట్లకు ఇప్పుడు జరిగాయి. రెండింటిని కాంగ్రెస్ గెలుచుకోగా, హరింపూర్ సీటును బిజెపి దక్కించుకుంది. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ భార్య కమలేశ్ థాకూర్ 9,399 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రస్తుతానికి సుస్థిరత ఏర్పడింది.

ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్‌లార్ సీట్లు రెండింటినీ కాంగ్రెస్ గెలుచుకుంది. దేవభూమిగా పిలవబడే ఈ రాష్ట్రం బిజెపికి పెట్టనికోటగా ఉంది. కాగా మధ్యప్రదేశ్‌లోని అమర్‌వార్ సీటును బిజెపి కష్టంమీద 3027 ఓట్లు మెజారిటీతో నిలుపుకుంది. బిహార్‌లో పాలక జెడి(యు) అభ్యర్థిపై ఇండిపెండెంట్ అభ్యర్థి విశేషంగా గెలుపొందారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ ఉప ఎన్నికలే ప్రథమ ఎన్నికలు. లోక్‌సభ ఎన్నికల్లో స్వయంగా 370, ఎన్‌డిఎ కూటమి కి 400 సీట్లు పైగా ఆశించి తీవ్ర ప్రయత్నం చేసిన బిజెపి 240 సీట్లకు పరిమితమై కనీస మెజారిటీకి 32 సీట్ల దూరంలో ఆగిపోయింది. ఎన్‌డిఎ భాగస్వాములు రక్షించగా నరేంద్రమోదీ వరుసగా మూడవసారి ప్రధానమంత్రి అయినారు. దాంతో లోక్‌సభలో ఎన్‌డిఎ బలగం 293గా, ఇండి అలయెన్స్ బలం 232గా ఉంది. అయినా మైనారిటీ ప్రధానమంత్రి మోదీ ఏ మార్పూ జరగనట్లు పాతపద్ధతిలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలు ఆయనకు హెచ్చరిక అనవచ్చు.

# డాలర్‌కు తూట్లు పొడిచిన సౌదీ అరేబియా

**ఆర్.అజయన్**

అమెరికాతో 50 ఏళ్ళ పెట్రో–డాలర్ ఒప్పందాన్ని సౌదీ అరేబియా జూన్ 9వ తేదీన తెగతెంపులు చేసుకుంది. 1974 జూన్ 8వ తేదీన సంతకాలు జరిగిన ఈ ఒప్పందం అమెరికా సంయుక్త రాష్ట్రాలను భౌగోళిక ఆర్థిక శక్తిగా మార్చడంలో ముఖ్యపాత్ర పోషించింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా సూపర్ పవర్‌గా ఆవిర్భవించినప్పటికీ, డాలర్ పైచేయి సాధించడమే అమెరికాను ప్రపంచ శక్తిగా మార్చిందనడంలో సందేహం లేదు. అమెరికన్ డాలర్ బలోపేతం కావడం ద్వారా ఇతర దేశాల నుండి తక్కువ ధరకే దిగుమతులు సాధ్యమైంది. అమెరికా ట్రెజరీ బాండ్స్ రూపంలో పోగైన పెట్టుబడులు, వారి ఆర్థిక వ్యవస్థను మరింత వ్యాకోచించేలా చేసింది. సౌదీ అరేబియా తాజా నిర్ణయం అమెరికాకు పెద్ద ఎదురు దెబ్బ. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన మార్పులు తీసుకు వస్తుందనడంలో సందేహం లేదు. 1972లో అమెరికా తన కరెన్సీని ప్రత్యక్షంగా బంగారం ధరతో ముడిపెట్టడం ఆపేసింది. ఆ సమయంలోనే పెట్రో – డాలర్ వ్యవస్థ స్థాపించబడింది. 1971 వరకు అమెరికా డాలర్ విలువను బంగారం ధరతో అంచనా కట్టేవారు. బ్రెట్టన్ ఉడ్స్ ఒప్పందం ప్రకారం ఔన్స్ బంగారం మూల ధర 35 అమెరికన్ డాలర్లుగా ఉండేది. ఆ విధానాన్ని నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ రద్దు చేసినప్పుడు డాలర్ విలువ కుప్పకూలింది. దీంతో బంగారం కంటే సురక్షిత పెట్టుబడులను అన్వేషిస్తుండగా, అప్పడే పెట్రోలియం ఉత్పత్తులను పెట్రో– డాలర్ పద్ధతిలో విక్రయించే విధానం అమలులోకి వచ్చింది. కానీ, అది కరెన్సీ కాదు. ఇజ్రాయిల్‌కు మద్దతు నేపథ్యంలో అమెరికాకు వ్యతిరేకంగా ఒపెక్ (ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ – పెట్రోలును ఎగుమతి చేసే దేశాల సంస్థ) ఆంక్షలు విధించడంతో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరగడం ప్రారంభమైంది. దీనికి పరిష్కారంగా 1974 జూన్ 8వ తేదీన అమెరికా విదేశాంగ మంత్రి హెన్రీ కిస్సింజర్, సౌదీ యువ రాజు ఫహద్ బిన్ అబ్దుల్ అజీజ్‌లు పెట్రో – డాలర్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆ సమయంలో ఇరు దేశాలకు అలాంటి ఒప్పందం అవసరమైంది. అప్పట్లో సౌదీ అరేబియా తమకు చమురు విక్రయాన్ని నిలిపివేయకుండా ఉండాల్సిన అవసరం అమెరికాకు, చమురు విక్రయం కొనసాగాల్సిన అవసరం సౌదీ అరేబియాకు ఉండేది. ఒప్పందాన్ని అనుసరించి ఇతర అరబ్ దేశాలు వాటి విక్రయాలను డాలర్‌లలోకి మార్చుకోవడంతో, అమెరికన్ డాలర్ శక్తివంతమైంది. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా డాలర్‌ను అద్భుత స్థితిలో ఉంచేందుకు ఆ ఒప్పందం కీలక పాత్ర పోషించింది.

అమెరికాకు చమురు ఎగుమతులు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత సౌదీ అరేబియాది. దానికి ప్రతిగా సౌదీకి మిలిటరీ, ఆర్థిక సహకారాన్ని అమెరికా అందజేసేది. దీనికోసం జాయింట్ కమిషన్లు ఏర్పాటయ్యాయి. మరింత చమురు ఉత్పత్తి చేసేందుకు సౌదీ అరేబియాను ప్రోత్సహించడంతో పాటు, అరబ్ దేశాలతో ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని అమెరికా అధికారులు ఆశించారు. సౌదీ అరేబియా కూడా చమురు విక్రయం ద్వారా లభించే అదనపు



ఆదాయాన్ని అమెరికా ట్రెజరీ బాండ్స్‌లో పెట్టుబడులుగా పెడతామని వాగ్దానం చేసింది. ఆ ఒప్పందంపై సౌదీ అరేబియా మాత్రమే సంతకం పెట్టినప్పటికీ, ఒపెక్ దేశాలు సైతం డాలర్‌లలో చమురును విక్రయించేందుకు అంగీకరించాయి. దీంతో భౌగోళిక ఆర్థిక పరిస్థితిని నిర్ణయించే ముఖ్య మాధ్యమంగా డాలర్ మారింది.

పెట్రో– డాలర్ అనే పదం ముడి చమురు విక్రయం ద్వారా సంపాదించిన అమెరికా డాలర్‌లను సూచిస్తుంది. పాత ఒప్పందాన్ని పునరుద్ధరించరాదనే నిర్ణయం ద్వారా ఇప్పుడు యూరో, యెన్, యువాన్ సహా ఏ కరెన్సీ ద్వారానైనా చమురును విక్రయించే అవకాశం సౌదీ అరేబియాకు ఉంటుంది. బిట్‌కాయిన్ వంటి డిజిటల్ కరెన్సీని కూడా అంగీకరించవచ్చు. ఫలితంగా సహజంగానే డాలర్ మారక ధర, డిమాండ్ కూడా పడిపోతుంది. అంతే కాకుండా సెంట్రల్ బ్యాంక్‌లు, కమర్షియల్ బ్యాంక్‌ల నడుమ డిజిటల్ కరెన్సీ ప్లాట్‌ఫామ్ 'ఎమ్‌బ్రిడ్జ్' ప్రాజెక్టులో కూడా సౌదీ అరేబియా నిమగ్నమైంది. డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీని ఉపయోగించుకొని ఇతర దేశాల నుండి తక్షణ చెల్లింపులు, విదేశీ మారకం వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం.

అమెరికాతో ఒప్పందాన్ని పునరుద్ధరించకపోయినా ఇతర దేశాలతో తమ ఆర్థిక భాగస్వామ్యాన్ని విస్తరించుకోవచ్చని సౌదీ అరేబియా అంచనా వేస్తుంది. మారకం గురించి అమెరికా డాలర్ మీద ఆధారపడడాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశ్యం కూడా దీని వెనుక దాగి ఉంది. ప్రపంచ నిలువ ద్రవ్యంగా డాలర్ స్థాయిని తొలగించే ప్రక్రియను డీ డాలరైజేషన్(డాలర్ రాహిత్య ప్రక్రియ) అంటారు. చైనా, భారత్ వంటి ప్రధాన దేశాలు సహా ప్రపంచ వ్యాప్తంగా విదేశీ మారక నిలువలలో క్రమంగా డాలర్ వాటాను తగ్గిస్తుండడంతో డీ– డాలరైజేషన్ పదం విస్తరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంక్ ల నిలువలలో డాలర్ వాటా 2020లో ఉన్న 71 శాతం నుండి 59 శాతానికి పడిపోయింది. ఐఎంఎఫ్ ప్రకారం 2023లో ఇది 58.41 శాతం.

పెట్రో–డాలర్ ఒప్పందం కేవలం ఆర్థిక పరమైన ఏర్పాటే కాకుండా భౌగోళిక రాజకీయాలను ప్రభావితం చేసే అంశం. అంతర్జాతీయ వాణిజ్య సాధనంగా అమెరికా డాలర్ తొలగిపోవాలని కోరుకుంటున్న చైనా, భారత్, రష్యా వంటి భౌగోళిక శక్తులకు దగ్గర కావాలనే సౌదీ అరేబియా ఆసక్తి స్పష్టమౌతోంది. పెట్రో–డాలర్ ఒప్పందం నుండి విరమించుకున్న తరువాత చైనా–రష్యా వైపు సౌదీ వెళ్తుందని అనుమానిస్తున్నారు. అదే సమయంలో సున్నీలు అధికంగా ఉండే సౌదీలో అకస్మాత్తుగా అమెరికా సహకారం నిలిచిపోవడం సాధ్యం కాదు. ఎందుకంటే వారికి ఇరాన్, టర్కీ, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులపై పోరాడేందుకు అమెరికా మిలిటరీ సహకారం అవసరమని అంచనా. పెట్రో–డాలర్ ఒప్పందం ముగిసిన క్రమం అమెరికాలో పెట్రో లు ధర, ద్రవ్యోల్బణం పెరిగేందుకు దారి తీస్తుం ది. డాలర్ విలువ తరుగుదల కూడా భౌగోళిక ఆర్థిక విపణులలో అమెరికా బాండ్‌ల విలువపై ప్రభావం చూపిస్తుంది. భౌగోళిక ఆర్థిక సంబంధాలలో ఇలాంటి అవకాశాలు తలెత్తి బలపడితే కచ్చితంగా ప్రపంచ రాజకీయాలలో అమెరికా ఆధిపత్యం ప్రశ్నార్థకంగా మారుతుంది. పెట్రో – డాలర్ ఒప్పందాన్ని సౌదీ ఉపసంహరించుకోవడంతో చైనా, రష్యా, భారత్ వంటి కొత్త శక్తులు అంతర్జాతీయ వాణిజ్యంలో లబ్ధి పొంది మరింత బలోపేతమవుతాయి.

# అక్కడ కాంగ్రెస్, ఇక్కడ టిడిపి ఆశలపల్లకి

గడిచిన వారం రోజులుగా తెలంగాణ రాజకీయాలు శరవేగంగా సాగుతున్నాయి. గత వారం చివర్లో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ జరిగింది. సుహృద్భావ వాతావరణంలో జరిగిన ఈ సమావేశం విభజన సమస్యల పరిష్కారం సాధనకై ఉభయ రాష్ట్రాల మంత్రులతో, అధికారులతో రెండు కమిటీలు ఏర్పాటు చేయాలనే నిర్ణయంతో ముగిసింది. అసలు రాజకీయం ఆ సమావేశం తరువాతే జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లోని టిడిపి కార్యాలయంలో, తెలంగాణ ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి విజయవాడలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సభలో చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకుంది. సిఎంల భేటీ ముగిసిన మరుసటి రోజే ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌కు వెళ్ళిన చంద్రబాబు నాయుడు అక్కడ తెలంగాణకు సంబంధించిన టిడిపి క్యాడర్‌ను కలిసారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

**తెలంగాణలో టిడిపి పూర్వవైభవం సాధ్యమేనా?**

తెలంగాణలో టిడిపిలోకి కొత్త నాయకులను తీసుకొని పార్టీకి జవసత్వాలు కల్పించేందుకు కృషి చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. ఎపి, తెలంగాణ తనకు రెండు కళ్ళు అని గతంలో తెలంగాణ ఉద్యమకాలం నాటి మాటలను మరోసారి గుర్తు చేసుకున్నారు. తాను ఎపితో పాటు తెలంగాణ సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే సమయంలో తాను హైదరాబాద్ విస్తరణకు హైటెక్ సిటీ నిర్మాణంతో చేసిన కృషిని తరువాత ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, కెసిఆర్, ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి కూడా కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానించడం విశేషం. ఈ సమావేశం ప్రత్యేకత ఏమిటంటే ఎపిలో మళ్ళీ అధికారంలోకి వచ్చామన్న ఉత్సాహంతోనో, లేదా కేంద్రంలో తమ పార్టీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పడిందనే ధీమాతోనే కానీ ఏడెనిమిదేళ్ళ తరువాత తెలంగాణలో టిడిపి బలోపేతంపై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి లోక్‌సభ ఎన్నికల అనంతరం బిఆర్‌ఎస్ బలహీన పడుతుండడంతో పాటు, తెలంగాణలో పార్టీ పుంజుకుంటే ఎంపి స్థానాలు పెరిగితే కేంద్రంలో ఆ బలంతో ప్రాధాన్యత ఉంటుందనే ఆలోచన కావొచ్చు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి మంచి స్థానాలనే గెలుచుకుంది. బిజెపితో పొత్తులో ఉన్న టిడిపికి 15స్థానాలు రాగా, బిజెపికి 5 స్థానాలు వచ్చాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోనే ఆ పార్టీకి అత్యధిక స్థానాలు లభించగా, తరువాత మహబూబ్‌నగర్‌లో రెండు, వరంగల్‌లో రెండు, ఖమ్మంలో ఒక స్థానంలో గెలిచింది. తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా ఎపిలో అధికారంలో ఉన్న టిడిపి బలంగానే ఉంది. అకస్మాత్తుగా ఓటుకు నోటు కేసును తెరపైకి తెచ్చిన కెసిఆర్ ప్రభుత్వం, టిడిపిని టార్గెట్ చేసింది. అనంతర పరిణామాల్లో ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను వీడి ఏపిలోనే నూతన రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసి అక్కడి నుండే చంద్రబాబు పరిపాలన సాగించారు. అక్కడ నాటి ప్రతిపక్షం వైసిపి కూడా బలంగా ఉండడంతో, క్రమంగా తెలంగాణ రాజకీయాలను టిడిపి వదులుకుంది. టిడిపి ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు, కింది స్థాయి క్యాడర్‌లో అత్యధిక భాగం టిఆర్‌ఎస్‌లో చేరిపోయింది. 2018 ఎన్నికల్లో గతంలో టిడిపి బలంగా ఉన్న జిహెచ్‌ఎంసి పరిధిలో సైతం టిఆర్‌ఎస్ విజయదుందుభి మోగించటం సైకిల్ పార్టీ క్యాడర్, ఓట్లు పూర్తిగా ఆ పార్టీకి మళ్ళిందనేందుకు నిదర్శనం. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో ఎపికి సరిహద్దులో ఉండే ఖమ్మం జిల్లాలో టిడిపి తన బలాన్ని రెండుకు పెంచుకోవటం విశేషం. ఆ ఎన్నికల్లో మహాకూటమితో కలిసి పోటీ చేసిన టిడిపి, లోక్‌సభ ఎన్నికల బరిలో నిలవలేదు. ఆ తరువాత మిగిలిన కొంత మంది ఎంఎల్‌ఏలు, క్యాడర్ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో, తెలంగాణలో టిడిపి కథ ముగిసినట్లేనని అందరూ భావించారు.

2023 శాసనసభ ఎన్నికలకు ముందు టిడిపి మరోసారి తెలంగాణలో పార్టీని నిలబెట్టుకునేందుకు చేసిన ప్రయత్నంలో భాగంగా కాసాని జ్ఞానేశ్వర్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించి, ఖమ్మంలో చంద్రబాబు భారీ సభ నిర్వహించి, పార్టీ విడిచిపెట్టిన వారిని తిరిగి ఆహ్వానించారు. కాస్త హడావుడి చేసినప్పటికీ శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున ఎవ్వరూ పోటీ చేయలేదు. తాజాగా టిడిపి పుట్టిన గడ్డ తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపాయి. అయితే, ఇప్పుడు తెలంగాణలో టిడిపి పుంజుకోవడం సాధ్యమా? అనే ప్రశ్న తలెత్తుతుంది. టిడిపి తెలంగాణలో పునఃప్రవేశంపై టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్య చేశారు. బిజెపి ఉత్తరభారతదేశంలో తగ్గిన బలాన్ని దక్షిణాదిలో పూడ్చుకోవడంలో భాగంగానే కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు ఆ పార్టీ డైరెక్షన్‌లో టిడిపి తెలంగాణలో ప్రవేశిస్తుందని ఘాటు వ్యాఖ్యలే చేశారు. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో స్థిరపడిన ఏపి వాసులతో పాటు, పాత క్యాడర్‌కు, ఇప్పటికీ టిడిపి పట్ల మమకారం ఉంది. కానీ, తెలంగాణలో అధికారం లేక రెండు దశాబ్దాలు గడిచిన ఈ తరుణంలో పాత క్యాడర్ వివిధ పార్టీల్లో చేరి స్థిరపడిపోయారు. తెలంగాణ ఉద్యమం,




ఇతర కారణాలతో యువత, కొత్త క్యాడర్ గత పదేళ్ళలో పెద్దగా టిడిపిలో చేరలేదనే చెప్పవచ్చు. పైగా ఇక్కడ పార్టీని నడిపిందుకు గుర్తింపు ఉన్న రాష్ట్ర నాయకుడు అవసరం. అయితే, తమ పార్టీ నుండి ఎక్కువ మంది బిఆర్‌ఎస్‌లో చేరడం, ఆ పార్టీ కష్టాలలో ఉండడం, తమకు కలిసి వస్తుందని టిడిపి భావిస్తున్నట్లు తెలిసింది. బిజెపి కూడా బిఆర్‌ఎస్ స్థానాన్ని భర్తీ చేసేందుకు తహతహలాడుతోంది. ఈ రెండు పార్టీలు ఎపిలో, కేంద్రంలో మిత్రపక్షాలుగా ఉన్నాయి. ఒకవేళ తెలంగాణలో బిఆర్‌ఎస్ స్థానంలో రాజకీయ శూన్యం ఏర్పడితే, దాని భర్తీ చేసేందుకు రెండు పార్టీలు ఆరాటపడుతున్నాయి.

**ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ శక్తిని కూడదీసుకుంటుందా?**

మరోవైపు తెలుగు రాష్ట్రాల సిఎంల సమావేశం జరిగిన రెండు రోజులకే టిపిసిసి అధ్యక్షుడు, సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు కాంగ్రెస్ మంత్రులు విజయవాడకు వెళ్ళి ఉమ్మడి ఎపి మాజీ సిఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి సభలో పాల్గొన్నారు. వైఎస్ తనయ ఎపి పిసిసి చీఫ్ వై.ఎస్.షర్మిల ఆహ్వానం మేరకు వీరంతా అక్కడకు వెళ్ళారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కడపలో ఉప ఎన్నికలు వస్తాయని వార్తలు వస్తున్నాయి, అలా అయితే, తాను కడపకు వచ్చి గల్లీ గల్లీ తిరిగి కాంగ్రెస్‌ను గెలిపిస్తానని ప్రకటించారు. 2029లో ప్రధానిగా రాహుల్‌గాంధీ, ఎపి సిఎంగా షర్మిల అవడం ఖాయమని కూడా అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళడం ఇది రెండవ సారి. ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు విశాఖపట్నంలో జరిగిన విశాఖ ఉక్కు పరిరక్షణ సభకు మార్చిలో హాజరయ్యారు. ఇప్పుడు వైఎస్ జయంతి సభకు వెళ్ళారు. శాసనసభలో వైఎస్‌ఆర్‌సిపి ఘోర పరాజయంతో అక్కడ కొంత అవకాశం దొరుకుతుందేమోనని కాంగ్రెస్ అంచనా. రాజశేఖర్ రెడ్డి వారసుడుగా ఇప్పటి వరకు ఉన్న జగన్ తన్నుకుపోయిన కాంగ్రెస్ పునాది నుంచి కొందిరనైనా షర్మిలను ముందు పెట్టి తమ వైపు తిప్పుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే ఎపికి ప్రత్యేక హోదా ఇస్తామని రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గేలు ప్రకటించారు. వైసిపి వెనకంజ పడడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు షర్మిల ప్రయత్నాలకు మద్దతునిచ్చేందుకు సిఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రసంగం ద్వారా స్పష్టం చేశారు. విభజన తరువాత ఎన్నికల్లో పోటీ పడలేని స్థాయి నుండి కాంగ్రెస్ ఇటీవల శాసనసభ ఎన్నికల్లో షర్మిల నాయకత్వంలో వామపక్షాలకు కేటాయించిన సీట్లు పోగా, మిగతా అన్ని స్థానాలలో పోటీ చేసే స్థాయికి ఎదిగింది. స్వయంగా ఆమె పోటీ చేసిన కడప లోక్‌సభ నియోజకవర్గంలో లక్షకు పై చిలుకు ఓట్లు సాధించడం, పులివెందులలో కాంగ్రెస్‌కు పదివేలకు పైగా ఓట్లు రావడం విశేషమే. భవిష్యత్తులో జరిగే పరిణామాల్లో ప్రతిపక్ష స్థానాన్ని తాము భర్తీ చేసినా, ఆ తరువాత అధికారం కోసం పోటీ పడవచ్చని కాంగ్రెస్ భావిస్తుంది. అందుకు గుర్తింపు కలిగిన నేత షర్మిల నేతృత్వం ఆ పార్టీకి ఉన్న ఏకైక ఆకర్షణ, బలం కూడా.

**ముప్పేట దాడిని ఎదుర్కొంటున్న బిఆర్‌ఎస్**

లోక్‌సభ ఫలితాలు, కేసులు, ఎంఎల్‌ఏల వలస ముప్పేట దాడులతో కుదేలవుతున్న బిఆర్‌ఎస్ తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు విశ్వప్రయత్నం సాగిస్తుంది. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు కాంగ్రెస్‌లోకి వలస వెళ్ళే ప్రక్రియ ఈ వారంలోనే వేగం పుంజుకుంది. ప్రతికూల రాజకీయ వాతావరణాన్ని అధిగమించేందుకు నిరుద్యోగుల అంశాన్ని బిఆర్‌ఎస్ ఒక అవకాశంగా తీసుకుంది. గ్రూప్ 1లో అభ్యర్థుల నిష్పత్తి 1:100కు పెంచాలని, డిఎస్‌సి వాయిదా వేయాలని కొందరు చేస్తున్న ఉద్యమాన్ని ఆ పార్టీ తన భుజాలపై వేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు శతథా కృషి చేస్తుంది. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ఉద్యమిస్తున్నారని, అలాగే రైతులు, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటూ వివిధ అంశాలను ముందేసుకుంటుంది. కానీ, కొద్ది నెలల క్రితం వరకు ఆ వర్గాలను దూరం పెట్టిన బిఆర్‌ఎస్‌కు ప్రస్తుతానికైతే అంత విశ్వసనీయత రావడంలేదు. పార్టీ ఫిరాయింపులపై బిఆర్‌ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యల్లో ఒకింత మార్పు కనపడుతుంది. తాము పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని, ఒకేసారి శాసనసభా పక్షాన్ని విలీనం చేసుకున్నామంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమర్థించుకుంటూ చేసిన వ్యాఖ్యలు అంతగా రుచించడం లేదు. కానీ మాజీ మంత్రి హరీశ్‌రావు మాత్రం తమ పార్టీలో చేర్చుకున్న వారితో పెద్దగా ఫలితాలు రాలేదని, ఆ ఎంఎల్‌ఏలలో చాలామంది ఓడిపోయారని అన్నారు. అలాగే ఫిరాయింపులను ప్రోత్సహిస్తే తమ పార్టీ పరిస్థితే ఎవరికైనా వస్తుందని మరో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలు ఆ పార్టీ నేతలు వాస్తవాలను కొద్ది కొద్దిగా అంగీకరిస్తున్నట్లు అర్థమవుతుంది. ఎవరైనా తమ తప్పులను అంగీకరించి, ప్రజల వైపు నిలబడితే కచ్చితంగా ఏదో నాటికి ఆదరించే అవకాశం ఉంటుందే తప్ప, చేసింది పొరపాటైనా సమర్థించుకుంటే మాత్రం వారికే నష్టం.

## సమస్యలను పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మినా మహిళ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మహమ్మద్అలీ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం హైద్రాబాద్‌లో నిర్వహించిన నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అనే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కాగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కలిసి వినతిపత్రం అందచేసి ప్రైవేట్ కళాశాలలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించడం జరిగిందన్నారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ విద్యాసంవత్సరం నుంచి ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## స్వయం ఉపాధితో ముందుకు సాగాలి

### మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పొందుతూ మరి కొంత మందికి ఉపాధి కల్పించేలా ముందుకు సాగాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నిర్మల చర్చి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన భవ్య ఇంజన్ కార్బన్ క్లినింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల నుండి కార్ల వరకు ఇంజన్‌లో పేరుకుపోయిన కార్బన్‌ను క్లినింగ్ చేస్తే వాహనాలకు మైలేజ్‌తో పాటు పికప్ పెరుగుతుందన్నారు. జిల్లా కేంద్రం వ్యాపార రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. సూర్యాపేటలో నూతన టెక్నాలజిని తీసుకవచ్చిన నిర్వహకులు పోటు కిరణ్, నాగేశ్వర్ రావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, చకిలం రాజేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, కోతి గోపాల్ రెడ్డి, నరేందర్ నాయుడు, సాయినేత, రెబల్ శ్రీను, నిర్వహకులు పి వెంకటేశ్వర్లు, వసంతలక్ష్మీ , సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరిపై కుక్కల దాడి

### తీవ్ర గాయాలతో ఆసుప్రతిలో బాలుడు చేరిక



**ప్రజాపక్షం/చండూరు :** చండూరు మున్సిపాలిటీలో వీధి కుక్కలు చెలరేగి పోతున్నాయి. వీధులలో గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నలు పెద్ద లు అని తేడా లేకుండ మనుషులపై దాడి చేస్తున్న అధికారులు ,ప్రజాప్రతినిధులు ఎవ్వరు కూడా పట్టించు కోవడం లేదం టూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం చండూరు పట్టణంలో ఇద్దరిపై దాడి చేసి విచక్షణరహితంగా కాటు వేశాయి. చండూరు పటట్ణంలో వీధులలో తిరుగుతున్న కుక్కలను పట్టుకొని వేరే చోటుకు తరలించి కుక్కల బెడద లేకుండా చేయాలని ప్రజా ప్రతినిధులను, మున్సిపాలిటీ అధికారులను చండూరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సరిహద్దు వాడపల్లి చెక్‌పోస్ట్ తనిఖీ

**ప్రజాపక్షం/(మిర్యాలగూడ)దామరచర్ల:** అంతరాష్ట్ర సరిహద్దు ఇరు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా గంజా, మాదకద్రవ్యాలు, పిడియస్ బియ్యం లాంటి అక్రమ రవాణా సరఫరా కాకుండా ప్రత్యేక నిఘా పెడుతూ ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలలో చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేయాలిని,ఇరు రాష్ట్రాలకు ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ పటిష్ఠ నిఘా నిర్వహించాలని జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవార్ అధికారులకి,సిబ్బందికి సూచించారు.అనంతరం దామరచర్ల లో ఏర్పాటు చేసిన యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ ని పరిశీలించి ప్రాజెక్టు లో జరుగుతున్న పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## ఫుట్‌బాల్‌లో నల్లగొండ బాలికల జట్టు విజయకేతనం

**ప్రజాపక్షం/నల్లగొండ :** గత మూడు రోజులపాటు మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్ బాల్ టోర్నమెంట్లో నల్లగొండ జిల్లా జట్టు క్రీడాకారులు మంచి క్రీడ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయిలో విజయకేతనం ఎగరవేశారు.ప్రతి ఆటలో ముందువరుసలో ఉంటూ ఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించారు. ఖమ్మం జిల్లా జట్టుతో తడపడగా ఖమ్మం–0, నల్లగొండ–3,మెదక్–0 నల్లగొండ–4 రాగ గోల్ సాధించి ఫైనల్‌లో నిజామాబాద్‌పై నల్లగొండ 5గోల్ సాధించారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్ బాల్ టోర్నమెంట్లో నల్గొండ క్రీడాకారులు విజయం సాధించడం పట్ల ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంట్ల అనంత రెడ్డి,ఉపాధ్యక్షులు డాక్టర్ ఓరుగంటి శ్రీనివాస్ క్రీడాకారులను అభినందించారు. రాబోయే రోజుల్లో క్రీడాకారులు మరింత పట్టుదలతో జాతీయస్థాయిలో కూడా విజయం సాధించి నల్గొండ జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. క్రీడాకారుల విజయం వెనుక ఉన్న ఫుట్ బాల్ కోచులు బొడ్డుపల్లి సునీత,ప్రశాంత్ లను అభినందించారు.

## విషమంగానే శ్రీజయ ల్యాబొరెటరీస్ కార్మికుడి ఆరోగ్య పరిస్థితి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలోని శ్రీజయ ల్యాబొరెటరీస్ కంపెనీలో విషవాయువు లీక్‌తో అస్వస్థతకు గురైన కార్మికుల్లో కొండూరి గిరిబాబు ఆర్యోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల కార్మికులు ప్రమాదానికి గురైయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన 6 మంది కార్మికుల్లో యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన కొండూరి గిరిబాబు ఆర్యోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఊపిరితిత్తుల్లోకి విష వాయువు నిండిపోవడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారిందని వైద్యులు చెప్పినట్లు కార్మికుడి కుటుంబ సభ్యులు తెలిపారు. మెరుగైనా వైద్యం కోసం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి నుండి యశోధ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తుంది. పరిశ్రమలో ప్రమాదం జరిగి రెండు రోజులు గడుస్తున్న కూడ నేటికి పిసిబి అధికారులు ఇతర ప్రభుత్వ అధికారులు సైతం పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై విచారణ చెపట్టలేదు. అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహించుకుంటున్నారు.

**యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి**

పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే విషవాయువు లీక్ అయ్యిందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆందోజు శంకరాచారి ఆరోపించారు. పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి ప్రీకాషన్ పరికరాలు కార్మికులకు ఇవ్వకపోవడం వల్లె ప్రమాద స్థాయి తీవ్రత పెరిగిందన్నారు పరిశ్రమలో ప్రమాదం జరిగిన కూడ పిసిబి అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎవరికి దక్కేనో..!



**గ్యాంగ్ స్టార్ నయిమ్ ఆస్తులు రూ.572 కోట్లు**

**1015 ఎకరాల వ్యవసాయ భూములు, 27 ఇళ్లు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్యాంగ్‌స్టార్ నయిమ్ బెదిరిం పులకు పాల్పడి దోచుకున్న ఆస్తులు ఎనిమిదేళ్ల గడుస్తున్నా బాధితులకు ఇంకా దక్కలేదు. ఈ కేసు విచారణ నత్తనడకన సాగడమే ఇందుకు ప్రధాన కారణం. నయిమ్ ఎన్‌కౌంటర్ తరువాత అతని ఆస్తులు పెద్ద ఎత్తున గోల్‌మాల్ అయ్యాయనే ఆరోపణలు కూడా వచ్చాయి. జ్యూడిషియల్ విచారణ కూడా జరిపించాలనే డిమాండ్లు కూడా వచ్చాయి. నయిమ్‌తో పాటు అతని కుటుంబ సభ్యుల పేర్లపై భువనగిరి,నల్గొండ, కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లలో ఉన్న 1015.13 ఎకరాల వ్యవసాయ భూములు, అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, ముంబాయి, ఛతీస్‌ఘడ్‌లో ఉన్న 1,67,117.62 గజాలలో ఉన్న 27 భారీ భవంతులను సీజ్ చేశారు. వీటి మొత్తం మార్కెట్ విలువ సుమారు రూ.575 కోట్లు (ప్రభుత్వ విలువ రూ.143.94 కోట్లు) ఉంటుంది. 2016 ఆగస్టు 8వ తేదీన షాద్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో మిలినియమ్ కాలనీ వద్ద గ్యాంగ్‌స్టార్ నయిమ్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆ తరువాత అతనిపై చాలా మంది బాధితులు బయటికి వచ్చి తమకు జరిగిన అన్యాయాలపై ఫిర్యాదులు చేశారు. వీటన్నింటిని దర్యాప్తు చేసేందుకు అప్పటి నార్త్‌జోన్ ఐజి ఐపిఎస్ అధికారి వై.నాగిరెడ్డితో ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్)ను ఏర్పాటు చేసింది. సిట్ దర్యాప్తులో నయిమ్ చేసిన హత్యలు, దోపిడీలు, బెదిరింపులు, కిడ్నాప్‌లపై రాష్ట్ర వ్యాప్తంగా 255 కేసులు నమోదు చేశారు. కిడ్నాప్‌లకు పాల్పడి, బెదిరించి బలవంతంగా ఆస్తులను రాయించుకోవడంపై కూడా బాధితులు సిట్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిట్ దర్యాప్తు చేసి నయిమ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు, బినామీలపై ఉన్న ఆస్తులను గుర్తించి సీజ్ చేశారు. నయిమ్ ఆస్తులు సీజ్ చేసి ఎనిమిదేళ్లు గడుస్తున్నా బాధితులకు ఇంత వరకు న్యాయం జరగలేదు. నయిమ్ కేసు దర్యాప్తు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో నయిమ్ బెదిరింపులతో భూములు కోల్పోయిన బాధితులు తమకు న్యాయం ఎప్పుడు దక్కెనో అని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

**ధరణిలో సర్వే నెంబర్లలో గోల్‌మాల్..**

నయిమ్ ఆస్తులను సీజ్ క్రమంలో సర్వే నెంబర్లలో అవకతవకలు జరిగాయి. నయిమ్ పేరుతో లేని సాధారణ రైతులుకు చెందిన భూములను కూడా ఈ కేసులో ముడిపెట్టి నిషేధిత భూముల జాబితాలో జత చేశారు. ఒకే సర్వే నెంబర్‌లో నయిమ్‌కు భూములు ఉన్నాయి. అదే సర్వే నెంబర్‌లో కేసుకు సంబంధం లేని రైతులకు సంబంధించిన భూములు ఉన్నాయి. అయితే ధరణిలో ఆ సర్వేనెంబర్‌లో ఉన్న మొత్తం భూములను నిషేధిత జాబితాలోపెట్టడంతో సాధరాణ రైతులు తమ భూములు విక్రయించుకోలేని స్థితిలో ఉన్నారు. వారికి రావాల్సిన రైతుబంధుకు కూడా వారు దూరం కావాల్సి వచ్చింది. వీటన్నింటిపై ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

**సీజ్ చేసిన వ్యవసాయ భూములు**

| పేరు | ఎకరాలు |
|---|---|
| ఎండి నయిముద్దీన్ (గ్యాంగ్‌స్టార్) | 167.1 |
| హసీనా బేగం (నయిమ్ భార్య) | 119.15 |
| తాహెరాబేగం | 99.35 |
| ఎండి అబ్దుల సలీమ్ | 89.5 |
| పాశం శ్రీనివాస్ | 71.35 |
| ఆహెలా బేగం | 66.33 |
| హీనా కౌసర్ | 62.28 |
| షేక్ ఫయాజ్ | 60.00 |
| సలీమాబేగం | 47.25 |
| అయేషా బేగం | 18.7 |
| పాశం నలినీ | 27.00 |

## నీటి నిల్వలను వెంటనే తొలగించాలి

### డిఎంహెచ్ఒ డాక్టర్ సుజాత



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలను వెంటనే తొలగించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత తెలిపారు. శనివారం కరీంనగర్‌లోని యుహెచ్‌పిసి బుట్టి రాజారాం కాలనీ, పోలీస్ ట్రేనింగ్ సెంటర్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా , దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో డ్రైడేను పాటించి ఇండ్ల చుట్టూ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా నీటి నిల్వలను వెంటనే తొలగించాలన్నారు. వర్షపు నీరు ప్రధానంగా కూలర్లు, ఫ్రిడ్జ్ ట్రేలు, కొబ్బరి బొండాలు, పాడైపోయిన పాత్రలు, టైర్లు తదితర వాటిలో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కావున వారానికి రెండు రోజులు డ్రైడేను పాటించడం ద్వారా దోమలు అరికట్టి వ్యాధి ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆశా కార్యకర్తను సంప్రదించి రక్త పరీక్ష చేసుకుని వ్యాధి నిర్దారణ అయినట్లయితే మందులు వాడడం ద్వారా వ్యాధిని నివారించి వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. అదే విధంగా పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి ఆసుపత్రుల నుంచి వచ్చే వ్యర్థాలను వేరుపరిచి శాస్త్రీయ పద్దతిలో పరిష్కరించాలని జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు వ్యర్థాలను మున్సిపల్ చెత్తలో వేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రులు తమ వ్యర్థాలను శాస్త్రీయ పద్దతిలో పరిష్కరించని 3 ఆసుపత్రులు గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించని వారిపై డిఆర్ఏ యాక్ట్ ప్రకారం వారి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## ఖమ్మం కీర్తి పెరిగేలా అభివృద్ధి

### మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం:** ఖమ్మం కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా మరింతగా నగర సమగ్రాభివృద్ధి జరగాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరం అందంగా, పరిశుభ్రంగా ఉండాలని ఆయన కోరారు. శనివారం నగరపాలక సంస్థ సభ్యులు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ విద్యా, వైద్యం, మౌలిక వసతులతో పాటు ప్రశాంతత నెలకొనేవిధంగా ప్రజలకు భరోసా ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. నగరానికి భూ గర్భ, మురుగు కాలువల వ్యవస్థను సాధిస్తామని, మం చినీరు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తామన్నారు. ఖమ్మంలో తక్షణం ఇంటి నెంబర్లను కేటాయించాలన్నారు. వర్షాకాలం డ్రైనేజీ వ్య వస్థ దెబ్బతినకుండా చూడాలని మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు తక్షణ చర్యలు తీసు కోవాలన్నారు. త్వరలోనే జాతీయ రహదారులకు అనుసంధానంగా రోడ్లను నిర్మించి వాహనాల రద్దీని తగ్గిస్తామన్నారు. బడ్జెట్ సమావేశాల తర్వాత ముఖ్యమంత్రితో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని అప్పటి వరకు తాత్కాలిక ఏర్పాట్లతో ప్రజలకు తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళికనురూపొందించాలన్నారు.అంతకు ముందు మంత్రి హోదాలో సమీక్షకు హాజరైన తుమ్మల నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోను పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర హయాంలో రెండో డిపోగా ప్రఖ్యాతి గాంచిన నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోను బస్సు లను పెంచి పునరుద్ధరించాలంటూ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మాజీ జడ్పీటీసీ సభ్యుడు దూదిమెట్ల సత్తయ్య యాదవ్ వినతి పత్రం అందజేశారు. శనివారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభ హోత్సవలకు నల్లగొండ వెళ్తు మార్గమధ్యలో నార్కట్ పల్లి వద్ద ఆగిన తెలంగాణ రవాణా శాఖ, బి సీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నాల ప్రభాకర్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లకు 60 బస్సులను కేటాయించి బస్‌డిపోను పునరుద్దరించాలని సత్తయ్య వినతి పత్రం అందజేశారు. రహదారి వెంట ఉండడంతో సరియైన బస్సు లు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.త్వరతగతిన డిపో ను పునరుద్దరణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు బత్తుల ఉషయ్య, నాయకులు వడ్డే భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల అలసత్వం.. పనుల్లో నిర్లక్ష్యం

### అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో పర్యవేక్షణ కరువు




**ప్రజాపక్షం/పెగడపల్లి :** అధికారుల అలసత్వం.. పనులలో నిర్లక్ష్యం వెరసి అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి ప నులు జాప్యం జరుగుతున్నాయి. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో అధికారుల పర్యవేక్షణ కరువయ్యింది. పనుల్లో నాణ్యత లేకుండానే చేస్తున్న పనులను సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని సందర్బాల్లోఎవరికీ తెలవకుండా అగ్రిమెంట్ లేకుండానే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కొన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. అయితిపల్లి గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, సదరు కాంట్రాక్టర్ లోపాయికారీ ఒప్పం దం చేసుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరిగినా సంబంధిత పిఆర్ ఏఈ పర్యవేక్షణ కొరవడిందని, పనుల పరిశీల చే యడం లేదనేవిమర్శలు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతున్నారు. ఇలాంటి అవకతవకలకు సం బంధించిన పనులు మండలంలోని గ్రా మాలలో జరుగుతున్నాయా అనే సందేహాలు లేకపోలేదు. పనుల్లో అవకతవకలను ఏఈ గుర్తించడం లేదని, పనులు చేసే కాంట్రాక్టర్లతో లోపాయికారీ ఒప్పందాలను కుదుర్చుకుంటుండనే విమర్శలు మండల ప్రజల నుంచి వెల్లువెత్తున్నాయి. ఈ విషయమై సంబంధిత పిఆర్ ఏఈని వివరణ కోరగా నిర్లక్ష్యంగా దాటవేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పనులను నాణ్యతగా పూర్తి చేయాలని, అవకతవకలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

## పాలకవర్గ సభ్యులు బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ది అర్బన్ బ్యాంకు కరీంనగర్ నూతన పాలకవర్గ సభ్యులు బ్యాంకు సీఈవో ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వారు మాట్లాడుతూ నూతన పాలకవర్గ నియామకానికి సహకరించిన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అర్బన్ బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది సహకారంతో అభివృద్ధి చేపడతామన్నారు. మూడు నెలల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డివిడెంట్ ఫండ్ విడుదలకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే గంగాధర నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంతో పాటు కరీంనగర్ మెయిన్ బ్రాంచ్ పరిధిలో ఏటిఎం సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. నూతన పాలకవర్గ సభ్యులను బ్యాంకు సిబ్బంది పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు గడ్డం విలాస్‌రెడ్డి, మడుపు మోహన్, ముక్క భాస్కర్, భీరం ఆంజనేయులు, మహ్మద్ కలీం ఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మి , రవీందర్ రెడ్డి, ఎ.విద్యాసాగర్, ఇ.లక్ష్మ ణ్ రాజు, ఎండి సమీయొద్దీన్, మంగి రవీందర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రెహమాన్, కామిడి రామిరెడ్డి, మూల రవీందర్ రెడ్డి, సర్దార్ దన్న సింగ్, పోరాండ్ల రమేష్, యండి అమీర్, మూల జైపాల్, గంగుల దిలీప్, అనరాసు కుమార్, కుర్ర పోశయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ షబానా, తదితరులున్నారు.

## విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/కోదాడ :** ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి సెలవు దినాలు రెండవ శనివారం, పండుగ దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలపై మండల,జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని యూటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాసరెడ్డి శ్రీనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాటలో విద్యార్థుల నమోదు కోసం తల్లిదండ్రుల ఇండ్లకు వెళ్లినప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు సెలవుదినాలు ఎక్కువగా ఉంటాయని అడుగుతున్నారని,నిబంధనలు ప్రభు త్వ,ప్రైవేట్ పాఠశాలలకు ఒకటే ఉన్నా జిల్లా, మండల విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం మూలంగా ఈ దుస్థితి ఏర్పడుతుందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోవడానికి ఇది కూడా ఒక కారణమన్నారు. ఇకనైనా మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు సెలవుదినాల్లో ప్రైవేట్ పాఠశాలలు నడపకుండా చూడాలని ఆయన కోరారు.కొన్ని పాఠశాలలు మొహ ర్రం, బక్రీద్ వంటి పండుగల్లో సహితం పాఠశాలలు నిర్వహిస్తున్నాయని అధికారులు అప్రమత్తమై ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలను నడిపించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఇండెల్‌మనీ ప్రైవేట్ లిమిటెడ్‌లో కుంభకోణం

### విచారణ చేసి న్యాయం చేయాలంటున్న బాధితులు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** అత్యవసరాల కోసం తమ బంగారం కుదవ పెట్టి తీసుకున్న లోన్లకు ఇండెన్ మనీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ అధిక వడ్డీలతో మరోక లోన్ తీసుకున్నారని బాధితులు బుర్ర శ్రీనివాస్ సరస్వతి దంపతులు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలోని ఇండెల్ మనీ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15నెలల క్రితం ఈ బ్యాంకులో బంగారం కుదువ పెట్టి 18లక్షలు లోన్‌ను రూ. 1.10 పైసల వడ్డీకి తీసుకున్నామని తెలిపారు. అనంతరం ఆ సంస్థ మేనేజర్ నిబంధనలు తెలుసుకోని తాము పెట్టిన బంగారంపై అధిక వడ్డీకి మరికొంత డబ్బు తీసుకోవచ్చని రూ. 2.50ల వడ్డీకి మరో రెండు లక్షలు వినియోగదారులకు తెలియకుండా పోర్జరీ సంతకాలతో తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల బ్యాంకు నుండి పెద్ద ఎత్తున డబ్బు కట్టాల్సి ఉందని డబ్బు వెంటనే కట్టాలని లేని పక్షంలో తమ బంగారం వేలానికి వెళ్తుందని చెప్పడంతో హైద్రాబాద్ నుండి హుటాహుటిన గోల్డ్ లోన్ తీసుకున్న కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు.తాము తీసుకున్న లోన్ 18లక్షలు అయితే ఇప్పుడు అది రూ. 30లక్షలకు పెరిగిందని చెప్పడంతో లబోదిబోమన్నారు. మాకు తెలియకుండా మా బంగారంపై అధిక వడ్డీకి మరో రుణం తీసుకున్న గోల్డ్ లోన్ సంస్థ మేనేజర్‌పై తగిన విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై సంస్థ జోనల్ మేనేజర్, ఏరియా మేనేజర్‌లు సూర్యాపేట సంస్థ మేనేజర్ ఫోర్జరీ సంతకాలు చేసింది వాస్తవమేనని అంగీకరించారని ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు. మా డబ్బులు మాకు ఇవ్వాలని కోరడంతో మేనేజర్ సంస్థ నుండి పారిపోయేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు ఈ సంస్థపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

## రూ.35లక్షల గంజాయి పట్టివేత

### మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి శరత్‌చంద్రపవార్




**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు భారీ గంజాయిని పట్టుకున్నారు. అ క్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసి రూ.35 లక్షల విలువగల గంజాయి, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్‌పి శరత్‌చంద్రపవార్ వెల్లడించారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశ ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించా రు. మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్‌రాజు నేతృత్వంలో వన్‌టౌన్ సీఐ సుధాకర్, ఎస్ఐ రవి సిబ్బందితో గాలింపు చర్యలు భాగంగా శుక్రవారం మ ధ్యాహ్నం పట్టణ శివారులో అనుమానస్పదంగా కనిపించిన రెండు వాహనాలను తనిఖీ చేయగా కారులో ఉన్న నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టారు. దీని లో భాగంగావాహనాల్లో రూ.35లక్షల విలువగల 14.585 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన రామును విచారించగా అతను చెప్పి వివరాల ప్రకారం సూర్యాపేటజిల్లా పెన్‌పహాడ్ మండలానికి చెందిన నూనావత్ జగన్, నునావత్ మంచ్యానాయక్‌ల ఆదేశాల మేరకు ఒకటి హైద్రాబాద్ నుంచి మరొకటి సూర్యాపేట నుంచి దేవరకొండ మద్దిమడుగుకు వెళ్లేదారిలో గుర్తు తెలియని వ్యక్తులు సరఫరా చేసిన రెండు వాహనాల్లో లోడ్ చేసుకోని రవాణా చేస్తున్నామని వివరించారు. రవాణాలో సూర్యాపేట జి ల్లా పెన్‌పహాడ్ మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరు పరారీలో ఉన్నారని తెలిపారు. ప్రత్యేక బృందాలతో వారిని అరెస్ట్ చేసేందుకు ముమ్మర చర్యలు చేపట్టామన్నారు. పట్టుబడిన రాము, ఇతర నిందితులపై గతంలో కేసులు ఉన్నాయని, నిందితులు నూనావత్ జగన్, నూనావత్ మం చ్యానాయక్, ఆంగోతునాగరాజు, బానోతు సాయిలు పరారీలో ఉన్న ట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదకద్రవ్యా ల వినియోగంపై దృష్టి సారించామన్నారు. మాదకద్రవ్య నివారణలో పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. డిఎస్‌పి రాజశేఖర్ రాజు, సీఐలు సుధాకర్, జనార్థన్, ఎస్ఐలు సతీష్, రవి, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

## ప్రతి మహిళ ఒక శక్తిగా ఎదగాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/నెక్కొండ:** ప్రతి మహిళ ఒక శక్తిగా ఎదగాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దీక్షకుంట్ల గ్రామంలో మహిళా కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే దొంతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రతి మహిళా సంఘానికి రూ.20లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ప్రతి మహిళా ఒక శక్తిగా ఎదగాలని మీకు కావాల్సిన సహాయ సహకారాలు సకాలంలో అందిస్తామని తెలిపారు. అదేవిధంగా కమ్యూనిటీహాల్‌కు సంబంధించిన వాటర్‌బోర్, ఫ్లోరింగ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్యాంక్ లింకేజీ నుండి కీర్తన, కావ్య, ఇందిరా గ్రూపులకు రూ.15లక్షల చొప్పున మొత్తం రూ. 45లక్షల బ్యాంక్ లింకేజి రుణం సాంక్షన్ కాపీని మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండం రామానందం, నెక్కొండ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బక్కి అశోక్, నర్సంపేట నెక్కొండ మార్కెట్ చైర్మన్లు పాలాయి శ్రీనివాస్, రావుల హరీష్‌రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, నెక్కొండ పట్టణాధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, బండి శివకుమార్, జిల్లా ఓబిసి ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, ఎంపిడిఓ వీరేష్ గౌడ్, దీక్షకుంట స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఈఓ రాజకుమార్, నెక్కొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగం ప్రశాంత్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్‌రావుల మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎంపి, ఎమ్మెల్యేలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా సత్యసాయి గార్డెన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం విజయోత్సవ సభలో పాల్గొన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పార్లమెంటు యువజన, కోఆర్డినేటర్ పోలెపాక అశోక్, హన్మకొండ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నందిపాక భాస్కర్, వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు, మండలాధ్యక్షులు, గ్రామ శాఖ మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా అమ్మకాలపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

సుమారు రూ.2 లక్షల విలువ గల సిగరేట్ల స్వాధీనం



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి:** జిల్లా ఎస్పి చెన్నూరి రూపేష్ ఆదేశానుసారం ఏర్పాటు చేయబడిన టాస్క్ పోర్స్ పోలీసు బృందాలు జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అసాంఘీక చట్ట వ్యతిరేఖ కార్యకాలపాలను అరికట్టేందుకు విస్తృత్త స్థాయిలో దాడులు నిర్వహిస్తూ శుక్రవారం మధ్యాహ్నం 13.00 గంటల సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు సద్దుల శ్రీనివాస్ తండ్రి సంగయ్య వయస్సు 47 సంవత్సరాలు వృత్తి పాన్ మసాలా సరపరాదారు నివాసం శివాజీ నగర్, సంగారెడ్డి టౌన్ అక్రమంగాపాన్ మసాలా పోగాకు విక్రయిస్తున్నాడని అతని ఇంటిపై రైడ్ చేసి సాగర్ 340, ఆర్ఎం. 39, బ్లూల్ 267, మిరాజ్ 130,విమల్ పాన్. మసాలా 207, స్వాగత్ 26, వి1 204, చైనీ 5 ఎస్ఆర్ఐ 328, బ్లాక్ లాబుల్ 1897, దరివాలా 29, సూయ దర్ పూడి 51, గాయి 7, రాజ్ నివాస్, 35, రాజ్‌శ్రీ 28,ఎం10,ఆర్ఆర్47,అంబర్ 7,పారిస్ సిగరేట్లు 40,బాక్స్‌లు ఎ10 సిగరేట్ 11, బాక్స్ లు సుమారు 2 లక్షల విలువ గల పాన్ మసాలా సిగరేట్ బాక్స్ లను స్వాదీనం చేసుకొని నిందితునితో సహా తదుపరి విచారణకై సంగారెడ్డి టౌన్ పోలీసు స్టేషన్ కు తరలించినారు.

## అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులు ప్రారంభం



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో శనివారం అదనపు సీనియర్ సివిల్ జడ్జీ కోర్టు అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జీ సంగారెడ్డి జిల్లా అడ్మినిస్ట్రేషన్ నాయమూర్తి టీ మాదవి దేవి హైకోర్టు న్యాయమూర్తి అనిల్ కుమార్ జుకంటి జిల్లా ప్రధాన న్యాయమూర్తి .జి. భవాని చంద్ర జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు ప్రారంబోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి టీ మాదవి దేవి , హైకోర్టు న్యాయమూర్తి అనిల్ కుమార్, జుకంటి ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అర్, అండ్ బి అతిథి గృహం వద్ద వారికి సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంల జిల్లా ఎస్పీ రూపేష్, వివిద కోర్టుల న్యాయమూర్తులు ,జిల్లా సంక్షేమాదికారిణి లలిత కుమారి , సంగారెడ్డి బార్ అసోసియేషన్ ప్రెసెడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

## భారత నాస్తిక సమాజం రాష్ట్ర మూడో మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మూడ నమ్మకాల నిర్మూలన కోసం, శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ఎన్నో దశాబ్దాలుగా పోరాడుతున్న తెలంగాణ రాష్ట్ర భారత నాస్తిక సమాజం మూడో మహాసభలను విజయవంతం చేయాలని శనివారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద డాక్టర్ జీవై సోమయ్య, జి సాంబయ్యలు మూడో మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరు మూడ నమ్మకాలను వీడాలని, మూడనమ్మకాలను తొలగించే ఈ నాస్తిక మహాసభలు హన్మకొండ కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా వడ్డేపల్లి రోడ్డులో డాక్టర్ జయగోపాల్ ప్రాంగణంలో ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నామని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పసులాది ప్రశాంత్, బీరెల్లి రవి వర్మ, కాకర్ల కృష్ణ కుమార్, పసులాది యాకయ్య, చిట్యాల కొండయ్య, శంకర్, ఎల్లయ్య, సోమయ్య, రాజు, సోమచందర్, బొట్టు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# శాఖల వారీగా వన మహోత్సవం

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి:** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను శతశాతం పూర్తి చేయాలని , గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిశుక్రవారం డ్రైడేను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో బాగంగా పటాన్చెరు మండలం రామేశ్వరం బండ గ్రామంలో కలెక్టర్ క్రాంతి వల్లూరు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలను, గ్రామ పంచాయతీ కార్యాలయంను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామస్థులతో మాట్లాడారు. గృహ జ్యోతి క్రార్యక్రమంలో భాగంగా 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించిన లబ్దిదారులకు ఉచిత విద్యుత్తు వస్తుందా లేదా అని కలెక్టర్ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత విద్యుత్తు రాకుంటే దరఖాస్తు చేసుకోవలాని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా శాఖల వారిగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు పక్క యాక్షన్ ప్లాన్స్ రూపొందింఇచ మొక్కలు నాటి ప్రదేశాలను గుర్తించాలని, నాటిన మొక్కలకు ట్రీ గార్డులను ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సం దర్భంగా కలెక్టర్ రామేశ్వరం బండ పాఠశాల లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ ఇం టి ముందు మొక్కలు నాటేందుకు మొక్కలు పంపిణీ చేయాలని వనమహోత్సవం కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటి పూర్తిస్థాయి లక్ష్యాన్ని సాధించాలని అధికారులను సూచించారు. వర్షాకాలం సీజన్లో గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ అదికారులు పంచాయతీ శాఖ అధికారులు గ్రామాలలో ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని టైర్లు పూల కుండీలు, షెడ్లు, కూలర్లు కొబ్బర బోండాలలో నీరు నిల్ల ఉండకుండా వ్యాధులు ప్రభల కుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీరు ఎక్కువ కాలం నిలువ ఉంటే డెంగ్యూ, మలేరియా, వ్యాధులు వ్యాపిస్తాని ప్రజలకు వివరించాలన్నారు. పాఠశాలల వ్యాదులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో నీటి గుంటలు లేకుండా చూడాలన్నారు. పైప్ లైన్ లీకేజీ లో మారమ్మతులు చేయాలని, మంచి నీటి ట్యాంకులను క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేయాలని ప్రతి వారం దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా ఎంపిడిఓలు శ్రద్ద వహించాలన్నారు. పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి అంటూ వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీలు నిర్వహించి ప్రతిరోజు నివేదికలు సమర్పించాలని ప్రత్యేక అదికారులకుసూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాద్యాయులు , అమ్మ ఆదర్శ కమిటీలు, పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవుజా తహసిల్దార్ రంగారావు, ఎంపిడిఓ యాదగిరి ఎంపీ ఓ అదిశంకర్, పంచాయతీ సెక్రటరీ భవాని ప్రజాప్రతినిదులు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ కారిడార్, ఎడ్యుకేషన్ హబ్‌గా వరంగల్

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య




**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** ఇండస్ట్రియల్ కారిడార్, ఎడ్యుకేషన్ హబ్‌గా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు.శనివారం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అధ్యక్షతన పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అభినందన సన్మాన సభ జరిగింది. ఈ సభలో ఎంపి కావ్య మాట్లాడుతూ ఓరుగల్లు కోట నుండి ఎర్రకోటకు తనను పంపించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని, ముఖ్యంగా తమ ఇంటి ఆడబిడ్డగా భావించి అత్యధిక మెజారిటితో గెలిపించిన వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. కేంద్రంలో నరేంద్రమోదీ ఓటమి భయంతో పాలన సాగిస్తున్నాడని, ఎన్నికలలో కళ్లు విరిగిన మోదీ ఒకవైపు నితీష్ కుమార్, మరోవైపు చంద్రబాబు చేతి కర్రల సాయంతో నడుస్తున్నాడని ఎద్దేవా చేశారు. రానున్న రోజులలో కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, భావి భరత ప్రధాని రాహుల్ గాందీనేనని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారధ్యంలో అభివృద్ధి ముందుకు సాగుతున్నదని, తాను వరంగల్ పార్లమెంట్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపి పసునూరి దయాకర్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, హజ్ కమిటి చైర్మన్ ఖుస్రూ పాషా, హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు దేవేందర్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మంచినీటి సౌకర్యం కల్పించాలి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని వేషాలపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కాలనీ కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత సంవత్సరం నుండి కాలనీకి కనీస వసతులు మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. కనీస సౌకర్యాలు లేక 546 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మిషన్ భగీరథ పైపులైను వేశారని, దానికి మిషన్ భగీరథ మోటార్స్ కరెంటు సదుపాయం లేక నీటిని ఇవ్వడం లేదని, 15 కె.వి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని అన్నారు. అట్లాగే భాస్కర్ గడ్డ పోచమ్మ గుడి నుండి వేషాలపల్లి డబుల్ బెడ్ రూమ్‌ల వరకు రోడ్డు వేయాలని, రోడ్డు కిరువైపులా లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం నిండి ఉండడం వలన క్రిమి కీటకాలు పాముల కు నిలయంగా మారిందని అన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని కాలనీలలో వీధి దీపాలు సెప్టిక్ ట్యాంక్ ల ద్వారా వచ్చే నీరు కాలువలోకి పోవడానికి మోరి నిర్మాణం చేపట్టాలని పారిశుద్ధ్య కార్మికులు రోజువారి చెత్తను సేకరించాలని వారు డిమాండ్ చేశారు.

## రైతులపై దాడిచేసిన గుమాస్తాపై చర్యలు




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ఆరుగాలం ఎండనక వాననక పంటలు పండిస్తూ దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతులపై వరంగల్ లక్ష్మీ పురం కూరగాయల మార్కెట్‌లోకి కూరగాయాలు తీసుకొచ్చిన రైతులపై దాడి చేయడం అమానుషమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. రైతులు నిత్యం లక్ష్మీ పురం కూరగాయల మార్కెట్‌కు రోజు వస్తున్నట్లుగానే కూరగాయలు తీసుకరాగా షాపు నంబరు 98లో పనిచేస్తున్న గుమస్తా సునీల్, రంజీత్, వినోద్‌తో పాటుగా మరికొందరు రైతులు సయింపు వెంకటేశ్వర్‌రావు గీసుకొండ మండలం అనంతారం, వంజరపల్లికి చెందిన సిరుల రవీందర్‌లను విపరీతంగా కొట్టడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంటను ఎక్కడైనా స్వేచ్ఛగా అమ్ముకునే విధంగా ఉండాలని ప్రభుత్వాలు ఓ పక్కన చెపుతుంటే మరోపక్కన రైతులు స్వేచ్ఛగా పంటను అమ్ముకోకుండా భయాందోళనకు గురిచేస్తూ పంటను తక్కువ ధరకు అమ్ముకునే విధంగా మార్కెట్‌లో రైతులు పెట్టుబడిదారులు మోసం చేయడం జరుగుతుందన్నారు. రైతులపై దాడిచేసిన వ్యక్తులను వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారిపై పీడీ యాక్ట్ నమోదుచేయాలని, ఏ రైతుపై దాడి చేయకుండా చూడాలని పంటను స్వేచ్ఛగా అమ్ముకునే విధంగా వరంగల్ లక్ష్మీ పురం కూరగాయల మార్కెట్‌లో సదుపాయాలను ఏర్పాటుచేయాలన్నారు. రైతులపై దాడిచేసిన గుమాస్తాలపై ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో రైతులు శనివారం ఫిర్యాదు చేశారన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున రైతాంగాన్ని కదిలించి న్యాయం జరిగే విధంగా పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, బాధ్యులు సిరుల రవీందర్, సయింపు వెంకటేశ్వర్‌రావు,రాంబాబు,బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## నాసిరకం అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ వ్యాపారిపై కేసు




**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి:** నాసిరకం అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాలపై చెలగాటమాడుతున్న వ్యాపారిపై కేసు నమోదు చేసారు. సుమారు 5 నుండి 6 క్వింటాళ్ల నాసిరకం అల్లం వెల్లుల్లి పేస్ట్, కంపెనీనిసీజ్ చేసామని సంగారెడ్డి రూరల్ ఇన్స్పెక్టర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ నుందు ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ తేది 04–07–2024 నాడు సాయంత్రం 5 గంటల సమయంలో వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు ఇంద్రకరణ్ పిఎస్ఎస్ఐపి విజయ్ కుమార్ సంగారెడ్డి జిల్లా పుడ్ సేఫ్టీ ఆఫీసర్ అయిన ధర్మేందర్ పాల ఇద్దరు కలిసి జుల్కల గ్రామం నందు నెంబర్ ఇ.నెం 252/1 ఆవరనలో తాహ ఫుడ్స్ పేరుతో అల్లం వెల్లుల్లి పెస్ట్ తయారు చేస్తున్న పరిశ్రమను సందర్శించి సంగారెడ్డి జిల్లా పుడ్ సేఫ్టీ ఆఫీసర్ అల్లం వెల్లులి ఫెస్ట్ తయారీకి వినియోగించే మెటీరియల్స్ శాంపిల్స్ ను తీసుకొని హైదరాబాద్ ల్యాబ్‌లో పరిశోదన కోసం పంపించడ జరిగింది. అనంతరం తేది 12–07–2024 పుడ్ సేఫ్టీ అధికారి ధర్మేందర్ పాల్ పిర్యాదులో తెలిపినది ఏమనగా మొహమ్మద్ వసీం తండ్రి షరీఫ్ వ యస్సు 30 సంవత్సరాలు వృత్తి వ్యాపారం నివాసం జుల్కల్ గ్రామం కంది మండలం సంగారెడ్డి జిల్లా తన ఇంటనెంబర 252/1 ఆవరణలో తాహ ఫుడ్స్ పేరుతో నాసిరకం అల్లం వెల్లుల్లిని తక్కువ దర కలిగిన ఇతర ముడి పదార్థాలను వినియోగించి పరిశ్రమలో ఏలాంటి పరిశుభ్రత పాటించకుండా అపరిశుభ్రమైన పరిస్థితులలో నాణ్యత లేని వెల్లుల్లి , ఇతర ముడి పదార్థాలను ఉపయోగించి అక్రమంగా నాసిరకం అల్లం వెల్లు ల్లి పేస్ట్ తయారు చేస్తూ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు తరలిస్తూ తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదిస్తున్నాడని ఈ అల్లం వెల్లుల్లి పేస్ట్ ప్రజల ఆరోగ్యానికి హానికరమనిపై వ్యక్తి పై చట్టరీత్య కఠిన చర్య తీసుకోవలని ఫిర్యాదు చేయగా క్రైమ్ నెంబర్ 67/2024,సెక్షన్ 274,275,125 బిఎస్ ఎస్ చట్ట ప్రకారం ఇంద్రకరణ్ పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ నిందుతుడు అయిన కంపెనీ యజమాని అయినటువంటి మహమ్మద్ వసీం అదుపులోకి తీసుకొని సుమారు 5 నుండి 6 క్వింటాళ్ల అల్లం వెల్లులి పేస్ట్ ను కంపెనీ సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచాలి

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



**ప్రజాపక్షం/ కమలాపూర్:** ప్రభుత్వ ఆసుప్రతిలో మెరుగైన వైద్యం అందించి, డెలివరీల సంఖ్యను పెంచాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శనివారం కమలాపూర్ ప్రభుత్వ ఆసుప్రతిలో వైద్యులతో సమీక్ష నిర్వహించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర తొలి సిఎం కెసిఆర్ ప్రభుత్వ ఆసుప్రతులకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన ఆడబిడ్డకు మగబిడ్డ పుడితే 12వేలు, ఆడబిడ్డ పుడితే 13వేల రూపాయలతో పాటు కెసిఆర్ కిట్‌ను ఇవ్వడం జరిగిందని, కానీ ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు, రోగులకు మెరుగైన వైద్యంతో పాటు ప్రభుత్వ ఆసుప్రతిపై నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని డాక్టర్లను సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెల 15 నుండి 20 డెలివరీ అయ్యేలా చూడాలని డాక్టర్స్‌ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ ఉన్నాడని, గ్రామాల్లో ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుప్రతి పై అపనమ్మకం పోవాలంటే డాక్టర్లుతో పాటు ఆసుపత్రి స్టాఫ్ సమయానికి రావాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతినెల ఒక సారి ఆకస్మికంగా తనిఖీ చేయడం జరుగుతుందని వారికి తెలిపారు. తనిఖీకి వచ్చినప్పుడు సమాయానికి రాని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కువ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కాబట్టి వచ్చిన రోగులకు మెరుగైనా వైద్యం అందించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించి వారి నమ్మకం కలిగించాలని కోరారు. డాక్టర్లు కు ఆసుపత్రికి తన సహాయ సహకారాలు తన కృషి ఉంటుందని తెలిపారు. రాజకీయాలతీతంగా నిరుపేదలకు వైద్యం అందించే విషయంలో రాజీపడేది లేదని అన్నారు. నేరుగా ఆసుపత్రిలో ఉన్న ప్రతి ఒక పేషెంట్ వద్దకు వెళ్ళి వైద్యం అందుతుందా లేదా అని వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తక్కలపల్లి సత్య నారాయణ రావు, మాజీ సర్పంచ్ సమ్మయ్య, మాజీ వైస్ ఎంపిపి శైలజ అశోక్, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు, పార్టీ ముఖ్య నాయకులు, డాక్టర్ సూపరిండెంట్ డాక్టర్ నరేష్, వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది రాజ్ కుమార్, చంద్రమౌళి, స్టాఫ్ పాల్గొన్నారు.

## ప్రజా పాలన సేవా కేంద్రాల తనిఖీ

జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన సేవా కేంద్రాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించి చేస్తున్న దరకాస్తుల నమోదు, సవరణను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజలకు ఉచిత విద్యుత్ మరియు గ్యాస్ సబ్సిడీకి లబ్ధి అందని ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు తీసుకుని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ నందు నమోదు చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటివరకు వరకు స్వీకరించిన దరఖాస్తులను తనిఖీ చేసి నమోదు చేసిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు మొక్కలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ, మండల తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ కమిషనర్ ఇ. జోనా మరియు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సింగిరాల రాజు

నియామక పత్రం అందచేసిన మంత్రి రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సింగిరాల రాజును నియమిస్తూ నియామక పత్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రా జనర్సింహా అందచేశారు. ఈ నియామక పత్రాన్ని వికలాంగుల విభాగం రాష్ట్రఅధ్యక్షుడు ముత్తినేని వీరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా నూతనంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకమైన సింగిరాల రాజు మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి వచ్చేందుకు సహకరించిన పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నియోజక వర్గం ఇంచార్జి హరికృష్ణ, డిసిసి కార్యదర్శి మీసం నాగరాజు, చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షుడు మీసం మహేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆరంతరం సింగిరాల రాజును మీసం నాగరాజు, కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొరిమి రాజు, పర్శారాం,పొన్నాల రాజేశ్, గణేశ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా ముఠా అరెస్ట్

జయశంకర్ భూపాలపల్లి ఎస్పి కిరణ్ ఖరే ఐపిఎస్



**ప్రజాపక్షం/గణపురం:** జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఐపిఎస్ మాట్లాడుతూ శనివారం ఉదయం 7గంటలకు గంజాయి రవాణా గురించి నమ్మదగిన సమాచారం మేరకు ఎస్పి కిరణ్ ఖరే ఆదేశాలతో గణపురం ఎస్ఐ సాంబమూర్తి తన సిబ్బందితో కలిసి గాంధీనగర్ క్రాస్ రోడ్ వద్దకు వెళ్లి వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో కనబడగా, వారిని కస్టడీలోకి తీసుకొని విచారించగా వారి వద్ద ఒక బ్యాగు ఉండగా, అందులో దాదాపు 1/2 కేజీ గంజాయి కనిపించగా, వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, తదుపరి వారు నివాసముంటున్న అద్దె గది గాంధీనగర్ క్రాస్‌కి వెళ్లి తనిఖీలు చేపట్టగా అట్టి గదిలో వీరు దాచిపెట్టిన మరో ఐదున్నర కేజీల గంజాయి, మరో నింధితుడుని అదుపులోకి తీసుకోవడం జరిగింది. మీరు బీ హార్ చెందిన వారిగా గుర్తించామన్నారు. దాదాపుగా ఆరు నెలల ప్రాంతం నుండి ఇక్కడ చెల్పూర్ లోని రైస్ మిల్లులో పని కోసం వచ్చి జల్సాలకు అలవాటు పడి అట్టి పనిచేస్తున్న డబ్బులు సరిపోకపోవడంతో మీరు గతంలో పరిచయం ఉన్న ప్రదీప్ అనే వ్యక్తికి కాంటాక్ట్ అయ్యి అతని వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ ఇక్కడకు తీసుకువచ్చి ఎక్కువ రేట్లకు అమ్ముతూ అలా వచ్చిన డబ్బులతో జల్సాలకు అలవాటుపడ్డారనీ విచారణలో ఒప్పుకున్నారు. తదుపరి పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి సీజ్ చేసిన 6 కేజీల గంజాయినీ, ముగ్గురు వ్యక్తుల్ని పోలీస్ స్టేషనుకి తీసుకొచ్చి కేసు నమోదు చేయనైనది. ఒకరు పరారీలో ఉన్నారు. ఈ నింధితుల వివరాలు 1.గణేష్ టాకుర్ తండ్రి నర్సింగ్ టాకూర్, 47 సంవత్సరం, కూలి పని (రైస్ మిల్లు), గౌరీ గ్రామం, పర్కండి హిస్సా మండలం, నలందా జిల్లా, బీహార్, 2. మింటు కుమార్ తండ్రి రాంప్రీత్ పాశ్వాన్, 26 సం॥ గౌరీ గ్రామం,పర్కండి హిస్సా మండలం,నలందా జిల్లా, బీహార్, 3. చందన్ పాశ్వాన్ తండ్రి జోగిందర్ పాశ్వాన్, 33 సం॥ గౌరీ గ్రామం, పర్కండి హిస్సా మండలం, నలందా జిల్లా, బీహార్, 4. ప్రదీప్ ఉత్తరప్రదేశ్ (పరారీలో ఉన్నాడు), ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ గంజాయి నియంత్రణకు ప్రజలు సహకరించాలని,పూర్తి స్థాయిలో నియంత్రించుటకు జిల్లా పోలీసు యంత్రాంగం కష్టపడుతుందనీ,గంజయిపై ప్రత్యేక నిఘా పెట్టి గంజా నిర్మూలనకు కృషి చేస్తుందనీ, గంజాయి సంబందించిన ఏ సమాచారం ఉన్నా డయల్ 100 ద్వారా గాని స్థానిక పోలీసు అధికారికి చేరవేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇట్టి ఆరు కేజీల గంజాయి పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వర్తించిన భూపాలపల్లి డిఎస్పి ఏ.సంపత్ రావు, చిట్యాల సిఐ డి.మల్లేష్, గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది నేతాజీ,శ్రీనివాసులు ను ఎస్పి కిరణ్ ఖరే ప్రత్యేకంగా అభినందించి,రివార్డు ప్రకటించారు.

## సరస్వతి కాలువపై వంతెనల పరిశీలన



ప్రజాపక్షం/సోన్ : శ్రీరామ్ సాగర్ జలాశయం దిగువన సరస్వతి కాలువపై వంతెనల నాణ్యతను శనివారం ఇరిగేషన్ ఎఇ మధుకర్ పరిశీలించారు. సోన్ మండలం గాంధీనగర్, జాఫ్రాపూర్,సాకేర,కడ్తాల్,న్యూ వెల్మల్ గ్రామాల్లో సరస్వతి కాలువపై వంతెనలను పరిశీలించారు.లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామం వద్ద రెండు రోజుల క్రితం వంతెన కూలిపోయింది. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ.. వంతెనలు నిర్మించి యాభైఏళ్లు పూర్తవుతుందని, ప్రస్తుతం శిథిలావస్థలకు చేరుకున్నాయని తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్,లస్కర్ ముత్యం,సాయన్న,గంగాధర్,కిష్టోఫర్ తదితరులున్నారు.

## ముందస్తు ప్రణాళికలతో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : వర్షాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు బొగ్గు, ఓబి ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. శనివారం ఏరియా జిఎం శ్రీరాంపూర్ ఉపరితల గనిని సందర్శించి మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం సాధించవలసిన నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. అనంతరం వారు సిఆర్ఆర్ కంపెని కాంట్రాక్టు ఉద్యోగుల మెడికల్ క్యాంప్ ను సందర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే ఓబీ లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని పేర్కొన్నారు. ఓబి ఎంత ఎక్కువ తీస్తే అంత బొగ్గు తీయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది చేస్తున్న కృషి అభినందించదగిన విషయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి టి శ్రీనివాస్, ఇన్చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్, డివైసిఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, సర్వే అధికారి సంపత్, సంక్షేమ అధికారి బి శంకర్, డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాలం దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలి : రవీందర్



ప్రజాపక్షం/ ముత్తారం : వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రవీందర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులకు, కార్యదర్శులకు సూచించారు. శనివారం ముత్తారం మండలంలోని ఓడేడు, అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, సీతంపేట గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పరిశీలించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ లాంటి విషజ్వరాల ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు తమ పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అధికారులు పారిశుద్ధ్యం లోపించకుండా పనులు చేయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని, మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని, మురుగుకాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఓడేడు కార్యదర్శి స్వప్న,రాకేష్, శ్యాంప్రసాద్, సీతంపేట కార్యదర్శి నరేష్, తో పాటు ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న సేవలో మెదక్ ఎంపి



ప్రజాపక్షం/ వేములవాడ : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని శనివారం మెదక్ ఎంపి రఘునందన్ రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అధికారులు అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులతో పాటు ఇతర మొక్కలు చెల్లించుకుని సేవలో తరించారు. అర్చకులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ అధికారులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్సింగ్ అన్నారు. శనివారం వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినాయక్నగర్లోని శ్రీచైతన్య స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని మండల విద్యాధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయటంతో తరగతులను వెంటనే మూసివేయాలని యాజమాన్యాన్ని హెచ్చరించారన్నారు. ఈ సందర్భంగా సెలవులలో తరగతులు నడిపిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు హక్కులను కాలరాస్తున్న పాఠశాలలో మీ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని వి వరిస్తూ విద్యార్థులను ఇళ్లకు పంపించటం జరిగిందన్నారు. కార్యక్రమం లో టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్సింగ్, గిరిజన విద్యార్థి సంఘం జైత్రం రాథోడ్, టిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మహేష్రెడ్డి పాల్గొన్నారు.



# సమస్యల వలయంలో సర్కారు బడులు

● 6 మండలాలకు ఒకే ఒక్కరు! ● విద్యార్థుల భవిష్యత్తును ఎలా చక్కదిద్దేది?




ప్రజాపక్షం/ నిర్మల్ ప్రతినిధి

కొత్త సర్కారు వస్తే సమస్యలు తీరుతాయానుకున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.. అన్న చందనంగా ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రభుత్వ బడులలో సమస్యలకు మాత్రం పరిష్కారం చూపడం లేదు.ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తామని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందంటూ, మరింత సమస్యల వలయంలో నెట్టేస్తుంది. నిర్మల్ జిల్లాలో 18 మండలాలకు గాను 735 పాఠశాలలు ఉన్నాయి. అలాగే ఆరు మండలాలకు ఒక విద్యాధికారి ఇన్చార్జి ఇవ్వడం.. ఇలా అయితే విద్యార్థులకు బోధించేది ఎలా ..? తన పాఠశాలను సబ్జెక్టును చెప్పుకోవాలా.. పాఠశాల సమస్యలు సరి చేసుకోవాలా తెలియక...? ఇన్చార్జి ఎంఇఒల పరిస్థితి...! కాంప్లెక్స హెడ్మాస్టర్లకు ఇన్చార్జి ఇవ్వడం మరింత ఉపాధ్యాయులకు భారంగా మారుతుంది. ఓ వైపు ప్రభుత్వ పెద్దలు ప్రతి సమావేశాలలో గొప్పగా ప్రసంగిస్తారు. కానీ క్షేత్రస్థాయిలో చెప్పిన దానికి పొంతన లేకుండా పోతుంది. విద్యావ్యవస్థను క్షేత్ర స్థాయిలో గాడిలో పెట్టడానికి ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను నిరంతరం తనిఖీలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి సమస్యలను పరిష్కరించడానికి మండల విద్యాధికారి ప్రధాన బాధ్యతను తీసుకుంటారు.పాఠశాలకు సంబంధించిన పనులు ఉపాధ్యాయులకు సంబంధించిన ముఖ్యమైన పనులను ఆయన సమీక్షించి జిల్లా విద్యాశాఖధికారి పంపవలసి ఉంటుంది కీలకమైన మండలాల విద్యాధికారుల పోస్టు ఖాళీ ఉండడం, పలు మండకాలలో ఇన్చార్జిలుగా ఉన్న ఒక్కొక్కరి పైన పని భారం ఎక్కువ అవుతుంది. మిగతా మండలాలకు ఐదుగురు ఉపాధ్యాయులు ఇన్చార్జి ఎంఇఒగా బాధ్యతలు చేపట్టారు. ఒక్కొక్కరికి రెండు మూడు మండలాలు ఇన్చార్జిలిస్తూ,మరింత భారం మోపుతున్నారని విమర్శలు కూడా లేకపోలేదు. బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన వారే కొనసాగుతున్న దుస్థితి, పని ఒత్తిడితో కొరవడిన పర్యవేక్షణ దీంతో విద్యార్థులకు కూడా సబ్జెక్టు బోధించలేని పరిస్థితి నెలకొంటుంది. జిల్లాలో కుంటుపడుతున్న విద్యావ్యవస్థపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆయా మండలాల్లో ఉపాధ్యాయులు పాఠశాలకు పూర్తిస్థాయిలో వెళ్తున్నారా లేదా అనేదానిపై సమాచారం లేకుండా పోతుంది.ఆయా పాఠశాలలో మెరుగైన విద్య బోధన కొనసాగుతుందా లేదా అనేది కూడా వారికి తెలియడం లేదు.దీంతో గ్రామాలలో ఉపాధ్యాయులు పాఠశాలల విధులకు దుమ్మా కొట్టారని ఫిర్యాదులు అందినప్పుడే గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు.

### పేరుకే బదిలీలు... యథాతథంగా విధులు..

పేరుకే బదిలీలు విధులు మాత్రం యధాతథంగా ఉన్నాయి. ఎంఇఒల బదిలీలు కూడా ఒక ప్రహసానంగానే మారాయి.పేరుకే బదిలీ అవుతున్నా విధులు మాత్రం యథానిధిగా ఈదే మండలంలో కొనసాగిస్తున్నారు.సర్వ శిక్ష అభియాన్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాల పరిరక్షణ స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ ఎంఈఓ ల ప్రధాన విధులు. పాఠశాలలో హెచ్ఎంలుగా విధులు నిర్వహిస్తూనే ఇతర మండలాలకు విద్యాధికారిగా పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో విరామం లేకుండా పనిచేయడంతో ఒత్తిడికి లోనవుతున్నారు.పనిచేస్తున్న ఒక మండలానికి వారానికి ఒక్క రోజు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని మండలాలలో జరిగే ప్రత్యేక సమావేశాలకు మాత్రమే హాజరు కావాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. పా ఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వర్యవేక్షణ ఉపాధ్యాయుల అవసరరీత్యా అందుబాటులో ఉండకపోవడం, బియ్యాన్ని గోదాములు నుంచి పాఠశాలలకు తరలించేందుకు తీవ్ర ఒత్తిడికి లోనవుతురన్ని, ప్రభుత్వం, రెగ్యులర్గా పోస్టు నియమించి,ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని,లేదంటే ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు కూడా రాలేక ప్రవేట్ పాఠశాలకి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు.విద్యార్థులు వెళ్లిపోయాక ప్రభుత్వాలకు ఎన్ని చేసినా వ్యవస్థలు బాగుపడే పరిస్థితి కనిపించదు. ఇప్పటికైనా రేంవత్ ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయుల పోస్టులను నియమించి ఇన్చార్జి ఎంఇఒలను తొలగించి రెగ్యులర్గా నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రజాపాలనకు ఐదు సేవా కేంద్రాలు

☞ 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ





ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిష్టాత్మకంగా తీసుకవచ్చిన ఆరు గ్యారెంటిలను అమ లు చేయడానికి ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చే యాలని నిర్ణయం తీసుకుంది. నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రజల కోసం గృహజ్యో తి, మహాలక్ష్మి పథకాల కోసం జూలై 15 నుంచి అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం పని దినాలలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు నగరంలోని ఆయా జోన్ కార్యాలయాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి గృహజ్యోతి పథకాలలో అప్డేట్ కోసం నగరంలో మహాలక్ష్మి , గృహజ్యోతి పథకంలో పేర్లు, చిరునా మా తదితరాల వివరాలను ఎడిట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. తెల్ల రేషన్ కార్డు ఉండి పథకాల అందని అర్హులైన వారి నుంచి మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ రీడింగ్ వినియోగదారులుండి రాని వారిని పథకాన్ని దరఖాస్తు చేసుకోవచ్చు.

### సేవలను సద్వినియోగం చేసుకోవాలి : మంద మకరంద్

అర్హులైన నగర ప్రజలు ప్రజాపాలన సేవా కేంద్రాలలో తమ సమస్యలను నివృత్తి చేసుకోవలి. సంక్షేమ పథకాలు రాని అర్హులు. ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోని లబ్ధి పొందాలి. ఆయా కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

### రెండు పథకాల కోసం దరఖాస్తు చేసుకునే కేంద్రాలు

నాందేవ్వాడ వాటర్ట్యాంకు (సాయి నరేంద్ర) 8886574773, గోల్ హనుమాన్ వాటర్ ట్యాంకు (సుస్మిత) 8096781186, బడాబజార్ వాటర్ ట్యాంక్ (నాగేష్) 9912137746, కంఠేశ్వర్ వాటర్ బ్యాంకు (ఎన్వివిఎస్.సతీష్) 9110515906, ఆర్సపల్లి వాటర్ ట్యాంకు (కైఫ్) 7993843572 లను సంప్రదించాలి.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా

చిన్నకల్వల గ్రామ స్పెషల్ ఆఫీసర్ శైలజ



ప్రజాపక్షం /సుల్తానాబాద్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని గ్రామ స్పెషల్ అధికారి శైలజ గ్రామ ప్రజలకు పిలుపు నిచ్చారు. సుల్తానాబాద్ మండలం చిన్న కల్వల గ్రామంలో శనివారం కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ శైలజ, గ్రామ పంచాయతీ సెక్రటరీ, సిబ్బందితో కలిసి డెంగీ, మలేరియా జ్వరాలపై ఆరా తీసి, డెంగీ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ డ్రమ్ముల్లో, ఇతర పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. గ్రామంలో గల పారిశుధ్య పనులను, మురిగి నీటి కాలువలను ఎప్పటికప్పుడు శు భ్రం చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతలు ఏర్పడి, మురిగినీరు నిలిచి ఉండడం గమనించాలని పేర్కొన్నారు. దోమల ఆవాస ప్రాంతాల్లో ప్రతిరోజు గ్రామంలో ఫాగింగ్ నిర్వహించి, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. డ్రైనేజీ లు, మురికి నీటి ప్రాంతాల్లో ప్రతి రోజు బ్లీచింగ్ పౌడర్ వేయాలని సూచించారు. గ్రామ ప్రజలందరి కృషితో సమిష్టిగా,బాధ్యతయుతంగా మనందరం కలిసి పనిచేయాలని కోరారు. అనంతరం పీహెచ్సీ ఆధ్వర్యంలోవైద్య శిబిరం ఏర్పాటు చేయించి, ఆయా సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యాధికారి డా.స్వప్న పరీక్షలు చేసి, ఉచితంగా మం దులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పనాస సతీష్, పీహెచ్ఓ స్వప్న, ఏఎన్ఎం అరుణ, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శోభ, సీఏ సమ్మక్క,రాజేశ్వరి మరియు ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు ట్రాక్టర్ దొంగల అరెస్టు





సిసి కెమెరా ఆధారంగా పట్టివేత

వివరాలు వెల్లడించిన ఎస్పి

ప్రజాపక్షం / వేములవాడ : ఆన్లైన్ బెట్టింగ్లకు అలవాటు పడి ట్రాక్టర్ దొంగతనానికి పాల్పడిన నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం రోజున వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వర్ధవెల్లి గ్రామానికి చెందిన సాయి, వెంకటేష్, వంశీలు ముగ్గురు వ్యక్తులు ఆన్లైన్ బెట్టింగ్లకు అలవాటు పడి డబ్బులు సరిపడక బోయినిపల్లి మండలం రాజన్న పేటకు చెందిన ఈడుగు కనకయ్య తన పొలంలో దున్నటానికి ట్రాక్టర్ను పెట్టుకోగా అది గమనించిన ముగ్గురు వ్యక్తులు అట్టి ట్రాక్టర్ను దొంగిలించి అమ్మాలని నిర్ణయించుకుని రాత్రి సమయంలో ఎవరూ లేనిది చూసి ట్రాక్టర్కు ఉన్న కేజ్వీల్స్ను అక్కడే వదిలేసి ట్రాక్టర్కు ఉన్న కల్టివేటర్తో సహా దొంగిలించుకుని పారిపోగా, ఈడుగు కనుకయ్య ఈ నెల 2వ తేదినా బోయినిపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐ పృధ్విధర్ గౌడ్, కానిస్టేబుల్స్ కోటేశ్వర్, తిరుపతిలతో టీం ఏర్పాటు చేసి సిసి కెమెరాల ఆధారంగా నిందితులు ట్రాక్టర్ను రాజన్న పేట నుండి దేశాయిపల్లి, రత్నంపేట, గుండన్నపల్లి, కోరెం, వట్టెంల, నూకలమర్రి, నర్సింగాపూర్(చందుర్తి మండలం), మల్యాల(చందుర్తి మండలం), లింగన్నపేట (రుద్రంగి మండలం), మానాల,భీమ్ గల్, ఆర్మూర్తో పాటు వివిధ గ్రామాల మీదుగా లోకేశ్వరం మండలంలోని మోడెం గ్రామానికి చేరుకుని అదే గ్రామానికి చెందిన గంజాయి పోశెట్టికి అమ్మగా, నలుగురు నిందితులను శనివారం రోజున ఉదయం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి వారి వద్ద నుండి జాన్ డీర్ ట్రాక్టర్, కల్టివేటర్(4,50,000), స్విఫ్ట్ డిజైర్ కారు, ద్విచక్రవాహనం, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్కి తరలించడం జరిగిందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేయాలని అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ నిషేధమని ఆన్లైన్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ శ్రీనివా స్, ఎస్ఐ పృధ్వీధర్ గౌడ్, కానిస్టేబుల్ కోటేశ్వర్, తిరుపతిలను అభినందించి రివార్డు అందజేశారు. ఎస్పి వెంట ఎస్పి శేషాద్రిని రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ

ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : రైతుల రెండులక్షల రుణమాఫీ ఆగస్టు15 లోగా జరుగుతుందని మంత్రివర్గ అభిప్రాయ సేకరణతో తెలుపుతున్నామని ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ రైతులకు హామిఇచ్చారు. శనివారం ఎన్విఆర్ కన్వెన్షన్ హాల్లో కళ్యాణలక్ష్మి , షాధిముభారక్ లబ్దిదారులకు చెక్కులను ప్రభుత్వవిప్ చేతులమీదుగా అందచేశారు. ఎల్లారెడ్డి పేట మండలానికి 117 మందికి, వీర్నపల్లికి 34కళ్యాణలక్ష్మి , షాధిముబారక్ చె క్కులు మంజురు కాగా వారికి వేములవా డ ఎంఎల్ఎ ఆదిశ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి అన్ని పథకాలను అమలుపరుస్తుందన్నారు. త్వరలోనే రైతులు తీసుకున్న రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసి తీరుతుందన్నారు.ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ళు మంజూరు అయ్యాయని అన్నారు. లబ్ధిదారునికి ఐదులక్షలు, దళిత, గిరిజనులకు ఆరులక్షలు ప్రభుత్వం అందచేస్తుందని పేర్కొన్నారు. రేవంత్రెడ్డి ప్రభు త్వం నిత్యం 18 గంటలు పనిచేస్తుందని గత ప్రభుత్వం ఏడులక్షల కో ట్లు అప్పు చేసిందని ప్రభుత్వాన్ని గాడిలో పెట్టడానికి కొద్ది గా జాప్యం జరుగుతుందని ఇంకా మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు అమ లు పరుస్తుందని తెలిపారు. ఇది ప్రజాప్రభుత్వం అని వారి సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. మల్కపేట రిజర్వాయర్ వద్ద భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని బరోసానిచ్చారు. కార్యక్రమంలో సిరిసిల్లా కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్చార్జ్ కేకే మహెందర్ రెడ్డి, జిల్లా నాయకుడు గడ్డం నర్సయ్య,తహసీల్దార్లు రాంచందర్,వీర్నపల్లి ఎలుసాని ప్రవీణ్కుమార్,సాహెబ్,వంగగిరిధర్రెడ్డి,గౌస్,గుండారపు కృష్ణరెడ్డి,నర్సయ్య, రాములు,బాల్రెడ్డి, కిషన్,రాజెందర్,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి



ప్రజాపక్షం/చిగురుమామిడి : అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, సిఎం సహాయనిధిని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పా ర్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్, నవాబుపేట, గాగిరెడ్డిపల్లె, ఇందుర్తి, రామంచ, ముల్కనూర్, పీచుపల్లె, సీతారాంపూర్, లంబాడిపల్లె, ఒగులాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు కంది తిరుపతిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లోని 58 మంది లబ్దిదారులకు 10,61,000 రూపాయ ల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. పేద బ డుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. అందు కు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్కు లబ్ధిదారులు దన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఠాగూర్ నరేందర్ సింగ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి షాబొద్దీన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కాంతాల మహిపాల్ రెడ్డి, తదితరులున్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం / ధర్మపురి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని, రైతులకు మేలు జరిగే విషయంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి సలహాలు స్వీకరిస్తామని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జైన గ్రామ ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో సకాలంలో రైతులకు ఎరువులు అందించేందుకు నూతనంగా నిర్మించిన గోదామును ఎమ్మెల్యే అడ్లూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన గోదాముతో రైతులకు ఎరువులు సకాలంలో అందుతున్నాయని అన్నారు. ఎరువుల సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 2లక్షల రైతు రుణమాఫీ త్వరలోనే మాఫీ జరగబోతుందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా తమ ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ఇటీవల వడ్ల కొనుగోలులో ఎటువంటి కోతలు లేకుండా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.

### భూ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

గత కొన్ని సంవత్సరాలుగా బీర్పూర్ మండలం చిన్న కొల్వాయి గ్రామ గిరిజనులకు ధర్మపురి మండలం ఆరెపల్లి గ్రామస్థుల మధ్య వివాదస్పదంగా ఉన్న 110 ఎకరాల భూ సమస్యను ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించారు. జగిత్యాల ఆర్డీవోతో కలిసి సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ఇరు వర్గాల వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా భూ సమస్యను పరిష్కరిస్తామని అందరూ సహకరించాలని కోరారు. అంతకుముందు ధోనూర్ గ్రామంలోని చెరువులో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీరందించాలని రైతులు, మత్స్యకారులు ఎమ్మెల్యేకు విన్నవించగా సదరు చెరువును పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగనబట్ల దినేష్, వేముల రాజేష్, కుంట సుధాకర్, చిలుముల లక్ష్మణ్, కస్తూరి శ్రీనివాస్, సింహరాజు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**PUBLICATION**

**IN THE COURT OF THE HON'BLE I ADDL DISTRICT JUDGE (MACT)**

**AT: KARIMNACAR**

**M.V.O.P NO.114 of 2023**

Between: -

**Mohammed Alam Basha** ...Petitioner

AND

**Busi Anil Babu and others** ...Respondents

To

1) **Busi Anil Babu S/o Rathnam**, aged about 51 years, Occ: Driver of Lorry bearing No.TS-05-UB-5766, R/o H.No. 2-410, Sri Ramnagar Colony, Balajinagar, Shameerpet Mandal of Rangareddy District.
2) **Kethavath Prasad S/o Manisingh**, aged about 50 years, Occ: Owner of Lorry bearing No.TS-05-UB-5766, R/o H.No.2-54, Pambanda Village of Shivampet Mandal of Medak District.

**(Respondent No.1&2)**

Whereas the above named Petitioner has filed above case for grant of compensation in a Motor Vehicle Accident against you and others and summons issued to you are returned as unserved. Take notice that the above suit is posted on **12-08-2024** for your appearance if any, you are hereby summoned to appear before the above said Court at **10:30 A.M.** either in person or through an advocate failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE COURT //

**Sd/- GANTA SRINIVAS**
**Advocate,**
Counsel for the Petitioner
Karimnagar, Cell: 9849268719

## 76 ఎకరాల భూమిని నిరుపేదలకు కేటాయించాలి : గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:**హనుమాపురంలో వున్న సర్వే నెంబర్ 28లో 76 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇంటి నివేశన స్థలాలకు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి మండలం, పట్టణ కౌన్సిల్ సమావేశం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గం లోని నాలుగు మండలాలలో ప్రభుత్వ మిగులు భూములు ఉన్నప్పటికీని ప్రభుత్వాలు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు.భువనగిరి పట్టణంలో 2000 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు లేవని ప్రభుత్వమే ప్రకటించింది.జాబితాను కూడా రూపొందించినట్లు చెప్పారు. 2000 మంది జాబితాను పరిశీలించడంలో ఆలస్యం చేస్తున్నారని తక్షణమే ఇంటి నివేషణ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ప్రజా సమస్యలపై ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం ఈనెల 23న జరపాలని నిర్ణయించినట్లు చెప్పారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, మండల కార్యవర్గ సభ్యులు ఉడుత రాఘవులు, మరిపెల్లి రాములు, పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, కోట శంకర్, యాదగిరి, బబ్బూరి అంజమ్మ, బింగి కృష్ణ, బద్దం వెంకటరెడ్డి, చిక్క నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## 26న సిపిఐ మహాధర్నా



**ప్రజాపక్షం/కాజీపేట :** పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం వేలాది మందితో జూలై 26న కలెక్టరేట్ ఎదుట సీపీఐ మహా ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తెలిపారు.కాజీపేట సీపీఐ మండల సమితి సమావేశం శనివారం రాంపూర్‌లో మాలోతు శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగింది. బిక్షపతి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా జిల్లాలోని పలు ప్రాంతాలలో పేదలు ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, గతంలో బీఆర్ఎస్ పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థలాలకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పేదల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే అన్ని మండలాలలో ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట జూలై 19న ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి పాల్గొన్నారు.

## బినామీ ఏజెన్సీల రద్దుకు డిమాండ్



**ప్రజాపక్షం/ నిజామాబాద్ అర్బన్ :** ఒకే వ్యక్తికి బినామీల పేర్లతో ఉన్న ఏజెన్సీలను రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. శనివారం ఎఐటియుసి కార్యాలయంలో విలేకరుల సమవేశంలో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంలో ఒకరిద్దరు బినామీ పేర్లపై పదుల సంఖ్యలో ఎక్కువ మంది పిల్లలు చదివే స్కూళ్లను మధ్యాహ్న భోజన ఏజెన్సీ పేరుతో తీసుకుని భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఏ స్కూల్ వంట ఆ స్కూల్‌లో చేయాలని నిబంధన ఉన్న ఒకే దగ్గర వంట చేసుకుని వారి స్కూళ్లకు భోజనాన్ని సరఫరా చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ ఇప్పటికైనా శ్రద్ధ వహించి జిల్లాలో బినామీ వ్యక్తులపై నడిచే ఏజెన్సీలను రద్దు చేసి అర్హులైన వారికి అప్పజెప్పాలన్నారు.నాయకులుహన్మాండ్లు,ఆనంద్, ప్రకాష్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/వాజేడు:** మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండలంలో పోలీసులు సరిహద్దు ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గడ్ 163వ జాతీయ రహదారిపై పేరూరు ఎస్ఐ గుర్రం కృష్ణ ప్రసాద్ ముమ్మరంగా శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. మండలంలోనిజగన్నాథపురం వైజంక్షన్‌లో ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, భద్రాచలం, ఏటూరునాగారం వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రయాణికుల బ్యాగులను సైతం తనిఖీ చేస్తున్నారు. మావోయిస్టు కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు బలగాలను మోహరింపజేసి మావోయిస్టు ప్రభావిత ప్రాంతావిత గ్రామాల్లో గస్తీ తిరుగుతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అనుమానితులను వివరాలు సేకరించి వదిలి వేస్తున్నారు. ఎవరైనా అనుమానితులుగా కనిపించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలే అంతిమ నిర్ణేతలు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గన్నా చంద్రశేఖర్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని వారిని ప్రతిఒక్కరు గౌరవించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకులసమావేశంలోఆయనమాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం వాటిని పొందడం ప్రజల హక్కు అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు, సిబ్బం ది గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.ఆర్టీసీ బస్సులలో ఆధార్‌కార్డు ద్వారా ఉచిత ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.ఈ విషయాన్ని టిఎస్ ఆర్టీసీ అధికారులతో పాటు కండక్టర్లు, డ్రైవర్లు గుర్తించాలన్నారు. పలు చోట్ల మహిళా ప్రయాణికులను చులకనగా చూస్తూమహిళలను దుర్భషలాడుతున్న ఘటనలు దృష్టికి వస్తున్నాయన్నారు. ఆర్టీసీసిబ్బందికి ఏమైనా అక్కస్సు ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు.ప్రయాణికులకు గతంలో లాగానే గౌరవ ప్రదమైన సేవలందించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై, నోటి దురుసుతో ప్రయాణికులనుఇబ్బంది పెడుతున్నవారిపై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వారిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన కోరారు. సిపిఐరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాలశ్రీనివాస్, దేవరం మల్లీశ్వరీ, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్,యల్లావుల రమేష్ పాల్గొన్నారు.

# త్వరలో 'పోడు' పట్టాలు ఇస్తాం

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి:** గిరిజన ప్రాంత ంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, త్వరలో పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని, కొత్త పోడు కొట్టడం మానేసి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం తాడ్వాయి మండలంలోని లింగా గ్రామంలో మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజలతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. లిం గాల, లవ్వల, బందాల, కొడిశాల గ్రామాలకు చెందిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, వికలాంగులకు సదరం క్యాంప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, తాడ్వాయి మండల ప్రత్యేకాధికారి డాక్టర్ అప్పయ్య, తహసీల్దారు రవీందర్, విద్యుత్‌శాఖ, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సంపూర్ణమైన విద్య

విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందించాలని, విద్యార్థులు విద్యతో పాటు సమాజంపై కూడా అవగాహన పెంచుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. శనివారం గోవిందరావుపేట మండలం చల్వాయిలో రూ.135.00 లక్షలతో సమగ్ర శిక్ష నిధులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయ తరగతి గదు ల, వసతి భవనాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు, సదుపాయాలు కల్పిస్తున్నామని పదవ తరగతి నుండి కస్తూర్బాగాంధీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు.గ్రౌండ్ లేవలింగ్, బోర్స్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, జిసిడిఓ రమాదేవి, గోవిందరావుపేట తహసీల్దారు సృజన్ కుమార్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ వెంకటలక్ష్మి , ఉపాధ్యాయబృందంపాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై దృష్టి

ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టితో ఐదు మారుమూల గ్రామాల కోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆసుపత్రి(ఆరోగ్య ఉప కేంద్రం)ను ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. శనివారం తాడ్వాయి మండలం పోచాపూర్ లలో ఏర్పాటు చేసిన తొలి కంటైనర్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజలతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గుట్టలపై ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారని,ఆరోగ్య సమస్యలు వస్తే ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని తొలి కంటైనర్ ఆసుపత్రి ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగు పడకల కోసం సుమారురూ.7లక్షలతో రూపొందించామని, పోచాపూర్‌లో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ పోచాపూర్‌లోని గురుకులంను పరిశీలించారు. మంత్రి సీతక్క విద్యార్థులతో మాట్లాడుతూ ఏకరూప దుస్తులు,పాఠ్యపుస్తకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

## వేలానికి వ్యతిరేకంగా పోరాటం




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** తెలంగాణ రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో వెలువడిన బొగ్గు నిక్షేపాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని గుర్తింపు కార్మిక సంఘం గా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గనుల వేలంకు వ్యతిరేకంగా వారం రోజుల నుండి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని పేర్కొన్నారు. శనివారం ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు నిక్షేపాలను నామినేషన్ పద్ధతిలో ప్రభుత్వం సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. గుజరాత్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు స్థానికంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలకు ఏ విధంగా నామినేషన్ పద్ధతిలో ఇచ్చారో, అదేవిధంగా ఇక్కడ కూడా బొగ్గు నిక్షేపాలను వేలంపాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీరాంపూర్ డివిజన్ లోని అన్ని గనులు, డిపార్ట్మెంట్‌ల నుంచి కార్మికులు భారీ సంఖ్యగా తరలివచ్చి బొగ్గు గనుల వేలంకు వ్యతిరేకంగా ఏరియా జిఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి జిఎం కు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ ప్రధానకార్యదర్శిలుకందికట్లవీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాసు, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టె కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, బ్రాంచ్ నాయకులు రాచర్ల చంద్రమోహన్, సంపత్, నాగభూషణం, ప్రసాద్ రెడ్డి, అఫ్రోజ్ ఖాన్ ఫిట్ కార్యదర్శ లక్ష్మణ్, నవీన్, రాజయ్య, మురళి, సారయ్య, నరసింహారావు, మైనింగ్ స్టాఫ్ నాయకులు బాలకృష్ణ, చంద్రమౌళి, దేవేందర్‌రెడ్డి, లక్కిరెడ్డిఉన్నారు.

## సంక్షేమ చట్టం కోసం పోరాటం




**ప్రజాపక్షం/హనుమకొండ:**వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టంతో పాటు డిమాండ్ల సాధనకోసం పోరాటాలకు సిద్ధంకావాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం హనుమకొడ జిల్లా బాలసముద్రంలోని కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించాలని కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ2లక్షల 70వేల కోట్లు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు అందించాలన్నారు.మునిగాల బిక్షపతి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, బికెఎంయు జాతీయ సమితి సభ్యులు మోతె లింగారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల ఎల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, బొట్టు బిక్షపతి, బండ్లోజు రాజమణి పాల్గొన్నారు.

## కమ్యూనిజం అజేయం.. అజరామరం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ:** కమ్యూనిజం అజే యం, అజరామరమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ మండలం జిల్లేపల్లి సిపిఐ గ్రామశాఖ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల పక్షాన నిలబడి పోరాడి సమస్యలను పరిష్కరించేది కమ్యూనిస్టు పార్టీ అని సూచించారు. ప్రజల్లో కమ్యూనిస్ట్ పార్టీలకు ఆధారణ తగ్గలేదని రాబోవు రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు నూతనోత్తేజంతో పని చేయాలని సూచించారు. నీరుకంటి రాములు అధ్యక్షతన జరిగిని ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, గంగిడి రాంరెడ్డి, వలమల్ల ఆంజనేయులు, శాఖ కార్యదర్శి సంకెపల్లి మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి జంగయ్య, శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు బీమా కల్పించాలి

ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ప్రతినిధి:** అన్ని బ్యాంకులలో డ్వాక్రా మహిళలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మానుకోట జిల్లా కేంద్రంలో మహిళలకు కుటీర పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. మహిళలకు డ్వాక్రా రుణాలు 20నుండి 50లక్షల వరకు పెంచి ప్రతీ గ్రూపుకు అందించి మహిళల అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఖాళీగా ఉన్న ఆర్‌పీ పోస్టులను భర్తీ చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మహిళలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని బీజేపీ ప్రభుత్వం దాడులు అరికట్టడంలో విఫలమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. గృహలక్ష్మి కింద మహిళలకు 2500 ఆగస్టు నుండే ఇవ్వాలన్నారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.మహిళాసమాఖ్యజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ఫాతిమా,ఎర్రోజు పద్మ,అలీమా,భాగ్యమ్మ,మాదవి, రాణి, లక్ష్మి , కవిత, గంగ, ఉమా, అంజలి, వెంకటమ్మఉన్నారు.

## మోదీ వైఖరేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ''భారతదేశంలో 167 డాలర్ బిలియనీర్లు ఉన్నారు. వారిపై 2 శాతం సంపద పన్ను విధిస్తే ఏటా రూ.1.5 లక్షల కోట్లు సమకూరుతాయి. ఇది జిడిపిలో 0.5 శాతం. ఈ మొత్తాన్ని పాఠశాలలు, ఆసుపత్రులు, పునుత్పాదక ఇందనం, తదితర ముఖ్యమైన రంగాలలో దేశ భవిష్యత్తు కోసం పెట్టుబడ్డిగా పెట్టవచ్చు' అని జైరామ్‌రమేశ్‌అన్నారు. బిలియనీర్లపై పన్ను విషయంలో ప్రధాని మోదీ వైఖరేమిటో చెప్పాలని కోరారు. అలాగే రియో డి జెనిరోలో జరిగే జి–20 సమావేశాలలో ఈ అంశం చర్చకు వచ్చినప్పుడు భారతదేశ విధానమేమిటని ప్రశ్నించారు. జి–20 దేశాల అధినేతలకు మాజీ అధ్యక్షులు, ప్రధాన మంత్రులు ఇటీవల బిలియనీర్లపై అంతర్జాతీయ పన్ను విధించేందుకు మద్దతు పలకాలని కోరుతూ లేఖ రాసిన నేపథ్యంలో జైరామ్ రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈనెలాఖరులోజరిగేజి–20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌ల గ్రూప్ సమావేశంలో సంపద పన్ను ప్రతిపాదనను బ్రెజిల్ ముందుకు తీసుకువచ్చి, దీనికి మద్దతుగా డిక్లరేషన్ ప్రకటించాలని కోరుతుంది.

## కోట్లకుపైనే (మొదటి పేజీ తరువాయి)

పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ సొమ్ము రైతుబంధు రూపంలో కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్నాయి. దీన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి పథకాన్ని వర్తింప చేయాల్సిన అధికారులు అవేవి పట్టించుకోకుండా రాజకీయ వత్తిళ్లు, మాముళ్లకు ఆశపడి ప్రజా ధనాన్ని వృదా చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో సుమారు 1000 ఎకరాలకు పైగా రాళ్లు, రప్పలు ఉన్న భూములతో పాటు రియల్ ఎస్టేట్ వెంచర్ భూములకు పాసుపుస్తకాలు ఉండడంతో పంట సేద్యం చేయకున్నా ఎకరాకు రూ. 10వేల చొప్పున రైతుబంధు పొందుతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు కోదాడ, తిరుమలగిరి, హుజూర్ నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటిలతో పాటు చివ్వెంల, మేళ్ళచెరువు, మద్దిరాల, మోతె, పెన్‌పహాడ్, మునగాల, కోదాడ రూరల్, సూర్యాపేట రూరల్, అర్వపల్లి, మఠంపల్లి, గరిడేపల్లి మండలాల్లో కూడా వేలాది ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సాగుభూమి కొనుగోలు చేసి నిబంధనలు పాటించకుండా ల్యాండ్ కన్వర్షన్ చేయకుండాచట్టంలో లోసుగులనుఅడ్డుపెట్టుకోనిఅమ్మకాలు జరిపారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని దురాజ్‌పల్లి సమీపంలో గత రెండేళ్ల క్రితం శ్రీస్వామి నారాయణ గురుకుల పాఠశాల సమీపంలో కొంతమంది వ్యాపారులు నూతనంగా 120 ఎకరాల భూమికొనుగోలుచేసి రియల్ ఎస్టేట్ వెంచర్ చేశారు. ఇందులో 42 ఎకరాల భూమిలో సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ పౌల్ట్రీ యజమానికి ఉండగా దానిని కూడా వారికి అమ్ముకున్నాడు. అయినా అతడి కుటుంబసభ్యులకు ఎకరానికి రూ.10వేల చొప్పున ఏడాదికి రూ.4లక్షల 20వేలు రైతుబంధు బ్యాంకు ఖాతాలో నేటికి జమ అవుతుంది. ఉండ్రుగొండ సమీపంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి బినామి 72 ఎకరాల భూమి కొనుగోలు చేసి వెంచర్ చేసి ఏళ్లు గడుస్తుంది. ఇతడికి కూడా ఏడాదికి రైతుబంధు రూ. 7లక్షల 20వేలు అతడి బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. ఇమాంపేట ఆదర్శ మోడల్ స్కూల్, ప్రతిష్ట ఫార్మసి కళాశాల ఎదురుగా రియల్ ఎస్టేట్ వెంచర్‌లో కూడా 24 ఎకరాలకు రైతుబంధుడబ్బులు ప్రభుత్వం సంబంధిత వ్యాపారుల ఖాతాలో జమ చేస్తుంది. ఇదిలా ఉండగా చివ్వెంల మండల పరిధిలోని గుంజలూరుసమీపంలోరియల్ ఎస్టేట్ వెంచరులో 50 ఎకరాల భూమికి రూ. 5లక్షలు రైతు బంధు అందుతోంది. వల్లభాపురం సమీపంలోని ఉండ్రుగొండ శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి సమీపంలో ఉన్న క్రషర్‌మిల్లు భూమికి, దేవాలయం ఆర్చి ఎదురుగా జాతీయ రహదారి వెంట నిర్మించిన ఓ ప్రైవేట్ పాఠశాలకూడారైతుబంధుఅందుతోంది. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామ పంచాయితీ పరిధిలో గత ఏడాది చేసిన 10 ఎకరాల రియల్ ఎస్టేట్ వెంచర్‌కు, మోతె మండలంలో ఖమ్మంజాతీయ రహదారిపై చేసిన వెంచర్లకు, చివ్వెంల మండలంలోని ఐలాపురం, ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలో చేసిన వందలాది ఎకరాల రియల్ ఎస్టేట్ వెంచర్ల భూములకు రైతుబంధు అందుతుంది.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## హైకోర్టు ప్లీడర్‌గా ఎన్.సుమన్ నియామకం

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు ప్లీడర్‌గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంఎన్.సుమన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సుమన్ హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్,పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.గత 18 సంవత్సరాల నుంచి హైకోర్టులో న్యాయవాధిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం అడ్వకేట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఆయన పని చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎనుములు రేవంత్‌రెడ్డికి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డికి,అదనపు అడ్వకేట్ జనరల్ టి.రజనీకాంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.నాగేశ్వర్‌రావు,అతని సహాచరులకు సుమన్ ధన్యవాదాలు తెలియజేశారు.

## స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ శివసేనారెడ్డికి సన్మానం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి కార్పోరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన శివసేనారెడ్డిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్ సన్మానించారు. శనివారం స్పోర్ట్స్ అథారిటి కార్పోరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలపడంతోపాటు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. యువజన కాంగ్రెస్ కోసం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోని వచ్చేందుకు శివసేనారెడ్డి ఎంతో కృషి చేశారని, అందుకు కీలక బాధ్యతలు పొందడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మున్ముందు ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని అభినందించారు.

## అనర్హత మందుల అమ్మకం నేరం

‘యజంత్ పెయిన్ అయిల్ ’ను పట్టుకున్న డ్రగ్స్ అధికారులు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** యజంత్ పెయిన్ అయిల్‌ను రూమాటిజం రోగానికి పని చేస్తుందని తప్పుడు ప్రకటనలతో అమ్మకాలు సాగిస్తున్న దుకాణంపై డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వివరాలు ఇవీ.. ఎన్‌బి హెల్త్ కేర్ మొహాలీ పంజాబ్‌లో తయారు చేసిన ఈ అయిల్ అర్థరైటిస్‌కు పని చేస్తుందని తప్పుడు ప్రకటనలతో అమ్మకాలు సాగిస్తున్నట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు గుర్తించారు. ఈ మందు కేవలం ఆయుర్వేదానికి సంబంధించిన ముందుగా గుర్తించారు. ఇలాంటి మందులను డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడిస్ 1954 యాక్ట్ ప్రకారం నేరమని డ్రగ్ కంట్రోల్ అడ్మీటేషన్ డైరెక్టర్ జనరల్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు నిజామాబాద్‌లోని ఒక మెడికల్ షాపులో యజంత్ పెయిన్ అయిల్‌ను పట్టుకున్నారు. డ్రగ్స్‌ను గుర్తించిన వారిలో నిజామాబాద్ అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీకాంత్, నిర్మల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ సుందర్ ఉన్నారు. తప్పుడు ప్రచారం కలిగిన ముందును అమ్మకం జరిపిన మెడికల్ షాప్‌పై తగిన చర్యలతోపాటు జరిమాన విధించారు. ఇలాంటి మందులను అమ్మకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ అడ్మీటేషన్ డైరెక్టర్ జనరల్ విబి కమలాసన్‌రెడ్డి పెర్కొన్నారు.

## నేడు గౌడన్నకు ‘కాటమయ్య రక్ష’ పంపిణీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఈదులు,తాళ్లు ఎక్కి కల్లు గీసే గౌడ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం ‘కాటమయ్య రక్ష’ కిట్లను అందించనుంది. ఈ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని హైదరాబాద్‌శివారులోని అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం, లష్కర్‌గూడ గ్రామంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నారు.గౌడన్నలతో సమావేశాన్ని నిర్వహించి, అనంతరం అక్కడే వారితో కలిసి సిఎం సహపంక్తి భోజనం చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర బిసి కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గౌడన్నలకు ‘కాటమయ్య రక్ష’ కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో చాలా సార్లు ప్రమాదాల బారిన పడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. ఇటువంటి ప్రమాదాలను నివారించేందుకే ఆధునికతను జోడించి సేఫ్టీ కిట్లను హైదరాబాద్ ఐఐటితో కలిసి ఒక ప్రైవేటు సంస్థ తయారు చేసింది. గీత కార్మికులు సులువుగా తాళ్లు ఎక్కేలా ఈ కిట్లను రూపొందించారు. ప్రమాదవశాత్తు తాటి చెట్ల మీద నుంచి కింద పడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించారు. ఒక్కో కిట్‌లో మొత్తం 6 పరికరాలు ఉంటాయి. తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్ల తరహాలోనే, యూజర్ ఫ్రెండ్లీగా ఈ పరికరాలు ఉంటాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



**అబ్దుల్లాపూర్‌మెట్:** సిఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర రావాణా మరియు బీసి సంక్షేమ మంత్రి పోన్నం ప్రభాకర్‌గౌడ్, స్థానిక శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక్‌తో కలసి శనివారం వారం ఏర్పాట్లను పరిశీలించారు.అయన మాట్లాడుతూ..కాంగ్రేస్ ప్రభుత్వం గీత కార్మికులకు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాదాల బారిన పడకుండా లైఫ్ సేవ్ కిట్ల పంపిణీని ప్రారంభించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి సభాకు సంబందించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మంత్రి పోన్నం ప్రభాకర్‌గౌడ్‌తో పాటు స్థానిక మాజీ జడ్.పి.టీ.సి బింగి దాస్‌గౌడ్ గీత కార్మికులు వివిధ శాఖల నాయకులు స్థానిక కాంగ్రేస్ పార్టీ నాయకులు పాల్గోన్నారు. ఇదిలా ఉండగా పెద్ద అంబర్‌పేట మునిసిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిఎంకు స్వాగతం పలకాలని సూచించారు. అందరూ తరలి రావాలన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు నిధులు ఇవ్వండి

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇందిరమ్మ ఇళ్లకు నిధులు కేటాయించడంతోపాటు ప్రారంభించేందుకు కృషి చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం కొందుర్గు మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని రామచంద్రాపూర్‌లో నిర్వహించారు. పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అందులో ఇళ్ళ స్థలాలు ఉన్న లబ్ధిదారులకు కట్టుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రూ.5లక్షలు ఇస్తామని చెప్పి నేటి వరకు ఇవ్వలేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టిలకు ఆరు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికి అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిధులు కేటాయించి ఇందిరిమ్మ ఇళ్లను త్వరగా ప్రారంభించాలని, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్ళను అర్హులైన లబ్ధిదారులకు ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలను చేర్చుకోవడంలో చూపిస్తున్న శ్రద్ధ ఆరు గ్యారంటీలపై చూపిస్తే రాష్ట్రం అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలోని ఏనెగడ్డలో సర్వేనంబర్ 237లో 74మంది లబ్ధిదారులకు 2007లోఅప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసిందని, అక్కడే ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందుర్గు మండల నూతన కౌన్సిల్‌ను నియమించారు. సిపిఐ మండల కార్యదర్శింగా భాగాల నరసింహా, కార్యవర్గ సభ్యులుగా జి.యాదయ్య, సి.సురేష్ భూపాల్, బందెమ్మ, పి.యాదమ్మ, బాల కృష్ణయ్యతోపాటు 15మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చౌదరిగూడ మండల కార్యదర్శి జిల్లేల వెంకటేష్, నాయకుడు ఎం.కృష్ణ, చిలుకమ్మ పాల్గొన్నారు.

## దూల్‌పేటను జల్లెడ పడుతున్న ఎక్సైజ్ పోలీసులు

డ్రగ్స్, గంజాయి కోసం ఇంటింటా సోదాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఎక్సైజ్ పోలీసులు డ్రగ్స్, గంజాయి కోసం శనివారం దూల్‌పేటను జల్లెడ పట్టారు. సాయంత్రం ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కొనసాగాయి. ఈ సోదాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిస్టిక్ టాస్క్ ఫోర్స్, స్టేట్ టాస్క్‌ఫోర్స్‌తో పాటు 120 మంది ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సోదా చేశారు. గంజాయి అమ్మకాలు వినియోగం అనుమానిత ప్రాంతాలు 37 చోట్లను గుర్తించారు. వీటితోపాటు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించారు. గంజాయి కోసం అమ్మకం దారుల వద్దకు వచ్చిన కస్టమర్లను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఎక్సైజ్ కమిషనర్ ఇ. శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలహాసన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు జాయింట్ కమిషనర్లు ఖురేషియా శాస్త్రీ, ఇఇఎస్ విజయ్, ఎఎస్‌లు శ్రీనివాస్‌సరావు, సౌజన్య, దూల్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మధుబాబులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. అయితే పోలీసుల తనిఖీలు మొదలవగానే గంజాయి వ్యాపారులు అప్రమత్తమైనట్లు తెలిసింది. సోదాల్లో ఎక్కడ కూడా గంజాయి, డ్రగ్స్ లభించలేదు.

## ఎంజిబిఎస్‌లో ఆరునెలల బాబు కిడ్నాప్ ముగ్గురు అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**మీర్‌చౌక్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఆరు నెలల బాబు కిడ్నాప్ కేసు మిస్టరీ వీడింది. కిడ్నాప్‌కు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి బాబును రక్షించి తల్లికి అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీడియా సమావేశంలో సౌత్‌జోన్ డిసిపి స్నేహమెహ్రా వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన నస్రీన్ బేగం (28), నూర్జహాన్ బేగం (20), మహ్మద్ ఆదిల్ (23)లు కిడ్నాప్ ముఠా ఏర్పాటు చేసుకున్నారు. కిడ్నాప్ చేసిన నస్రీన్‌బేగం విక్రయించి వచ్చిన డబ్బులోంచి మరో ఇద్దరు నిందితులకు కూడా ఇస్తానని అంగీకరించింది. ఈ క్రమంలోనే నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద ఉన్న హబీబ్ యున్నిసాను నూర్జహాన్ బేగం సంప్రదించింది. హైదరాబాద్‌లో నర్సు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించడంతో హబీబ్‌యున్నిసా తన ఆరు నెలల బాబుతో ఈ నెల 10వ తేదీన నెల్లూరు నుంచి హైదరాబాద్ ఎంజిబిఎస్ బస్టాండ్‌కు వచ్చింది. పథకం ప్రకారం అక్కడే ఉన్న సులాబ్ కాంప్లెక్స్‌లో ఫ్రెష్‌అప్ చేసేందుకు హబీబ్‌యున్నిసాను పంపించారు. ఆ తరువాత ఆమె ఆరు నెలల బాబును తీసుకుని ఈ ముఠా పారిపోయింది. ఈ మేరకు బాధితురాలు మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ పి.అరుణోదయ్ దర్యాప్తు చేయగా కిడ్నాపర్ల వివరాలు బయటపడ్డాయి. పటాన్‌చెరువులో ఉన్న నిందితుల ఇంటిపై పోలీసులు దాడి చేసి బాబును రక్షించి తల్లికి అప్పగించారు. ముగ్గురు కిడ్నాపర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తన బాబును కాపాడిన పోలీసులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

## ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్ చంద్ర శనివారం రాజేంద్ర నగర్ నియోజకవర్గం శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రత్యేకంగా అభినందించారు. బిఆర్‌ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేను కమీషనర్ కలిసి పుష్పగుచ్ఛా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంచినీటి సమస్యలపై దృష్టి



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నందున వెంటనే నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మేయర్ మద్దెల లతా ప్రేమ్ గౌడ్ జలమండలి అధికారులను ఆదేశించారు.శనివారం ఆమె హైదర్‌షాకోట్ ఎర్రకుంట చెరువును హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సేవరేజ్ బోర్డు మణికొండ డివిజన్ జనరల్ మేనేజర్ మహేందర్ నాయక్,కిస్మత్‌పూర్ సెక్షన్ మేనేజర్ టీ.శ్రీనివాస్ అధికారులతో కలిసి పర్యటించారు.ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.....లైన్ మెన్‌లను సరి చేసి సరిపడ బూస్టర్లలను ఏర్పాటు చేయించి గంట సేపు వచ్చే నీటి సరాఫరాను ప్రెషర్‌తో వదలాని జలమండలి అధికారును ఆదేశించారు. బిజేఎంసీ పరిధిలో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నరని, పరిష్కరించాలన్నారు. బిజేఎంసీ పరిధిలో ప్రజలు నీటి సమస్య లేకుండా చూసే బాధ్యత మీపైన మరియు మాపై ఉందని మేయర్ అధికారులకు గుర్తు చేశారు. అదే విధంగా బండ్లగూడ జాగీర్ పాత మసీదు ముందు డ్రైనేజీ నీరు లీక్ అయ్యి రోడ్డుపైన మురికి నీరు కాలువలై పారుతుందని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని బిజేఎంసీ ఏఈని మేయర్ ఆదేశించారు. ఈ సమస్యతో వాహనదారులు,స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరని వెంటనే అక్కడి వెళ్లి సమస్య పరిష్కరించాలన్నారు.

## నాలాల వద్ద భద్రతా చర్యలు







**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్షకాలం నేపథ్యంలో వరద నాలల వద్ద భద్రత చర్యలను జిహెచ్‌ఎంసి ముమ్మరం చేసింది. భారీ వర్షాలు కురిసిన సమయంలో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటుండడం, ప్రాణ నష్టం కూడ సంభిస్తుండడంతో నాల భద్రత చర్యలను జిహెచ్ ఎంసి 2022 నుంచి నివారణ చర్యలను మరింత ముమ్మరం చేసింది.జిహెచ్‌ఎంసి పరిధిలో1302 కిలో మీటర్ల పొడవు వరద కాల్వలు ఉండగా అందులో 390 కిలో మీటర్ల పొడవు గల మెజర్ నాలాలు, రెండు మీటర్ల పై బడిన కచ్చా నాలలైన్ 11,5 72 మీటర్ల, రెండు మీటర్ల లోపు గల 368.18 మీటర్ల వెడల్పుకాగా పైప్ డ్రైన్ 720.68 మీటర్ల కచ్చా, లైన్ పైప్ డ్రైన్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వర్షాలు సందర్భంలో గాని ఇతర సమయంలో అస్తి ప్రాణ, జంతు నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండేందుకు నాలా భద్రత చర్యలు ఎంతగానో ప్రయోజనం కలుగుతోందన్న ఈ ఉద్దేశ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 2024 సంవత్సరంలో కూడా నాల భద్రత చర్యలకు ఉపక్రమించింది .వరద నాలాలో కూడా అక్కడక్కడ వస్లరే బుల్ పాయింట్లను గుర్తిస్తున్నారు. గుర్తించిన పాయింట్ల లో ప్రమాదాలు సంభవించకుండా చుట్టూ మేష్ ఏర్పాటు చేసి ప్రమాద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి జోన్ లో గుర్తించిన ప్రమాద ఘటికల వద్ద భద్రత చర్యలు తీసుకుంటున్నారు. సర్కిళ్ల పరిధిలో ఉన్న నాలాల భద్రత చర్యల పర్యవేక్షణ బాధ్యతలను కిలో మీటర్ల వారిగా మెయింటనెన్స్ విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ అధికారులకు అప్పగించారు. ఆ అధికారి పరిధిలో ఏదైనా అనుకొని సంఘటన జరిగితే అతనే పూర్తి భాధ్యత వహించే విధంగా చర్యలు చేపట్టారు.అంతేకాకుండా వీరంతా నాలా భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు 203 నోడల్ అధికారులను జిహెచ్ ఎంసి నియమించింది. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలను చేయనున్నారు. పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

## జాబ్ క్యాలండర్ ప్రకటించి ఉద్యోగాలివ్వాలి



సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్

**ప్రజాపక్షం/యాచారం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలండర్ ప్రకటించి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తి చేయాలని సహకాసంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్ అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమే మాట్లాడుతూ యువతి యువకులకు కాంగ్రేస్ ప్రభుత్వం ఎన్నికల ముందు జాబ్ క్యాలండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.జాబ్ క్యాలండర్ ప్రకటించి అయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నిటికి నోటిపికేషన్ విడుదల చేయాలని అన్నారు. తక్షలాది మంది నిరుద్యోగుల భవిషత్తును దృష్టింలో ఉంచుకొని ఉద్యోగ నియామాలు తక్షణమే చేపట్టాలని కొరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా నిరుద్యోగ యువతను అదుకొవాలని అన్నారు.నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పారదర్శకంగానియామకాలు చేపట్టాలని అన్నారు. గ్రూప్ పోస్టులను పెంచి భర్తి చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యా సంస్థల్లో వివిధ కెటగిరిల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వలేదని అన్నారు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకొని దాదాపు నాలుగు నెలలు గడుస్తున్న వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వంస్పంధించిపోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల అక్రందనను అర్థం చేసుకొనిఅందరికిన్యాయం చేయాలని కొరారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లు పట్టవా?

నిరుద్యోగులకు నిరాశే మిగిలింది..

బిజెపి ఎంఎల్‌ఎ ఈటెల రాజేందర్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ జరుగుతుందని ఆశ పడ్డ నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని మల్కాజిగిరి బిజెపి ఎంఎల్‌ఏ ఈటెల రాజేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్లపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొని ఎంఎల్‌ఏ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వారి సమస్యల పై ఐదు సంవత్సరాలుగా నేను కూడా మీలాగే కొట్లాడుతున్నానన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ ప్రభుత్వాన్ని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల లాగా వీళ్ళ కుటుంబ సభ్యులకు ఏదైనా ఆరోగ్య పరమైన సమస్య వస్తే వీరికి కూడా హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఆటోమేటిక్ రెన్యువల్, పిఆర్‌సి ఎలా పెంచుతారో అదే పద్ధతిలో వీళ్ళకి ఇవ్వాలని ఈటెల డిమాండ్ చేశారు. అడ్డ మీద కూలీలకు 600 నుంచి 800 కూలి వస్తుందని, చదువుకున్న ఉద్యోగులకు మాత్రం 400 రూపాయలు వచ్చేవని దాన్ని సవరించాలని ఆ రోజు తాము ప్రయత్నం చేశామన్నారు. ఉద్యోగులకు ఏ చిన్న సమస్య వచ్చినా పెన్ డౌన్ లు, సమ్మెలు చేసే ఆస్కారం ఉంటుందని, కానీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌కి సమ్మెలు చేసే ఆస్కారం కూడా లేదన్నారు. ఎవరు కన్నెర్ర చేసిన ఉద్యోగం పోతుందనే భయంతో వాళ్లు జిమ్మెదారుతనంతో, బాధ్యతతో పని చేస్తారన్నారు. ఎన్ని సంవత్సరాలు గడిచినప్పటికీ ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగి జీవితంలో ఒక ఇల్లు కట్టుకోలేదని, పిల్లల చదువులకు లక్షల డొనేషన్ కట్టి చదివించే ఆస్కారం లేదన్నారు.

## సొంత ప్రయోజనాల కోసమే పార్టీ మార్పు

ప్రకాష్‌గౌడ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

తోకల శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిసొంత ప్రయోజనాలు,అస్తులను కాపాడుకునేందుకు పార్టీ మారారని ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని భారతీయ జనతాపార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటేస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం ఆయన కాటేదాన్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం అంటూఅధికార పార్టీలోకి మారటం ఎమ్మెల్యేకు పారిపాటిగా మారిందని ప్రకాష్ గౌడ్‌పై నిప్పులు చెరిగారు.8ఎళ్లు అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగిన ప్రకాష్ గౌడ్ నియోజవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు.గండిపేట్ మండలంలో మంచినీటి దాహార్తిని తీర్చేందుకు టిడిపి నుంచి టీఆర్ ఎస్‌లో చేరిన ఆయన ఏనాడు ఆదిశగా పని చేయలేదని తీవ్రంగా మండిపడ్డారు.ఇప్పుడు శంషాబాద్ మం డల రైతంగా సమస్యల పరిష్కరంకై కాం గ్రెస్ పార్టీలో చేరినట్లు తెలపటం హాస్యాస్పదంగా ఉందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మండల పరిధిలోని చిన్న గోల్కొండ సర్వే నెంబర్ 24లో 200 ఏకరాలు,పెద్ద గోల్కొండ సర్వే నెంబర్ 114 నుంచి 176 వరకు 185 ఏకరాల అసైన్డ్ ల్యాండ్‌ను రైతుల నుంచి తక్కు ధరకు కోనుగోలు చేశారని ఆయన ఆరోపించారు.అలాగే శంషాబాద్‌లో హెచ్‌ఎండిఏ స్థలంలో 50 ఏకరాల భూమిని కబ్జా చేశారని ఆయన విమర్శించారు. ఏయిర్ పోర్టు కాలనీలో 13ఏకరాల భూని కబ్జా చేశారన్నారు.ప్రకాష్ గౌడ్ కబ్జా చేసిన,తక్కువ ధరకు కొనుగోలు అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసుకోవటానకి అధికార పార్టీలో చేరారని మండిపడ్డారు. నియోజవకర్గాన్ని అభివృద్ధి చేసేందుకు చేతకాని ఎమ్మెల్యే నిధులు తేలేక కాలయాపన చేశారని విమర్శించారు.ఒక వేళ నిధులు వచ్చిన ఆ నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోలేని అసమర్ధ ఎమ్మెల్యే ప్రకాస్ గౌడ్ అని ఆయన ఎద్దేవా చేశారు.కష్టపడి పని చేసిన పాత కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రకాష్ గౌడ్ సరైన న్యాయం చేస్తారా?అని కాంగ్రెస్‌అధిష్టానాన్నిప్రశ్నించారు. ప్రకాష్ గౌడ్ వద్ద భూ కబ్జాలు,భూ మాఫియాలు చేసేనాయకులే అభివృద్ధి చెందుతారు తప్ప కార్యకర్తలకు న్యాయం జరగదన్నారు. ప్రకాస్ గౌడ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి పోటి చేయాలన్నారు.మైలార్‌దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, నాయకులు జోగి రవి,శీల తిరుపతి రెడ్డి, నరిసింహారెడ్డి,బుచ్చిరెడ్డి, శివ, శ్రీకాంత్‌రెడ్డి,రామకృష్ణ,వెంకట్‌రెడ్డి ఉన్నారు.

## గ్రూప్-2 పరీక్ష వాయిదాకు ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నిరుద్యోగుల నిరసనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు డీఎస్సీ, గ్రూప్1 అభ్యర్థులు పరీక్షల నిర్వహణ మార్పులు తమ గళం వినిపించగా, తాజాగా గ్రూప్2 పరీక్షలు వాయిదా వేయాలని కొందరు నిరుద్యోగులు హైదరాబాద్‌లో ఆందోళన నిర్వహించారు. చిక్కడపల్లి నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో బైఠాయించి నిరసన తెలియజేశారు. ఓ నిరుద్యోగి సొమ్మసిల్లి పడిపోయాడు. అభ్యర్థుల ఆందోళనతో ఆర్టీసీ క్రాస్ రోడ్డులో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తే నిరుద్యోగులు గ్రూప్ 2 లేదా గ్రూప్ 1కు మాత్రమే సిద్ధం కావాల్సి వస్తుందని, ఒక పరీక్ష కోల్పోవటం జరుగుతుందని వాపోయారు. గ్రూప్ 2, గ్రూప్ 3 షెడ్యూల్ ఒకే సమయానికి ఉండటం వల్ల అలాగే ఈ రెండింటి పోస్టులు పెంచాలని డిమాాండ చేశారు. గ్రూప్ 2 డిసెంబర్‌లో నిర్వహిస్తే గ్రూప్ 1 మెయిన్స్‌కు ప్రిపరేషన్‌కు టైమ్ ఉంటుందన్నారు. ఈ ధర్నాకు భారీస్థాయిలో నిరుద్యోగులు తమ నిరసన తెలిపారు.



## కెటిఆర్‌తో గద్వాల నాయకులు భేటీ

**ప్రజాపక్షం/మల్దకల్ :** హైదరాబాదులోని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ని వారి నివాసంలో గట్టు మండలం సర్పంచు సంఘాల మాజీ అధ్యక్షులు జిల్లా బిఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత గద్వాల నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ కష్టకాలల్లో పార్టీకి అండగా ఉన్నావారిని ఎవరిని బిఆర్ఎస్ పార్టీ మరువబోదని రానున్న ఎన్నికల్లో బీసీలకి అవకాశం ఇస్తామని ఈనెల 22వ తేదిన గద్వాలకు వస్తానని హామీ ఇచ్చినట్లు బాసు హనుమంతు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆంజనేయ గౌడ్, కుర్వ విజయ్‌కుమార్, మోనేష్, తిరుమల్, నూర్‌ఫాష, బాసు గోపాల్, ఎల్లందొడ్డి రాజు తదితరులు ఉన్నారు.

## కోర్టు ఏర్పాటు పట్ల హర్షం

### మక్తల్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/నర్వ :** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కేంద్రంలో జూనియర్ జడ్జి కోర్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు అయింది. ఈ కోర్టు ఏర్పాటుకు విశేషంగా కృషి చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కి ప్రత్యేక అభినందనలు స్థానిక అడ్వకేట్ బండారు శ్రీనివాస్ తెలియజేశారు. నర్వ మండలంలోని కక్షిదారులు ప్రస్తుతం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణ పేటకు వెల్లేటందుకు చాల ఇబ్బందికి గురి అయ్యేవారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో న్యాయ స్థానం ఏర్పాటు వల్ల మండల కక్షిదారులు ఇక ఎటువంటి వ్యయ ప్రయసాలకు గురి కారని స్థానిక న్యాయవాది బండాబు శ్రీనివాస్ అన్నారు.



## లక్ష్మి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

**ప్రజాపక్షం/మల్దకల్ :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆయన సతీమణి బండ్ల జ్యోతి పుట్టినరోజు సందర్భంగా కుమారుడు సాయి సాకేత్‌రెడ్డి సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వాదం అందజేసి స్వామి వారి శేష వస్త్రంతో ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు, మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రావు, వీరారెడ్డి, బాబురావు, పద్మారెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల ఆత్మీయ వీడ్కోలు

**ప్రజాపక్షం/మల్దకల్ :** గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదోన్నతులు పొందిన, బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సరిత ముఖ్య అతిథులుగా హాజరైనారు. బదిలీపై వేరే పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ స్వాగత సన్మాన కార్యక్రమంలో మాజీ జెడ్పిచైర్ పర్సన్ , కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఇంచార్జి సరితమ్మ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమేనని, పని చేసిన చోట మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసి ఉపాధ్యాయులు పాఠశాలను వీడి బదిలీపై వెళుతున్న సందర్భంగా వారికిదే ఆత్మీయ వీడ్కోలు పలకడం జరుగుతుందని సరితమ్మ కాదన్నారు. ఈ కార్యక్రమంలో ధరూర్ మండల మాజీ జడ్పిటిసి పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి పెద్ద గోపాల్ రెడ్డి, అలివేలమ్మ, అమరవాయి కృష్ణరెడ్డి, జడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరేశ్, మాజీ సర్పంచు పద్మమ్మ, ధోని ఆంజనేయులు, కుర్వ శ్రీనివాసులు తిమ్మయ్య, లక్ష్మ ణ్, సాగర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/అడ్డాకుల :** వనపర్తి నియోజకవర్గం అడ్డాకుల మండల తాసిల్దార్ కార్యాలయంలో శనివారం లబ్దిదారులకు వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. పెద్దమునగలషెడ్ చిన్న మునగల షెడ్ కన్మనూరు రగామాలకు సంబంధించిన 7 కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని పేదల పట్ల కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మదన్ మోహన్ గౌడ్, ఈసి రమేశ్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీహరి, గంగుల విజయ్ మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు శరత్‌రెడ్డి,ప్రవీణ్ కుమార్ రెడ్డి, అగ్గి రాములు, ప్రశాంత్, కరుణకర్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్లోక స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జడ్చర్ల శాఖ ఆధ్వర్యంలో శ్లోక స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ధర్నా నిర్వహించడం జరిగింది. విభాగ్ ఎస్ఎఫ్‌డి కన్వీనర్ మనీ మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యంపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, డిమాండు చేయడం జరిగింది. యంఈఓ మంజుల స్పందించి, శ్లోక స్కూల్ పై 50000 జరిమానా విధించడం అయింది. ఈ కార్యక్రమంలో పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్, శివ, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ వీరమోహన్, పాండు, చందు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌ను ప్రైవేటీకరిస్తే ఊరుకోం...

### కేంద్రంపై యుద్ధానికి సిద్ధం : ఎంపి మల్లు రవి

### ఉద్యోగులకు పదోన్నతుల తర్వాతే బదిలీలు చేపట్టాలి : 1104 యూనియన్ ప్రధానకార్యదర్శి సాయిబాబా వినతి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** విద్యుత్ సంస్థలను ప్రైవేటుకు అప్పగిస్తే ఊరుకోబోమని, కేంద్ర ప్రభుత్వంపై విద్యుత్ ఉద్యోగులు ఎలాంటి పోరాటాలు చేసినా అండగా నిలుస్తామని నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. దేశంలో గతంలో ఉన్న పరిస్థితులు లేవని, మణిపూర్ ఘటనపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడక పోతే రెండున్నర గంటలపాటు కాంగ్రెస్ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా మారినప్పుడే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని, అదే విధంగా యూనియన్లు కార్మికుల సమస్యలపై పోరాడితే వారే అండంగా నిలుస్తారన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ సంస్థలు మారవని ఏ ప్రభుత్వాలు వచ్చినా కార్మికులసమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా యూనియన్లు పనిచేయాలన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని 1104 సంస్థ ప్రధానకార్యాలయంలో డా. మల్లు రవికి ఆత్మీయ సన్మాన సభను నిర్వహించి నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ఛత్తీస్‌గడ్ విద్యుత్ ఒప్పందం, యాదాద్రి భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం విషయంలో కెసిఆర్‌కు పవర్ కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావిస్తూ గత పాలకులు ఇష్టానుసారంగా రాష్ట్రాన్ని దోచేయడం వల్లే ప్రజలు తమకు అధికారం కట్టబెట్టారన్నారు. యాదాద్రి భద్రాద్రి విద్యుత్ కేంద్రాలను ముందుకు తెస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రైవేటుకు వెళ్లకుండా ప్రభుత్వ రంగంలో సంస్థలున్నప్పుడే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని చెప్పారు. రైతులకు ఉచిత కరెంట్, గృహజ్యోతి లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను తమ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఎంపి మల్లు రవి అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటే ఎలాంటి విజయాలైన సాధించవచ్చన్నారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ డిమాండ్లను సీఎం, డిప్యూటీసీఎంల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేదిశగా ప్రయత్నిస్తామన్నారు. అనంతరం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి. సాయిబాబా మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతలు కల్పించిన తర్వాతే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్చిలోనే ఈ అంశాన్ని సిఈసీ మీటింగ్‌లో పెట్టినా, ఇప్పటివరకు విద్యుత్ యాజమాన్యం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని మల్లు రవి దృష్టికి తీసుకువచ్చారు. గత ఐదేళ్లుగా ప్రమోషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ మార్చి నుంచి ఉద్యోగుల పదవీ విరమణలు సంఖ్య పెరగడంతో విధుల్లో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. విద్యుత్ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధీర్, జి.వరప్రసాద్, ఆర్.జనారన్ రెడ్డి, టిజి ఎస్‌పిడిసిఎల్ అధ్యక్షుడు ఎ.వేణు. ఎన్‌పిడిసిఎల్ అధ్యక్షుడు రఘునందన్, ఎన్.వెంకన్న, ఎం. భాస్కర్ రెడ్డి, బాలకృష్ణ, దుర్గా ఆశోక్, రంగారావు, నాగార్జున సహా కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మల్లు రవితో వారు కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు.

# దేవాలయాల అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వెల్దండ :** కల్వకుర్తి నియోజకవర్గంలో ఉన్న దేవాలయాలకు మౌలిక వసతుల కల్పనకుతనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిఅన్నారు. శనివారం మండలపరిధిలోని గుండాల గ్రామంలో శ్రీఅంబరామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటిసభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లావంశీచంద్‌రెడ్డితో పాటు పొల్యూషన్‌బోర్డు సభ్యులు ఠాకూర్‌బాలాజిసింగ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఎంతో పురాతనమైన చరిత్ర కలిగిన ఆలయంగా ఉన్న గుండాల అంబరామలింగేశ్వర దేవాలయం ఎంతో ప్రసిద్ధిగాంచిందని , దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా దాతలు ముందుకువచ్చి ఆలయాన్ని మరింత అభివృద్ధిపరిచే విధంగా చూడాలని, దర్శనార్థం వచ్చే భక్తులకుకూడా మౌలిక వసతులు కల్పించే విధంగా దాతలనుండి సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు. ఎఐసిసి కార్యదర్శి, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజలకు అతిదగ్గరలో పాలన నడుస్తుందని ఈప్రాంతవాసి ముఖ్యమంత్రికావడం ఈప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. ఈసందర్భంగా దేవాలయ చరిత్రను మాజీసర్పంచ్ భూపతిరెడ్డివారికి వివరించారు. అనంతరం నూతనంగా దేవాలయ కమిటిచైర్మన్‌గా నియమితులైన మల్లేపల్లి సందీప్‌రెడ్డి, కమిటిసభ్యులు అరుణ్‌కుమార్, మల్లయ్య, వావిళ్లతిరుపతయ్య, ఎం.పద్మ, కొమ్ము అంజయ్య, శివకుమార్‌లకు శాలువాలు పూలమాలలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్‌రెడ్డి, తాలుకాకిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, సింగిల్‌విండోడైరెక్టర్లు మట్టవెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపిపి జయప్రకాష్, ఎర్రశ్రీనుముదిరాజ్, పుల్లయ్య, తక్కెళ్లపల్లిశేఖర్, ఆశాదీప్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, రాజుయాదవ్, ఆలీసాబ్, ఆలయ అర్చకులు శివ,సంతోష్, నరహరి,బాలస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.



### బాలికపై అత్యాచారం, హత్యచేసిన

## మైనర్ల దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పరిటాల మండలం ముచ్చుమర్రికి చెందిన ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ముగ్గురు మైనర్ నిందితుల దిష్టిబొమ్మను వనపర్తి జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌక్‌లో ఏఐఎస్ఎఫ్ , ఏఐవైఎఫ్, భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దహనం చేశారు. గల్లంతైన బాలిక శవాన్ని వెంటనే కనుగొనాలని, మైనర్లను కఠినంగా శిక్షించాలని, హోం మంత్రి వంగలపూడి అనిత నైతిక బాధ్యత వహించి రాజీనానా చేయాలని నినాదాలు చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్ , డివిజన్ కార్యదర్శి వంశీ, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ ఎత్తం మహేష్ మాట్లాడారు. జూలై ఏడవ తేదీన ముచ్చుమర్రిపార్కులో ఆడుకుంటున్న ఐదేళ్ల మైనర్ బాలికను గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్లు అపహరించి అత్యాచారం చేసి గొంతు నిలిమి చంపి కాలువలో పడవేశారన్నారు. నిందితులు విచారణలో అంగీకరించారన్నారు. వారం రోజులు కావస్తున్న బాలిక శవాన్ని కనుగొనలేదన్నారు. అధికార యంత్రాంగం గాలింపు వేగం పెంచి బాలిక మృతదేహాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే మహిళలపై పిల్లలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర హోం మంత్రి ఒక మహిళ ఉన్నప్పటికి బాలిక గుర్తింపులో తీవ్ర జాప్యం జరగటం దారుణమన్నారు. నైతిక బాధ్యత వహించి హోం మంత్రి వంగలపూడి అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు ఎత్తం విష్ణు, చంద్రశేఖర్ , ఏఐఎస్ఎఫ్ నాయకులు అరవింద్ , గణేష్ , చరణ్ , ఆశోక్ , బన్నీ, బాలు, శివ, మహిళా నాయకురాలు వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** జాతీయ పార్టీ పిలుపు మేరకు శనివారం వనపర్తి పట్టణంలోని 25 వార్డులో నాయకులు పట్టణ ప్రధాన కార్యదర్శి రాయన్న సాగర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణ అధ్యక్షులు బచ్చు రాం అధ్యక్షతన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అడవులు తరిగిపోతున్నాయని దీని వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ వర్షపాతం తగ్గుతున్న పక్షంలో మానవ జీవితమే అల్లకల్లోలం అయ్యే పరిస్థితి ఏర్పడే ప్రమాదం రాకుండా ఉండాలంటే ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని , ప్రతి ఒక్కరు మొక్క నాటాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీశైలం ప్రతి ఇంటికి చెట్లు ఇవ్వడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి, రామన్న, వెంకటేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుమిత్రమ్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శామ్యూల్ , పట్టణ నాయకులు చిలుక లక్ష్మీనారాయణ, కడమంచి శివ, జిల్లా ఐటి సెల్ కన్వీనర్ విజయ్‌కుమార్ సాగర్ , కార్యకర్తలు , కాలనీవాసులు చంద్రుడు, జమున, అలివేలమ్మ, ఆనంద్ కుమార్ , విజయ, నాగమణి, ఇతరులు కాలనీలో మొక్కలు నాటడం జరిగింది. వార్డు ప్రజలందరికి పర్యావరణం పై అవగాహన కల్పించడం జరిగింది.



### రోగులకు నాణ్యత, పోషక విలువలు గల

## ఆహారం అందించాలి : సిపిఐ

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** నాణ్యత, పోషక విలువలు గల ఆహారాన్ని రోగులకు అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ , గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రోగులకు పెడుతున్న భోజనం, కూరగాయాలు, స్టాకు చేసిన నిత్యవసర సరుకులను పరిశీలించారు. భోజనం పెడుతున్న ఏజెన్సీ నిర్వాహకులతో నాణ్యమైన భోజనం పెట్టాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ రోగులకు అన్నం, చపాతి మాత్రమే ఇస్తున్నారన్నారు. బలవర్ధకమైన బియ్యం, తాజా కూరగాయాలతో ఆహారం సిద్ధం చేసి పెట్టాలన్నారు. ప్రతి రోగికి 300 గ్రాముల అన్నం లేదా రెండు చపాతీలు మాత్రమే ఇస్తున్నారని తినగలిగినన్ని పెట్టాలన్నారు. ప్రస్తుతం వండుతున్న బియ్యం పోషక విలువలపై అనుమానం ఉందన్నారు. నిలువ చేసిన నిత్యవసర సరుకుల్లో ధనియాల పాకెట్లపై పెన్నుతో ఎమ్మార్పీ తేదీలు ఉన్నావే కొనాలన్నారు. ప్రతి రోజు తాజా కూరగాయాలను కొనాలన్నారు. ఆసుపత్రిల్లో రోగులకు పెట్టే అహారం తాజాగా , శుభ్రంగా ఉండాలని , వడ్డించే సిబ్బంది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు భోజనం ప్రతి రోజు తనిఖీ చేయాలని కోరారు. సరైన చర్యలు చేపట్టకుంటే సిపిఐ ఆధ్వర్యంలో రోగులు, వారి బంధువులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## గ్రామీణ క్రీడలపై దృష్టి నిలపాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** గ్రామీణ క్రీడలపైదృష్టిసారించి క్రీడాకారులను ప్రోత్సహించాలని తెలంగాణస్పోర్ట్స్ అథారిటిచైర్మన్ శివసేనారెడ్డిని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్‌రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి కోరారు. శనివారం గచ్చిబౌలిలోని బాలయోగిస్టేడియంలో ప్రమాణస్వీకారంచేసిన శివసేనారెడ్డిని అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోకూడా క్రీడాకారులు అనేకమంది ఉన్నారని వారి ఆసక్తిని గుర్తించి క్రీడాకారులకు ప్రోత్సహకాలు అందించాలని కోరారు.



## సాయిబాబాఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి

### మాజీ ఎంపి విహెచ్ హన్మంత్‌రావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అధికవడ్డీఆశచూపి మోసంచేసిన వ్యాపారి సాయిబాబాఫైనాన్స్‌పై రెవెన్యూ పోలీసు యంత్రాంగం సమన్వయంగా పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధితులకు న్యాయంచేయాలని మాజీ ఎంపి కాంగ్రెస్‌పార్టీనేత విహెచ్ హన్మంత్‌రావు డిమాండ్‌చేశారు. శనివారం ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పిని కలిసి మోసాలపై ఆయన వివరించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందలాదిమంది నుండి అధికవడ్డి ఆశచూపి వందలకోట్ల రూపాయలు వసూలుచేశారని ఆనిధులని ఏబినామిపై వ్యాపారాలు చేశారో పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలు తెలుసుకొని బాధితులకు న్యాయంచేయాలని కోరారు. ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన అనేకమంది భూనిర్వాసితులు ప్రభుత్వంద్వారా అందిన పరిహారంమొత్తాన్ని అతనివద్ద ఉంచి అతడుచేసిన మోసానికి ఏంచేయాలో అర్థంకాలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని అతనిబంధువుల ఆస్తులపై కూడా నిఘాఉంచి దోపిడి నియంత్రించాలని కోరారు. డ్రగ్స్‌మాఫియాకన్న అధికవడ్డీ ఆశచూపి డబ్బులు స్వాహాచేస్తున్న మాఫియా అధికంగా ఉందని ఏవిధంగా డ్రగ్స్ నియంత్రించామో అదేవిధంగా వీరినుండి బాధితులను కాపాడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

## రంగనాథ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :** మండలంలోని శ్రీ రంగనాథ స్వామి టెంపుల్‌లో తెలంగాణ రాష్ట్ర హై కోర్టు జడ్జి లక్ష్మీ నారాయణ అలిశెట్టి కుటుంబ సమేతంగా రంగన్న స్వామి ఆలయంలో పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయ పూజారులు విష్ణు నారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివాళ్లను ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆలయంలో పురాతనమైన చిత్రాలు , స్వామివారి వాహన సేవకు వాహనాలను తిలకించడం జరిగింది.

## శివసేనారెడ్డికి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఈ సందర్భంగా అఖిల పక్ష ఐక్య వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు సతీష్ యాదవ్ శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో వారి ఛాంబర్‌లో శివసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మనించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ , శివకుమార్ , నరేందర్ గౌడ్ , శివశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## పోస్టర్‌మేకింగ్ ప్రథమవిజేత జంగంశ్రావణి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** డైరెక్టర్ ఎన్జిసి, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆఫ్ హైదరాబాద్ ఆదేశాలమేరకు నేషనల్‌గ్రీన్‌కోర్ జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోయెట్రీ పోస్టర్‌మేకింగ్ నిర్వహించిన పోటిలలో మొదటిబహుమతిని పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్లగ్రామం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 9వతరగతి చదువుతున్న జంగంశ్రావణి గెలుపొందారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. జిల్లాకేంద్రంలో పోయేట్రి పోస్టర్‌మేకింగ్ పోటిలలో జిల్లాస్థాయినుంచి వందమంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా జిల్లాస్థాయిలో ప్రథమబహుమతి శ్రావణిసాధించడంపట్ల హర్షం వ్యక్తంచేశారు. మాజీఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, మాజీసర్పంచ్‌లు రాధాబాలస్వామి, పగిడాలచిన్నయ్యతోపాటు జంగంపెద్దరాజు, బాల్‌లింగాచారి, నాగేంద్రం, సుదర్శన్, వెన్నచర్ల గ్రామప్రజలు జంగంశ్రావణిని అభినందించారు.



## ఐక్యతఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం

**ప్రజాపక్షం/వెల్దండ :** ఐక్యతఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖకంటి వైద్య నిపుణులు శంకరనేత్రాలయ సంయుక్తంగా నిర్వహించే మెగాఉచితకంటి వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని ఐక్యతఫౌండేషన్‌చైర్మన్ ఎన్‌ఆర్ఐ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి శనివారం మండలకేంద్రంలోని ఐక్యతఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచితకంటి వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలందరూ ఈనెల 19నుండి 27వరకు పదిరోజులపాటు ప్రముఖకంటివైద్య నిపుణులు శంకరనేత్రాలయ వారిచే నిర్వహిస్తున్న కంటివైద్యశిబిరంలో ఉచిత కంటిపరీక్షలు నిర్వహించి కంటిశుక్లాలకు ఉచితంగా సర్జరీలు చేయబడుతుందని పేర్కొన్నారు. ఈకంటివైద్య శిబిరం వెల్దండ మండలకేంద్రంలోని ఎవిఆర్‌ఫంక్షన్‌హాల్‌నందు , వెల్దండ కల్వకుర్తిమెయిన్‌రోడ్డునందు నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ప్రజలందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యతఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డివరప్రసాద్‌రెడ్డి, యువజన కాంగ్రెస్‌అధ్యక్షులు అనిల్‌గౌడ్, బిసిసెల్ నాయకులు సైదులు, ఎస్సిసెల్ నాయకులు శేఖర్, యువజన కాంగ్రెస్ నాయకులు బాలరాజు, అంజి, మాజీసర్పంచ్ పంతుల, లక్ష్మ ణ్‌నాయక్, నరేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌నాయక్, వెంకట్‌రాం, యాదగిరి, జయంత్‌రెడ్డి, గణ్యానాయక్, నగేష్, నారాయణ, ఉపేందర్, మల్లేష్, వెంకటేష్, లక్ష్మ ణ్, శ్రీను, రఘు, రాజు, మల్లయ్య, కొండల్‌యాదవ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని చెరుకూరు గ్రామానికిచెందిన గౌడుగు చంద్రయ్య ఇటీవలే మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబాన్ని రాష్ట్రపుడ్ కమీషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్రపుడ్ కమీషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రయ్య కుమార్తెలు వాళ్లపైచదువులకొరకు తనవంతు సహాయ సహకారాలను అందించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆయనవెంట సింగిల్‌విండోడైరెక్టర్ నాగుల్‌నాయక్, మైసయ్య, యాదయ్య, మాజీ మార్కెట్‌డైరెక్టర్ సురమల్లసుభాష్, భీమరాజు, శ్రీను, భీమయ్య, యాదయ్య, మల్లయ్య, రామచంద్రయ్య, జంగయ్య, లాలయ్య, రమేష్ ఉన్నారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
హైదరాబాద్ | ఆదివారం | 14 జులై, 2024 | 11

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



**ప్రజాపక్షం/నాగారం:** కాలనీలలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తానని కౌన్సిలర్ పంగ హరి బాబు అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు సాయిసంజీవ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కౌన్సిలర్ ప్రారంభించారు. వార్డు పరిధిలోని కాలనీలలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు,విద్యుత్ సిబ్బంది,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తండాకు విద్యుత్ వెలుగులపై హర్షం



**ప్రజాపక్షం / కొడంగల్ :** విద్యుత్ వెలుగులపై తండా వాసులు హర్షం వ్యక్తం చేస్తు శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి భినందనలు తెలిపారు. కొడంగల్ మండల పరిధిలోని గ్రామపంచాయతీ పరిధిలోని మోత్కులబండతాండకు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో సింగిల్ ఫేస్ కరెంటు సరఫరాతో తాండ వాసులు నిత్యం అష్టకష్టలు పడుతు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యో వారని ఆ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిఎం రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తాండాలో నెలకొన్న సమస్యలపై వివరించడంతో వెంటనే స్పందించి తాండకు త్రిఫేస్ కరెంటుతో పాటు పలు సమస్యలను పరిష్కరించడం సంతోషకరమన్నారు.వీరితో పాటు తాండవాసులు గోపాల్ నాయక్, సామ్యనాయక్, నర్సయ్యనాయక్, సికింద్రనాయక్‌లతో పాటు తదితరులున్నారు.



## కాలనీల సంక్షేమానికి కృషి

### ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాలనీల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎస్ రావు నగర్ కాలనీ పరిధిలోని శ్రీ భావన ఋషి వెల్ఫేర్(పద్మశాలి టౌన్ షిప్) అసోసియేషన్ ఎన్నికల్లో బ్యాలట్ ద్వారా ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం నరేంద్రరెడ్డి, సుగుణేశ్వర్,సభ్యులు ఎంఎల్ఎను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కాలనీలో పారిశుద్ధ్య,స్ట్రీట్ లైట్లు సమస్యలు ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చి సమస్యలు పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, ప్రతినిధులు నవీన్‌గౌడ్, కళ్లెం రాము, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవిష్ణు శివాలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని అక్కన్నమాదన్నలు నిర్మించిన అతి పురాతణమైన శ్రీ విష్ణు శివాలయంలో శనివారం అన్నదానం చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని తరించారు. ఉద్దెమర్రి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శివుడికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీపతి పొన్నయ్య పుష్ప దంపతులు శ్రీ విష్ణు శివాలయంలో అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేసిన శ్రీపతి పొన్నయ్యకు ఆలయ కమిటి సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉమామహేశ్వరి, సభ్యులు రవీందర్‌గౌడ్, రాజిరెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

## అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక ఆర్టీసి బస్సు సౌకర్యం

### షాద్‌నగర్ డిపో మేనేజర్ ఎం.ఉషా

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్ళె భక్తులకు ప్రత్యేక ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఎం,ఉషా తెలిపారు. శనివారం షాద్‌నగర్ ఆర్టీసి బస్ డిపోలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఉషా మాట్లాడుతూ అరుణాచలం వెళ్ళె భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తూ సూపర్ లగ్జరీ ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. జూలై19వ తేదిన షాద్‌నగర్ ఆర్టీసి డిపో నుండి సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరి చిత్తూరు జిల్లాలోని కానిపాకం చేరుకుంటుందని వివరించారు. అక్కడి నుండి గోల్డెన్ టెంపుల్ మీదుగా జూలై21వ తేదిన అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. ఇందుకోసం పెద్దలకు రూ.3600, చిన్న పిల్లలకు రూ.2400 చార్జీలు కేటాయించడం జరిగిందని, మిగతా వివరాలు, బుకింగ్‌ల కోసం డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ సెల్ నంబర్లు 9959226287, 9182645281, 9490021433లను సంప్రదించాలని కోరారు.



## కమ్మరి కృష్ణను హత్యచేసింది కన్న కొడుకే

### రూ.16కోట్ల ఆస్తులను మూడోభార్య పేరిట చేశారనే అక్కసుతోనే..

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రియల్టర్ కమ్మరి కృష్ణను ఆస్తి కోసమే కన్న కొడుకే దారుణంగా గొంతుకోసి హత్య చేశాడని శంషాబాద్ డిసిపి రాజేష్ వివరించారు. శనివారం షాద్‌నగర్ ఏసిపి కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి రాజేష్ మాట్లాడుతూ రూ.16కోట్ల ఆస్తులను మూడో భార్య పేరిట రాశాడనే అక్కసుతోనే మొదటి భార్య కుమారుడు కమ్మరి కృష్ణను హత్య చేసేందుకు కుట్ర చేశారని తెలిపారు. అందులో భాగంగానే మృతుడిని అంగరక్షకుడిగా ఉన్న బాబా అలియస్ బాబా శివానంద్‌ను కమ్మరి శివ ఆశ్రయించాడు. రూ.25లక్షల నగదుతోపాటు ఒక ఇల్లు ఇస్తానని సుమారి మాట్లాడుకొని తిరిగి బాబాను మృతుడి వద్ద పనిలో చేరాడు. దాంతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామ సమీపంలో జూలై10వ తేదిన కెకె ఫామ్ హౌజ్‌లో కమ్మరి కృష్ణ (63) అనే రియల్టర్‌ను మొదటి భార్య కుమారుడు కమ్మరి శివతోపాటు మృతుడి అంగరక్షకుడు బాబా శివానంద్, జీలకర గణేష్, మరో 17ఏళ్ల బాలుడు ఈ హత్యలో పాల్గొన్నట్లు డిపిసి వివరించారు. ఆస్తి విషయంలోనే మృతుడితో మొదటి భార్య కుమారుడు ఘర్షన పడినట్లు తెలిపారు. ఆస్తి విషయంలో మృతుడు కమ్మరి కృష్ణను ఇలాగే వదిస్తే మొత్తం ఆస్తిని మూడోభార్య పావని పేరుపై రాసే అవకాశాలు ఉన్నాయని భావించిన కమ్మరి శివ ఎలాగైనా తండ్రి కమ్మరి కృష్ణను హత్య చేస్తే ఆస్తి మొత్తం తనకే వస్తుందని భావించారు.పథకం ప్రకారమే జూలై10వ తేదిన మృతుడు కమ్మధనం ఫామ్ హౌజ్‌కు మూడో భార్యతో వచ్చాడు.. ప్రధాన అంగరక్షకుడు బాబాతో మృతుడి పెద్ద కుమారుడు కమ్మరి శివ, గణేష్‌తోపాటు మరో బాలుడు కమ్మరి కృష్ణ చేతులు వెనక్కి పట్టుకోగా కమ్మరి శివ కత్తులతో దారుణంగా కోసి హత్య చేశారని డిసిపి రాజేష్ తెలిపారు. దాంతో అక్కడి నుండి ఆ నలుగురు పరారయ్యారని వివరించారు. మృతుడి భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అసలు విషయాలు బయటకు వచ్చాయని తెలిపారు. నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిసిపి రాజేష్ వివరించారు. 24గంటల్లోనే హత్య కేసును చేదించిన పోలీసులను డిసిపి రాజేష్ అభినంధించడంపాటు నగదు రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి, సిఐ విజయ్‌కుమార్, క్రైం సిఐ రాంరెడ్డి, సిఐ ప్రయోద్‌కుమార్, ఎస్ఐలు వరప్రసాద్, శరత్‌తోపాటు కానిస్టేబుళ్ల ఉన్నారు.



## రోహిత్‌రెడ్డి...తప్పుడు ఆరోపణలు మానుకో

### కుటుంబ పాలన గుర్చి నువ్వా మాట్లాడటం
### ఎంఎల్ఎ జోలికి వస్తే సహించేది లేదు
### తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ప్రజాపక్షం/తాండూరు:** ఎన్నికల తరువాత చుట్టపు చూపుగా నియోజకవర్గానికి వచ్చి నిరాధారమైన ఆరోపణలు చేయడం మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి మానుకోవాలని తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. శనివారం తాండూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పైలెట్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాండూరులో ఇసుక మాఫియ, సుద్ద మాఫియగా మారిందని తప్పుడు ఆరోపణలు మానుకో రోహిత్‌రెడ్డి అంటు సూచించారు.మీరు చేసిన ఆరోపణలకు బహిరంగా చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎంఎల్ఎ కుటుంబ పాలన గుర్చి మాట్లాడుతున్న పైలెట్ రోహిత్‌రెడ్డి మీ పక్కనే మీడియా సమావేశంలో కూర్చోన్నది మీ బాబాయ్ కదా? మీరా కుటుంబ పాలన గుర్చి మాట్లాడేది. మీపై వ్యక్తిగత విమర్శలు చేయడం మా పార్టీ సిద్దాంతం కాదని, మీ అమ్మ జడ్పీటిసిగా ఐదు సంవత్సరాలు పని చేసిన విషయం మర్చిపోయ్యారా? ఇది కుటుంబ పాలన కదా అని ప్రశ్నించారు. ఎంఎల్ఎ జోలికి వస్తే ఊరు కుండేది లేదని హెచ్చరించారు. బషీరాబాద్ మండలంలో జూనియర్ కళాశాల మంజూరు అయితే టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టుల భర్తి ఎందు కాలేదని, కేవలం కాగితాలకే పరిమితమైన కళాశాల విషయంలో ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి స్వయంగా విద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రేటరి మాట్లాడి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల మంజూరు కృషి చేశారని గుర్తు చేశారు. చిలుక వాగు ఎవ్వరి హయంల కబ్జాకు గురైందనేది తాండూరు పట్టణ ప్రజలకు తెలుసునని అన్నారు. మీరు ఎంఎల్ఎగా ఉన్నప్పుడు చేసిన పాపాలను సరిదిద్దే పనిలో మా ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి బిజిగా ఉన్నారని గుర్తు చేశారు. మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, టౌన్ ప్రసిడెంట్ హబీబ్‌లాల, కౌన్సిలర్‌లు ప్రభాకర్ గౌడ్, రాము, విజయదేవి, బొంబిన, పిఎసిఎస్ చైర్మన్ రవిగౌడ్, వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఉత్తమ్‌చంద్, మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శోభ రాణి, ఎబ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మాజీ జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



## రేపు షాదిఖాన ముందు ధర్నా, రాస్తారోకో

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ పట్టణంలోని షాదిఖాన శిథిల్యావస్థకు చేరడంతో ఎవ్వరు పట్టింపకోకపోవడంపై రేపు ఎంఐఎం పార్టీ ఆద్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించడం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్‌బి గుల్షన్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఎంఎల్ఏగా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి అరచేతిలో స్వర్గన్ని చూపించినట్లు చూపించి ఎలాంటి పనులు చేపట్టలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఇక్కడి ఎంఎల్ఏగా ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన కూడా ముస్లీంలకు సంబందించిన షాదిఖానాను పట్టించుకోవం లేదని ఆరోపించారు. కడను ఏర్పాటుచేసి నియోజకవర్గ అభివృద్ధికి వేల కోట్లు కేటాయించిన సిఎం మైనార్టీ వర్గానికి ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. అందుకు రేపు షాదిఖానా ముందు ముస్లీం మైనార్టీల సమక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు, తదితరులున్నా రు.

## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకి విద్యార్థులు

### భవన్స్ కాలేజీ ప్రిన్సిపాల్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలను అందుకోవాలాని భవన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జిఎస్‌విఆర్‌కె చౌదరి సూచించారు. విద్యార్థులుగా ఉన్నప్పుడే తమ లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని చేరుకొనేందుకు పోటీ పడాల్సి ఉంటుందని, పోటీ ప్రపంచంలో ఇష్టపడి చదివితే సాధ్యం కానిది లేదని ఆయన అన్నారు. కళాశాలలో శనివారం "ప్రజ్వాలితే" పేరిట జరిగిన ఫ్రెషర్స్ దే కార్యక్రమాదనికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని 20242025 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడు వెలిగే రత్నాలుగా ఉండాలన్న లక్ష్యంతోనే ఫ్రెషర్ డే కార్యక్రమానికి ప్రజ్వాలితే అన్న పేరుతో ప్రతి ఏటా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకొనగా వీటిలో ప్రతిభ కనపరచిన వారినికి బెస్ట్ ఫర్మారెన్స్ పేరిట బహుమతులను అందించారు. కళాశాల కోఆర్డినేటర్ దివ్య రేఖ, నిర్వాహకులు కమలా దేవి అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## విద్యుత్ పథకానికి అబ్దిదారులు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా గతంలో ప్రజాపాలనలో దరఖస్తు చేసుకోని ఆర్హత ఉండి గృహజ్యోతి 200 యూనిట్ల లోపు విద్యుత్ పథకం అందని అబ్దిదారులు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జోన్ తెలిపారు. లబ్దిదారులు ఇల్లు మారినప్పుడు ,విద్యుత్ మీటర్ యూనిట్ సర్వీస్ నంబర్ అనుసంధానంలో లోపాల వల్ల ప్రయోజనాలు పోందలేని వారు వివరాలు సవరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అయాన తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు ఏవైన తప్పులు దొర్లినట్లు అయితే మండల కేంద్రంలోని ఎంపీడిఓ కార్యాలయంలో ,మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరగింది అని అయన తెలిపారు. ఆర్హులందరీకీ సంక్షేమ పథకలను అందాలనే లక్ష్యంతో వివిధ పథకాలకు ప్రజాపలన పథకాల ద్వారా లబ్ది పొందెందుకు వీలుగా తప్పులు సరి చేసేందుకు ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. గృహజ్యోతి , గ్యాస్ ,విద్యుత్‌బిల్లు , ప్రభుత్వం నేర్దేశించిన విధంగా అందనట్లు అయితే రేషన్ కార్డులు దారులు ప్రజాపాలన లో దరకాస్తుచేసుకున్న రసీదు తో పాటు ప్రజాపాలన కేంద్రాల వద్దకు వేల్లి ఫలితలను పొందలని అన్నారు.

## బోర్‌లోకి రసాయనాలు వదులుతున్న వారిపై చర్యలు

### పారిశ్రామికవాడ ఫేస్1,బిఎన్‌రెడ్డి కాలనీలో రసాయనలతో కూడిన నీరు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్1,బిఎన్‌రెడ్డి నగర్ కాలనీలో భూగర్భ జలాలు పూర్తిగా వ్యర్ధ పారిశ్రామిక రసాయన జలాలుగా విషపూరితంగా వాడుకోలేని పరిస్థితి నెలకొందని ప్రముఖ పారిశ్రామివేత్త జక్క రోషిరెడ్డి అన్నారు. శనివారం చర్లపల్లి జిఎన్‌రెడ్డి నగర్ కాలనీలో ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఇటీవల చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్1లో తాను కొనుగోలు చేసిన స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు బోర్ వేయడంతో అందులో నుండి పూర్తిగా రసాయన వ్యర్ధ జలాలు వచ్చాయని నీటిలో తెల్లటి నురగతో పాటు దర్వాసన వస్తుందని తెలిపారు.నీటిని నిర్మాణా లకు వాడుకోలేని స్థితిలో ఉందని, బిఎన్‌రెడ్డి కాలనీలో కనీస అవసరాలకు నీటిని వాడుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని వారు అన్నారు.పరిశ్రమల నుండి వస్తున్న వ్యర్ధ రసాయన జలాలు నిబంధనల ప్రకారం వ్యర్ధ రసాయనాల నిర్వీర్యం చేయాల్సిన సెంటర్‌కు పంపాలి.ఖర్చుతో కుడుకున్న ఈ విధానాన్ని వాడకుండా చర్లపల్లి పారిశ్రామిక వాడల ఫేస్1లో కొందరు పారిశ్రామికవేత్తలు పరిశ్రమలోనే బోర్ వేసి భూగర్భంలోకి విష జలాలను పంపిస్తున్నారని దీంతో స్వచ్ఛమైన భూగర్భ జలాలను పూర్తిగా విషపూరితంగా మార్చు తున్నారని ఆయన తెలిపారు.ఈ విషయంలో పోల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేస్తామన్నారు.నీటిని విషపూరితంగా మార్చుతున్నవారిపై వెంటనే చర్యలు తీసుకుని భూగర్భ జలాల స్వచ్ఛతను కాపాడాలని కంచెర్ల రాజు,కాలనీవాసులు తదితరులు కూడా కోరారు.





## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతా లు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కష్టజీవులైన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ షాద్‌నగర్ పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే లేబర్ అధికారులు గానీ, ఫ్యాక్టరీ అధికారులు కానీ చూసి చూడనట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో సౌత్ గ్లాస్ పరిశ్రమలో ప్రమాదం చోటు చేసుకొని ఐదు మంది కార్మికులు అక్కడికక్కడే మృత్యువాత పడితే పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. అదే విధంగా నాట్కో పరిశ్రమలో కార్మికుడు మరణిస్తే అధికారులు అటువైపు చూసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా కొందుర్గు మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పరమేశ్వర క్రషర్ పరిశ్రమలో కార్మికులు మరణిస్తే సైతం అధికారులు ఘటన స్థలానికి వెళ్ళిన దాఖలాలు లేవని మండిపడ్డారు. పరిశ్రమ యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కు కావడంతో పరిశ్రమలను ఒక్కసారి కూడా సందర్శించడం లేదని వాపోయారు. జీవనోపాధి కోసం వచ్చిన కార్మికులు యాజమాన్యాల నిర్లక్ష్యంతో వారి ప్రాణాలు గాలిలో కలిసి పోతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ప్రమాదాలపై ఏఐటియుసిని బలోపేతం చేసి కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామిని, ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యదర్శులు వనంపల్లి జైపాల్‌రెడ్డి, కె.చంద్ర యాదవులను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన టి.నర్సింహ్మారెడ్డి, ఎం.శ్రీనునాయక్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎండి షకీల్, ఏఐటియుసి నాయకుడు చంద్రబాబు, శేఖర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎం.పవన్ చౌహాన్, ఆకాష్, రాహుల్, సాయికుమార్, మంజుల, రాజు, శంకర్‌లు ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత

### 19మంది విద్యార్థులు ఆసుపత్రిపాలు
### కందనెల్లి తండా పాఠశాలలో ఘటన



**ప్రజాపక్షం/తాండూరు:** మధ్యాహ్న భోజన వికటించి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి తాండ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్న భోజనం చేసిన విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైనారు. ఇది గమనించిన ఉపాధ్యాయులు గుట్టుచప్పుడు కాకుండా 19మంది విద్యార్థులను తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అందులో ఐదు మంది విద్యార్థుల పరిస్థితి కాస్త అస్తవ్యస్తంగా ఉండగా మిగిత విద్యార్థులు 14మంది చికిత్స అనంతరం ఇంటికి వెళ్ళి పోయ్యారు. పరిక్షించిన వైద్యులు మాత్రం కల్తి ఆహారం తినడం ద్వారానే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. విద్యార్థులకు కలుషిత ఆహారం పెట్టడం పట్ల తల్లిదండ్రులు తీవ్రంగా మండిపడుతున్నారు.



**పాఠశాలను సందర్శించిన హ్యూమమన్ రైట్స్ ప్రతినిధులు**

కందనెల్లి ప్రాథమిక పాఠశాలను సమైఖ్య హూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ సెక్రేటరి వీరేశం, తెలంగాణ స్టేట్ యూత్ వింగ్ చైర్మన్ సిద్దార్థరెడ్డి సందర్శించారు. శనివారం పాఠశాలను సందర్శించిన వీరు పాఠశాలలో మధ్యాహ్న భోజన తిన్న విద్యార్థులు అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

అదే విధంగా తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరమార్శించడంతో పాటు వారి నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ విధుల్లో ఉన్న డాక్టర్ మాట్లడిన వారు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు. అక్కడి నుండి జిల్లా ఆసుపత్రి పక్కనే ఉన్న బిసి, ఎస్సీ వెల్పేర్ హాస్టల్‌ను సందర్శించారు. వారి వెంట జిల్లా కార్యదర్శి సునీల్, తాండూరు మండల చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

## ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/షాబాద్ :** ప్యాన్ కు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. షాబాద్ సి ఐ కాంతా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల పరిధిలోని కొమరబండ గ్రామానికి చెందిన సిద్దపూరం రమేష్ (24) ఇతను శంషాబాద్‌లో కారు డ్రైవింగ్ చేస్తు జీవనం సాగించేవాడు గత మూడు రోజుల క్రితం తన సొంత స్వ గ్రామమైన కొమరబండ గ్రామానికి ఇంటికి వచ్చాడు. శ్రుకవారం సాయంత్రం ఇంట్లో ఇవ్వరు లేని సమయంలో ఇంటి తలుపులు పెట్టుకొని ఇంటి పై కప్పు ప్యాన్‌కు నైలాన్ వైరుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు సంబందించిన వివరాలు తెలియరాలేవు మృత్యుని తండ్రి సిద్దపూరం నర్సింలు ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**ప్రజాపక్షం/ఘట్కేసర్ :** శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు చిన్న అధ్యక్షతన ఘట్కేసర్ మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగ ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ లో ఉన్న 8 వేల కోట్లపైచిలుకు స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుదల చేయక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ కోర్సులు పూర్తి అయిన కూడా వారి ధ్రువపత్రాలు కళాశాల యాజమాన్యాలు ఇవ్వకపోవడంతో పై చదువులకు వెళ్లలేక, లేక ఉద్యోగాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఒక పక్క కళాశాలల యాజమాన్యాలను సంప్రదిస్తే వారు అనేక ఇబ్బందులతో వడ్డీలు, అప్పులు తెచ్చి సిబ్బంది జీతాలు ఇస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య చాల తీవ్రంగా ఉన్నది కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలియాజేయడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, ఘట్కేసర్ మండల అధ్యక్షుడు అజయ్, కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షులు ప్రశాంత్, సహాయ కార్యదర్శి సిద్దార్థ్, కోశాధికారి శ్రీరామ్, శ్రీకాంత్, ఆకాష్, వెంకట్ , రాము తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

# నాలుగో టీ20లో భారత్ ఘన విజయం



### సిరీస్ కైవసం

**హరారె:** సీనియర్ ఆటగాళ్లు లేకుండా జింబాబ్వే పర్యటనకు వెళ్లిన యువ భారత్ అదరగొట్టింది. జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 3–1 తేడాతో కైవసం చేసుకుంది. శనివారం జరిగిన నాలుగో టీ20లో టీమ్ఇండియా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే.. భారత్‌కు 153 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ టార్గెట్‌ని టీమ్ఇండియా వికెట్ నష్టపోకుండా ఛేదించింది. యశస్వి జైస్వాల్ (93*; 53 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (58*; 39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) చితకొట్టారు. నామమాత్రపు ఆఖరి (ఐదో) టీ20 ఆదివారం జరగనుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. ఓపెనర్లు మధెవర్ (25), మరుమాని (32) ఫర్వాలేదనిపించగా.. కెప్టెన్ సికిందర్ రజా (46; 28 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. బ్రియాన్ బెనెట్ (9), జొనాథన్ క్యాంప్‌బెల్ (3), డియోన్ మేయర్స్ (12), మండాడే (7) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. భారత బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 2, సుందర్, శివమ్ దూబె, అభిషేక్ శర్మ, తుషార్ దేశ్‌పాండే తలో వికెట్ పడగొట్టారు.

## భారత్-పాక్ మ్యాచ్..

# స్టేడియంలోకి అభిమానులకు ఫ్రీ ఎంట్రీ



**కొలంబో :** మహిళల ఆసియా కప్ తొమ్మిదో ఎడిషన్ ఈనెల 19 నుంచి ప్రారంభంకానుంది. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే ఈ టోర్నీకి శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. సెమీ ఫైనల్స్, ఫైనల్‌తో కలిపి మొత్తం 15 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. జులై 28న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే బిసిసిఐ భారత జట్టును ప్రకటించింది. జులై 19న చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ ఢీకొననున్నాయి. ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీలంక క్రికెట్ బోర్డు అభిమానులకు అదిరిపోయే శుభవార్త చెప్పింది. టోర్నీలో అన్ని మ్యాచ్‌లకు అభిమానులకు ఫ్రీ ఎంట్రీ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. మహిళల క్రికెట్‌కు ఆదరణ పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని శ్రీలంక క్రికెట్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఆసియా కప్ టోర్నమెంట్ డైరెక్టర్ రవిన్ విక్రమరత్నె పేర్కొన్నారు. ఉచిత ప్రవేశం కల్పించడంతో భారత్– పాక్ మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తే అవకాశముంది. ఈ ఆసియా కప్‌లో ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఎలో భారత్, పాకిస్థాన్, నేపాల్, యూఏఈ ఉండగా.. గ్రూప్ బిలో బంగ్లాదేశ్, శ్రీలంక, మలేసియా, థాయ్‌లాండ ఉన్నాయి. ప్రతి గ్రూప్‌లో టాప్2లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్స్‌లో తలపడతాయి. అన్ని మ్యాచ్‌లు దంబుల్లాలో జరగనున్నాయి. టీమ్ఇండియా మిగతా మ్యాచ్‌ల విషయానికొస్తే జులై 21న యుఎఇతో, 23న నేపాల్‌తో తలపడనుంది. ఈ టోర్నీ కోసం బిసిసిఐ 15 మంది సభ్యులతో భారత జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. నలుగురిని ట్రావెలింగ్ రిజర్వ్‌లుగా ఎంపిక చేసింది.

**భారత్ ఆసియా కప్ జట్టు:**
హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), ఉమా ఛెత్రీ (వికెట్ కీపర్), పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, దయాళన్ హేమలత, ఆశా శోభన , రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, సజన సజీవన్.

# వింబుల్డన్ మహిళల సింగిల్స్ విజేతగా క్రెజికోవా



**వింబుల్డన్ :** సంచలనాలకు వేదికగా.. అనూహ్య ఫలితాలతో సాగిన వింబుల్డన్ మహిళల సింగిల్స్ కొత్త ఛాంపియన్‌గా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) అవతరించింది. ఫైనల్ మ్యాచ్‌లో పావోలిని (ఇటలీ)పై 6–2, 2–6, 6–4 తేడాతో విజయం సాధించింది. గంట 56 నిమిషాల పాటు ఈ పోరులో తొలి సెట్‌లో క్రెజికోవా ఆరంభం నుంచి దూకుడు కొనసాగించి ఆధిక్యంలో నిలిచింది. రెండో సెట్‌లో మాత్రం పావోలిని దూకుడు ప్రదర్శించింది. అత్యుత్తమ ఆటతీరుతో సెట్‌ను సొంతం చేసుకుంది. మూడో సెట్ హోరాహోరీగా సాగింది. చివరకు చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి విజయం సాధించి వింబుల్డన్ కొత్త రాణిగా నిలిచింది. వింబుల్డన్ ఫైనల్ చేరడం క్రెజికోవా, పావోలినికి ఇదే తొలి సారి. తాజా విజయంతో క్రెజికోవా రెండో గ్రాండ్‌స్లామ్ సొంతం చేసుకుంది. 2021 ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ క్రెజికోవా విజేతగా నిలిచింది. 2016లో సెరెనా విలియమ్స్ టైటిల్ గెలిచిన తర్వాత జరిగిన ప్రతి వింబుల్డన్‌లోనూ మహిళల సింగిల్స్‌లో కొత్త ఛాంపియన్ పుట్టుకొచ్చారు. ఈ సారి కూడా అదే ఆనవాయితీ కొనసాగింది.

## లీల

## మ్యూజిక్ పనుల్లో బిజీగా

# విశ్వంభర




మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్‌గా యంగ్ దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న అవైటెడ్ భారీ చిత్రం విశ్వంభర కోసం అందరికీ తెలిసిందే. మరి ఇంట్రెస్టింగ్ ఫాంటసీ డ్రామాగా తెరకెక్కిస్తుండగా మెగా అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ చిత్రం షూటింగ్ సహా పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా పూర్తి చేస్తుండగా ఇపుడు మేకర్స్ మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని అందించారు. ప్రస్తుతం సినిమా మ్యూజికల్ యూనిట్ మ్యూజిక్ సిట్టింగ్స్ లో ఉన్నట్టుగా తెలిపారు. చిరు సంగీత దర్శకుడు కీరవాణి సహా దర్శకుడు వశిష్ట ఇంకా సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తదితరులు బెంగళూరుకు ఈ మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం వెళ్లినట్టుగా తెలిపారు. మరి గత కొన్ని రోజులు కితమే చిరు తమ ఆపద్బాంధవుడు తరహాలో సాంగ్స్ కంపోజ్ చేస్తున్నామని తెలిపారు. ఇక విశ్వంభర మ్యూజిక్ ఆల్బమ్ ఎలా ఉంటుందో వేచి చూడాలి. ఇక ఈ భారీ సినిమాని యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తుండగా వచ్చే ఏడాది జనవరి 10న సంక్రాంతి కానుకగా రిలీజ్ కి రాబోతోంది.

## ఓజిపై క్రేజీ అప్డేట్ ఇచ్చిన ఇమ్రాన్ హష్మీ




టాలీవుడ్ పవర్ స్టార్ అలాగే ప్రస్తుత ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం ఓజి కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమాపై ఎనలేని హైప్ అభిమానుల్లో నెలకొంది. అయితే ఈ చిత్రం కోసం ఎప్పుడు నుంచో ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ సినిమా ఇంకా కొంచెం బ్యాలన్స్ ఉండిపోయింది మరి ఈ సినిమాపై ఈ సినిమా విలన్ బాలీవుడ్ ప్రముఖ నటుడు ఇమ్రాన్ హష్మీ లేటెస్ట్ కామెంట్స్ మంచి వైరల్‌గా మారాయి.ఈ సినిమా రిలీజ్ ని సెప్టెంబర్ కి ప్లాన్ చేశామని కానీ ఇప్పుడు నిర్మాతలు కొత్త డేట్ కోసం చూస్తున్నారు అని చెప్పాడు. అలాగే సినిమాలో నాపై పవన్ కళ్యాణ్ పై వేరే వేరేగా సీన్స్ ఇప్పటి వరకు పూర్తయ్యాయి కానీ ఇంకా తమ మధ్య కాంబినేషన్ సీన్స్ ఇంకా చేయాల్సి ఉందని అవి క్రేజీ లెవెల్లో ఉంటాయని ఇమ్రాన్ తెలిపాడు. దీనితో ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి. ఇక ఈ చిత్రంలో శ్రేయ రెడ్డి, అర్జున్ దాస్ తదితరులు నటిస్తుండగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## టాక్సిక్‌కి యష్ కొత్త లుక్ లీక్.!

కన్నడ స్టార్ హీరో యష్ కూడా ఇప్పుడు తన భారీ చిత్రాలు కేజీయఫ్ ఫ్రాంచైజ్ తో పాన్ ఇండియా లెవెల్లో భారీ క్రేజ్ ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఇలాంటి భారీ సినిమాల తర్వాత వాటికి మ్యాచ్ అయ్యే విధంగా ఎలాంటి సినిమా చేస్తాడు అనే సమయంలో అనౌన్స్ చేసిన మరో భారీ చిత్రమే టాక్సిక్. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తో అనౌన్స్ చేసిన ఈ చిత్రం మంచి అంచనాలు అందుకుంది. అయితే ఈ చిత్రం షూటింగ్ కూడా ఈ మధ్య మొదలయ్యింది కానీ ఈ సినిమాకి యష్ లుక్ ఏంటి అనేవి ఏవి బయటకి రాలేదు. కానీ ఇప్పుడు యష్ సరికొత్త మేకోవర్ లీక్ అయ్యి వైరల్ గా మారింది. బయట యష్ కనిపించగా ప్రేక్షకులు తన కొత్త లుక్స్ క్లిక్ మనిపించారు. దీనితో సోషల్ మీడియాలో తన కొత్త లుక్ వైరల్‌గా మారింది. మరి అదే గడ్డంలో కాకపోతే ఈసారి కొత్త హెయిర్ స్టైల్ ని యష్ డిజైన్ చేయించుకున్నాడు. మరి ఇందులో తాను సూపర్ స్టైలిష్ గా కనిపిస్తుండగా టాక్సిక్ కి ఇదే లుక్ అంటూ ఇపుడు సోషల్ మీడియాలో అభిమానులు సందడి చేస్తున్నారు.



## నాని ‘సరిపోదా శనివారం’ నుంచి బ్యూటిఫుల్ అప్డేట్.!




రెండు వరుస సాలిడ్ హిట్స్ తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న అవైటెడ్ మూడో సినిమానే సరిపోదా శనివారం. మరి దర్శకుడు వివేక్ ఆత్రేయ తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ అకేషన్ డ్రామాలో ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా వెర్సటైల్ నటుడు దర్శకుడు ఎస్ జే సూర్య విలన్ గా నటిస్తున్నారు. అయితే ఈ సినిమా నుంచి ఇపుడు వరుస అప్డేట్స్ వస్తున్నా సంగతి తెలిసిందే. మరి అలా ఇప్పుడు కూడా మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని మేకర్స్ రివీల్ చేశారు.మరి దీనితో మేకర్స్ ఉల్లాసం సాంగ్ ప్రోమోని రిలీజ్ చేసారు. ఇందులో నాని, ప్రియాంక మోహన్ ల నడుమ మంచి సీన్స్ కనిపిస్తుండగా జేక్స్ బిజోయ్ మ్యూజిక్ మంచి బీట్స్ ని అందించాడు. ఇక దీనితో ఈ సాంగ్ ఈ సాయంత్రం 6 గంటల 3 నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్టుగా ఫిక్స్ చేశారు. మరి ఈ ఫుల్ సాంగ్ ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహిస్తుండగా ఈ ఈ ఆగుస్ట్ 29న సినిమా పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కాబోతుంది.

## సోనియాగాంధీతో హేమంత్ భేటీ



**న్యూఢిల్లీ :** జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శనివారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియాగాంధీతో భేటీ అయ్యారు. సోరెన్ జైలు నుంచి తిరిగి వచ్చిన తరువాత మరోసారి సిఎంగా ప్రమాణం స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన సతీమణి హేమంత్ కల్పనతో కలిసి 10 జనపథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో ఆమెతో సమావేశమయ్యారు. అనంతరం హేమంత్ మీడియాతో మాట్లాడుతూ తాను సోనియాగాంధీని కేవలం మర్యాదపూర్వకంగానే కలిశానన్నారు. తాను జైలు నుంచి తరువాత, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తరువాత ఇప్పటి వరకు భేటీ కాలేదని, అందువల్లే ఇప్పుడు సమావేశమైనట్లు ఆయన వెల్లడించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై చర్చించారా అని మీడియా ప్రశ్నించగా అలాంటిదేమీ లేదన్నారు. భారతీయులు చాలా సున్నిత మనస్తత్వం గలవారని, చాలా సహనంతో ఉంటారని, వారి సహనం నశిస్తే ఓటు ద్వారా జవాబు చెబుతారన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా త్వరలో బెయిల్ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మణిలాండరింగ్ కేసులో ఇడి అరెస్టు చేయడానికి ముందు జనవరి 31వ తేదీన హేమంత్ సోరెన్ సిఎం పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఆ తరువాత దాదాపు ఐదు నెలల పాటు జైలు ఉండగా, బెయిల్ లభించింది. దీంతో ఈనెల 4వ తేదీన మరోసారి ఆయన సిఎంగా ప్రమాణ స్వీకారం చేశారు.

## దిగిరానున్న టొమాటో ధరలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో టొమాటో రిటైల్ ధర కిలోకు రూ. 75కు ఎకబాకింది. అయితే దక్షిణాది రాష్ట్రాల నుంచి సరఫరా పెరుగుతుండడంతో త్వరలోనే ఆ ధర దిగిరానున్నట్లు ప్రభుత్వ అధికారులు చెప్పారు. ఇటీవల సరఫరాలో అంతరాయం కలగడంతో టొమాటో, ఆలుగడ్డ ధరలు పెరిగగా, త్వరలోనే తటస్థం కానున్నాయని అధికారులు తెలిపారు. ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో టొమాటో, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ ధరలు తారాస్థాయికి చేరాయన్నారు. కొన్ని చోట్ల తీవ్ర వేడి, అలాగే మరికొన్ని చోట్ల అధిక వర్షపాతం కారణంగా పంట సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ మీడియాకు వెల్లడించింది. ఢిల్లీలో కిలో టొమాటో ధర రూ. 75గా ఉండగా, సరఫరా చైన్‌లో భారీ వర్షాలు అంతరాయం కలిగించకుండా ఉంటే త్వరలోనే ధర దిగివస్తుందని ఓ అధికారి పేర్కొన్నారు. మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం..ఈనెల12వ తేదీ నాటికి ఢిల్లీలో కిలోటొమాటో ధర రూ.75, ముంబయిలో రూ. 83, కోల్‌కతాలో రూ. 80గా ఉంది. దేశంలో సగటు టొమాటో రిటైల్ ధర రూ. 65.21గా ఉంది. గత ఏడాది ఇదే కాలంలో రూ. 53.36గా ఉంది. కాగా, ప్రస్తుతం ఢిల్లీకి హిమాచల్, ఉత్తరాఖండ్ నుంచి టొమాటో దిగుమతి అవుతోంది. అయితే ఆంధ్రప్రదేశ్, కర్నాటక నుంచి దేశ రాజధానికి హైబ్రిడ్ టొమాటో చేరితే ధరలు తగ్గనున్నాయని ఆ అధికారి తెలిపారు.

## లారీని ఢీకొన్న అంబులెన్స్

### ఆరుగురు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీని ఓ అంబులెన్స్ ఢీ కొనడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొద్ది రోజుల క్రితం కడుపు నొప్పితో ఘటల్ ఆస్పత్రిలో చేరిన ఓ రోగిని శుక్రవారం రాత్రి మేదినిపుర్‌కు అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. కేశపుర్ పంచమి సమీపంలోకి రాగానే అంబులెన్స్, సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సహా ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

# భయం, గందరగోళం పటాపంచలు

### ఉప ఎన్నికల ఫలితాలపై రాహుల్, ఖర్గే



**న్యూఢిల్లీ :** ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ‘ఇండియా’ కూటమి 10 స్థానాల్లో విజయకేతనం ఎగురవేయడంపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఏడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో బిజెపి అల్లిన భయం, గందరగోళం పటాపంచలు అయ్యాయని అన్నారు. రైతులు, యువకులు, కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులు సహా ప్రతి ఒక్కరూ నియంతృత్వాన్ని పూర్తిగా అంతమొందించి న్యాయపాలనను కోరుకుంటున్నారని, ప్రజలు మెరుగైన జీవితాలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమికి బాసటగా నిలబడుతున్నారని సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో రాహుల్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల రాజకీయ విశ్వసనీయత పడిపోయిందనడానికి అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఇండియా కూటమిగా మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ గెలుపు కోసం కఠోర పరిశ్రమ చేసిన కార్యకర్తలకు సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. బిజెపి దురహంకారం, తప్పులతడక పాలన, నెగెటివ్ రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టారనడానికి ఇండియా కూటమి విజయమే బలమైన నిదర్శనమని చెప్పారు. కాగా, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్వేష వ్యాప్తి కారణంగానే ప్రజలు బిజెపిపై అసంతృప్తితో ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం అన్నారు. గెలుపొందిన కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అభినందనలు తెలిపారు.

**హిమాచల్‌లో వ్యూహం ఫలించలేదు**

హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు, ఉత్తరాఖండ్‌లోని రెండు స్థానాలను కూటమి కైవసం చేసుకోవడంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ.. ఉత్తరాఖండ్‌లోని మంగలౌర్ స్థానాన్ని కూటమి భాగస్వామి సమాజ్ వాదీ పార్టీ కైవసం చేసుకొంది. బద్రీనాథ్‌లో లోక్‌సభ ఎన్నికల సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరారు. కానీ, అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకుని ఆయనకు తగిన బుద్ధి చెప్పారు’ అని ఎక్స్ వేదికగా విమర్శించారు. బిజెపి కుట్రను ప్రజలు తమ ఓట్లతో తిప్పికొట్టారు. వారి వ్యూహాలు భగ్నమయ్యాయి. ఈ ఫలితాలు దేశంలో రాజకీయా వాతావరణం మార్పును ప్రతిబింబిస్తోంది అనడంలో అతిశయోక్తి లేదు అని అన్నారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ రెండు స్థానాలు గెలుచుకోవడం.. బిజెపిపై ప్రజలకు ఉన్న అసహనానికి దర్పణం పడుతోందని హస్తం పార్టీ విమర్శించింది. కాగా.. 13 అసెంబ్లీ స్థానాలకు గాను విపక్ష కూటమి 10 చోట్ల విజయం సాధించింది. కాషాయ పార్టీ రెండు స్థానాలకు పరిమితమైంది.

## జమ్ము కశ్మీర్ ఎల్‌జికి మరిన్ని అధికారాలు

**న్యూఢిల్లీ :** వివిధ కేసులలో ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వడం, పోలీసుల విషయంలో, ఐఎఎస్, ఐపిఎస్ వంటి అఖిల భారత సర్వీసుల అధికారుల విషయంలో నిర్ణయం తీసుకోవడం వంటి అంశాలపై జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేంద్ర ప్రభుత్వం అధికారాలు కట్టబెట్టింది. అడ్వొకేట్ జనరల్, ఇతర న్యాయాధికారులు, అవినీతి నిరోధక శాఖ నియామకాల అధికారాన్ని కూడా ఎల్‌జికే దఖలు చేసింది. కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019 విడుదల చేసిన నిబంధనలలో ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం సవరణలు తీసుకువచ్చింది. ఆర్టికల్ 370 రద్దు, జమ్మూ, కశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూ, కశ్మీర్, లద్ధాక్ కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్రం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన విషయం విదితమే. ‘ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ఉంచిన పోలీసు, పోలీసు ఆదేశాలు, అఖిల భారత సర్వీసు, అవినీతి నిరోధక శాఖ విషయంలో ఆర్థిక శాఖ ముందస్తు అనుమతి అనే ప్రతిపాదనతో సంబంధం లేకుండా లెఫ్టినెంట్ గవర్నర్ విచక్షణకే ఆమోదం లేదా తిరస్కార అధికారాలను కట్టబెడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అంతే కాకుండా ‘అడ్వొకేట్ జనరల్, ఎజికి సహకరించే ఇతర న్యాయ అధికారుల నియామకానికి సంబంధించి న్యాయం,చట్టం, శాసనవ్యవహారాల విభాగం ప్రతిపాదనలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , ముఖ్యమంత్రి ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోద ముద్రకు పంపించాలని నిబంధనలను మార్చారు. ఈ నిబంధనను ప్రధాన నిబంధనలలో రూల్ 42 తరువాత కింద చేర్చారు. అలాగే ప్రాసిక్యూషన్‌కు అనుమతించడం, అప్పీల్ దాఖలు చేయడం వంటి ప్రతిపాదనలను కూడా ప్రధాన కార్యదర్శి ద్వారా ఎల్‌జికి పంపాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పరిపాలన కార్యదర్శులు, అఖిల భారత సర్వీసు అధికారుల పోస్టింగ్‌లను హోం శాఖ నుండి ఛీఫ్ సెక్రెటరీ ద్వారా ఎల్‌జికి పంపాలని కూడా నిబంధనలలో మార్చారు. వారి బదిలీలు ప్రతిపాదనలను కూడా అలాగే పంపాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

# వైభవంగా రథయాత్ర



**హైదరాబాద్ :** మియాపూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథ యాత్ర అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. హైదరాబాద్ చందానగర్ నుండి ప్రారంభమైన రథయాత్ర హరినామ సంకీర్తనలు, భజనలు, మహిళల కోలాటాల మధ్య, జై జగన్నాథ... జై జగన్నాథ అంటూ భక్తుల కేరింతల మధ్య కోలా హాలంగా ముందుకు సాగింది. ఇస్కాన్ ముఖ్య ప్రభుజీలు, ప్రవచనకారులు తొలుత జగన్నాతునికి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి, హరతులిచ్చి లంచనంగా రథ యాత్ర ప్రారంభించారు. మదీనగూడ, అల్విన్ క్రాస్ రోడ్ మియాపూర్ క్రాస్ రోడ్ జె పి నగర్ పుర వీధుల గుండా కొనసాగి విశ్వనాథ్ గార్డెన్ వద్ద ముగిసింది. భక్తుల సౌకర్యం కొరకు అల్పాహారం, మంచి నీరు అందించారు. భక్తులు ఉత్సహంగా రాథాన్ని తాడుతో లాగు తుండగా, మరోవైపు చీపురుతో శుభ్రం చేస్తూ అత్యంత ఉత్సహం గా జరిగింది. అనంతరం విశ్వనాథ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఇస్కాన్ కమ్యూనికేషన్ డైరెక్టర్, న్యూ ఢిల్లీ యుదిష్టర్ గోవింద్ దాస్, ముంబై టెంపుల్ అధ్యక్షులు కమల్ లోచన దాస్, తిరుపతి టెంపుల్ అధ్యక్షులు రేవతి రమణ దాస్, మియాపూర్ టెంపుల్ అధ్యక్షులు శ్రీరామ్ దాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు రవి కుమార్ యాదవ్, సంపత్, విష్ణువర్ధన్ యాదవ్ గోపరాజు శ్రీనివాస్, ఇస్కాన్ సభ్యులు దేవిశెట్టి శ్రీనివాస్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం అన్నదానప్రసాదం వితరణ జరిగింది.

## కేంద్ర సర్కార్ నిర్ణయంలో ఆశ్చర్యం లేదు

### రాజ్యాంగ హత్యాదినంపై ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ :** దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన జూన్ 25ను ఇకపై ఏటా 'రాజ్యాంగ హత్యా దినం' (సంవిధాన్ హత్యాదివస్)గా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. మోదీ సర్కార్ తీసుకున్న చర్యలపై మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ఇలా చేయడంలో వింతేమీ లేదని అని విమర్శలు గుప్పించారు. ‘దేశంలోని గొప్ప వ్యక్తులు కలిసికట్టుగా స్వాతంత్ర్యాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నారు. కానీ, కేంద్రంలోని మోదీ సర్కార్ ఎప్పటి నుంచో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోంది. దాన్ని రద్దు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతికూల రాజకీయాలకు పాల్పడేవారు ‘సంవిధాన్ హత్యాదివస్’ ప్రకటించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారు మాత్రమే పరిరక్షణ కోసం పోరాడుతున్నారు’’ అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారని.. కారణం లేకుండా లక్షలాది మందిని జైల్లో పెట్టారని ఎన్‌డిఎ సర్కార్ గుర్తు చేసింది. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను ‘సంవిధాన్ హత్యాదివస్’గా నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇదంతా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న మరో కపట ప్రచార ఎత్తుగడ అని పేర్కొంది.